TARAJYOTHI TELUGU DAILY
తారాజ్యోతి
తెలుగుదిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్
శనివారం, సెప్టెంబర్ 19, 2026 | సంపుటి - 20 | సంచిక 349 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

భారత నౌకను ఢీకొన్న పాక్ నౌక

పాక్ ప్రభుత్వ తీరుపై ఇండియా ఆగ్రహం

న్యూఢిల్లీ : భారత యుద్ధ నౌకను ఇటీవల పాక్ నౌక ఢీకొన్న సంగతి తెలిసిందే. ఈ నెల 15, సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఈ విషయంలో పాక్ ప్రభుత్వం స్పందించిన తీరుపై ఇండియా ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఈ అంశంపై శుక్రవారం మీడి యాతో మాట్లాడారు. పాక్ స్పందించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంలో పాకిస్తాన్ స్పందన సరిగ్గా లేదని, ఎప్పట్లాగే ధాటవేత ధోరణిని పాక్ అనుసరించిందన్నారు. 2

వైజాగ్‌కు దిగ్గజ సంస్థలు

డెలాయిట్ సహా, కీలక ఒప్పందాలు..!!

విశాఖపట్నం : విశాఖకు దిగ్గజ సంస్థలు రానున్నాయి. ఈ మేరకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం లో ఆమోదం లభించింది. ఈ సమావేశంలో మొత్తం 29 పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన పెట్టుబడులపై సీఎం చర్చించారు. దాదాపు రూ.22 వేల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన ప్రాజెక్టులపై ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఇందులో విశాఖ కేంద్రం గా ఏర్పాటు కానున్న దిగ్గజ సంస్థలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐబీపీ సమావేశం జరిగింది. అందులో రూ.526.25 కోట్ల పెట్టుబడులతో 10 ఐటీ ప్రాజెక్టకు ఆమోదం లభించింది. వీటి ద్వారా విశాఖపట్నంలో భారీగా ఐటీ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. విశాఖపట్నంలో దిగ్గజ సంస్థల ఏర్పాటుకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తరువాయి 2లో

విదేశాలకు మరోసారి జగన్

- సీబీఐ కోర్టు కీలక ఆదేశాలు..!!

మాజీ ముఖ్యమంత్రి జగన్ విదేశాలకు వెళ్లనున్నారు. ఈ మేరకు సీబీఐ కోర్టు అనుమతి కోరారు. కుటుంబ సభ్యులతో కలిసి యూపర్ పర్యటనకు వెళ్లేందుకు జగన్ ప్రణాళికలు సిద్ధం చేసారు. ఈ మేరకు కోర్టు అనుమతి కోరారు. తమ కుమార్తెల వద్దకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని పిటీషన్ దాఖలు చేసారు. 15 రోజుల పాటు జగన్ యూరప్ పర్యటన కొనసాగనుంది. ఈ పిటీషన్ పైన విచారణ చేసిన సీబీఐ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కాగా.. స్థానిక ఎన్నికల వేళ జగన్ విదేశీ పర్యటన ఆసక్తి కరంగా మారుతోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 30 లోపు యూరప్ వెళ్లేందుకు అనుమతి ఇస్తూ కొన్ని షరతులు విధించింది. యూరప్ పర్యటనకు వెళ్లే దు సీబీఐ కోర్టు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. విదేశీ పర్యటన సమయంలో అందుబాటులో ఉండే కాంటాక్ట్ నంబర్ తరువాయి 2లో

22 ఏ భూములపై
సీఎం రేవంత్ కీలక నిర్ణయం

సమస్యల పరిష్కారానికి హైలెవల్ కమిటీ

హైదరాబాద్ : తెలంగాణలో ఇప్పుడు సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారం హాట్ హాట్ గా సాగుతోంది. దీనిపై ప్రతిపక్షాలు రేవంత్ సర్కార్ ను టార్గెట్ చేస్తున్నాయి. ఈ క్రమంలో గత కొంతకాలంగా భూ యజమానులను కలవరపెడుతున్న 'సెక్షన్ 22ఏ' నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై రాష్ట్రప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక హై-లెవల్ కమిటీని ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీచేసింది. భారత రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం.. ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలు, ప్రభుత్వ ఆస్తులు, మరియు రక్షణ అవసరాలకు సంబంధించిన కొన్ని కీలక ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడానికి అధికారం ఉంటుంది. దీని ఆధారంగా రిజిస్ట్రేషన్ శాఖ ప్రొహిబిటెడ్ ప్రాపర్టీస్ లిస్ట్ ను నిర్వహిస్తుంది. అయితే సాధారణంగా ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, దేవాదాయ శాఖకు చెందిన, లేదా వక్ఫ్ ఆస్తులు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తులు ఈ జాబితాలో ఉంటాయి. ఈ జాబితాలో ఉన్న సర్వే నంబర్లకు సంబంధించిన భూముల అమ్మకాలు, కొనుగోళ్ళు సాధ్యం కావు. రికార్డుల డిజిటలైజేషన్ మరియు పాత డేటా నమోదులో జరిగిన కొన్ని సాంకేతిక లోపాల వల్ల తరువాయి 2లో

దానం నాగేందర్‌పై
అనర్హత వేటు

హైకోర్టు సంచలన తీర్పు..!!

హైదరాబాద్ : దానం నాగేందర్‌కు హైకోర్టులో ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. దానం నాగేందర్ పై హైకోర్టు అనర్హత వేటు వేసింది. ఈ వ్యవహారం పై హైకోర్టులో కీలక వాదనలు జరిగాయి. దానం బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరటం పైన హైకోర్టులో దాఖలైన పిటీషన్ ను న్యాయస్థానం విచారణ చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో కీలకంగా మారింది. ఈ పిటీషన్ ను విచారణ చేసిన న్యాయస్థానం ఈ రోజు తీర్పు వెల్లడించింది. 2లో

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ
ఎన్నికలకు రంగం సిద్ధం..

ఓటర్ల జాబితాకు షెడ్యూల్ విడుదల!

హైదరాబాద్ : తెలంగాణలో త్వరలో మరో ఎన్నికల నగారా మోగనుంది. శాసనమండలికి సంబంధించి కీలకమైన పట్టభద్రుల గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు వేగవంతం చేసింది. వచ్చే ఏడాది 2027 మార్చి నెలలో పదవీకాలం ముగియనున్న మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ అలాగే వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఖాళీలు ఏర్పడనున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా సమగ్ర ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు ఎన్నికల అధికార యంత్రాంగం అధికారికంగా పూర్తిస్థాయి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 28వ తేదీన ఓటర్ల జాబితా తయారీకి సంబంధించి ప్రజా నోటీసును విడుదల చేయనున్నారు. ఈమేరకు వరంగల్-ఖమ్మం- నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ స్థానానికి సంబంధించిన ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రక్రియలో అర్హులైన గ్రాడ్యుయేట్ ఓటర్ల వివరాలతో జాబితాను సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28నుండి నవంబర్ ఆరో తేదీ వరకూ 01/11/2026 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి కనీసం 3 సంవత్సరాలు పూర్తవ్వాలని పేర్కొన్నారు. సాధారణ శాసనసభ, సార్వత్రిక ఎన్నికల్లాగా ఈ ఓటర్ల జాబితా శాశ్వతం కాదని 2లో

రేవంత్..మా ఆస్తులన్నీ
తీసుకో

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఆస్తుల ఆరోపణల వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబానికి ఏకంగా రూ. లక్ష కోట్ల ఆస్తులు ఉన్నాయంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుసగా చేస్తున్న వ్యాఖ్యలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వినూత్న రీతిలో ఎదురుదాడికి దిగారు. ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరైన అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, సీఎం ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ నేరుగా ఒక బహిరంగ సవాల్ విసిరారు.

హైదరాబాద్ : రూ. 99 వేల కోట్లతో హామీలు నెరవేర్చుకోండి! "మా కుటుంబానికి రూ. లక్ష కోట్ల ఆస్తులు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే చెప్తున్నారు. నేను ఆయనకో మంచి ఆఫర్ ఇస్తున్నా.. రూ. లక్ష కోట్లు వద్దు, కేవలం రూ. 1,000 కోట్లు మాకు ఇచ్చి మా కుటుంబ ఆస్తులన్నింటినీ ఆయనే సొంతం చేసుకోవచ్చు. ఆ తర్వాత మిగిలే రూ. 99 వేల కోట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన రైతు భరోసా, రూ. 2 లక్షల రుణమాఫీ, మహిళలకు నెలకు రూ. 2,500 మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీలను నెరవేర్చుకోవచ్చు" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం.. ఆ వైఫల్యాల నుంచి జనం దృష్టి మళ్లించేందుకే తమ కుటుంబంపై అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. 2లో

కుల గణనలో
బీసీలకు అన్యాయం జరగొద్దు

కేంద్రానికి కల్వకుంట్ల కవిత వార్నింగ్!

హైదరాబాద్ : బీసీ కులాల జనాభాను తక్కువగా చూపి.. వారు ఐక్యంగా పోరాడకుండా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. జనగణనలో ఓబీసీ కాలాన్ని కులాల వారీగా చూపకుండా బలహీన వర్గాలను కులాల సముహాలుగా విడగొట్టి ఐక్య పోరాటాలు జరగకుండా ప్రయత్నాలు చేస్తోందన్నారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్, సకల జన సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్" సదస్సులో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. కేంద్రం చేపట్టే కులగణనలో 2లో

ఎల్‌నినో పరిస్థితులపై
తెలంగాణ అసెంబ్లీ తీర్మానం

రూ.20 వేల కోట్ల ప్యాకేజీ డిమాండ్

హైదరాబాద్ : తెలంగాణ శాసనసభలో ఎల్‌నినో తీవ్ర ప్రభావం, కరువు పరిస్థితులపై శాసన సభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయం అందించాలని కోరుతూ ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన తీర్మానాలకు తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. తీర్మానం లోని ముఖ్యమైన డిమాండ్లు కేంద్ర బృందం పర్యటన: రాష్ట్రంలో ఎల్‌నినో సృష్టించిన నష్టాలను, తీవ్రతను నేరుగా అంచనా వేయడానికి తక్షణమే ఒక కేంద్ర బృందాన్ని తెలంగాణకు పంపాలి. 2లో

భారత నౌకను ఢీకొన్న పాక్ నౌక

అలాగే, పాకిస్తాన్ చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ అరేబియా సముద్రంలో ఐఎన్ఎస్ కోల్‌కతా నౌక సాధారణంగా గస్తీ నిర్వహిస్తుండగా.. పాకిస్తాన్‌కు చెందిన నేవీ నౌక హున్షైన్ వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో పాక్ నౌక వ్యవహరించిన తీరు అనైతికంగా ఉంది. ఇది ఇండియా-పాకిస్తాన్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఆర్టికల్ 10ని ఉల్లంఘించడమే. ఏప్రిల్, 1991లో కుదిరిన ఒప్పందంను అనుసరించి.. పీఎన్ఎస్ హున్షైన్ నౌక ప్రమాదకరంగా వ్యవహరించిందన్నారు. అలాగే, అంతర్జాతీయ సముద్ర జలాల్లో ప్రమాదాలు జరగకుండా ఉన్న చట్టాల్ని కూడా పాకిస్తాన్ ఉల్లంఘించిందని రణధీర్ జైశ్వాల్ ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు.. రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంపై పాకిస్తాన్ ఆర్మీ అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. భారత నౌకను ఢీకొన్న ఘటనలో పాకిస్తాన్ నౌక ఎక్కువగా ధ్వంసమైనట్లు సమాచారం. అయితే, భారత నౌకకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఘటన తర్వాత భారత నౌక సముద్ర జలాల్లో ఎప్పట్లాగే ప్రయాణించింది.

ఎల్‌నినో పరిస్థితులపై తెలంగాణ అసెంబ్లీ తీర్మానం

రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ: ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు, పునర్నిర్మాణ చర్యల కోసం తెలంగాణకు రూ. 20 వేల కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీని మంజూరు చేయాలి. సహాయ నిధుల విడుదల: జాతీయ విపత్తు స్పందన నిధి నుంచి తగిన ఆర్థిక సాయం అందించడంతో పాటు, రాష్ట్ర విపత్తు స్పందన నిధి లో రావాల్సిన కేంద్ర వాటాను తక్షణమే విడుదల చేయాలి. ఉపాధి హామీ రోజుల పెంపు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం ఇస్తున్న 125 రోజులకు అదనంగా మరో 50 రోజుల ఉపాధిని కల్పించాలి. ఈ అదనపు 50 రోజుల వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా భరించాలి. విద్యుత్, బొగ్గు కేటాయింపులు: రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు అదనంగా 1,500 మెగావాట్ల విద్యుత్‌ను కేటాయించాలి. అలాగే రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు 5 మిలియన్ టన్నుల బొగ్గు లింకేజీని కల్పించాలి. పరిమితి పెంపు: రాష్ట్ర ఆర్థిక సామర్థ్యాన్ని, వ్యయాన్ని పెంపొందించుకోవడానికి ఎఫ్ఆర్‌బీఎమ్ రుణ పరిమితిని 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలి. రైతులు, తాగునీటి రక్షణ: ఉపాధి, తాగునీరు, పశుగ్రాసం సరఫరా, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల మట్టాన్ని పెంచే చర్యల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అదనపు ఆర్థిక సాయాన్ని అందించాలి.

వైజాగ్‌కు దిగ్గజ సంస్థలు

డెలాయిట్ భారీ పెట్టుబడి పెట్టేందుకు అంగీకారం తెలిపింది. విశాఖలో 2,500 సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఆపరేషన్స్ సెంటర్ ఏర్పాటుకు రూ.43.75 కోట్ల పెట్టుబడితో డెలాయిట్ ప్రణాళికకు ఆమోదం లభించింది. అదే విధంగా వైజాగ్ వేదికగా ఐటీ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆపరేషన్స్ కోసం 2,400 సీట్లతో రూ.100 కోట్ల పెట్టుబడితో ముత్తూట్ ఫిన్‌కార్ప్ ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసారు. నేడు ఆమోదం పొందిన 10 ఐటీ ప్రాజెక్టులో 7 క్వాంటం ప్రాజెక్టులు ఉన్నాయి. దుగ్గరాజపట్నంలో పోర్టు కోసం విశాఖను గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చే దిశగా ఎస్ఐపీబీ సమావేశంలో పలు ఐటీ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేసారు. ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల్లో 359 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. రూ.13.84 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.59 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సమావేశంలో కొత్త పెట్టుబడుల ప్రతిపాదనలతో పాటు పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల అమలు, ఉద్యోగాల కల్పనకు సంబంధించిన అంశాలపై చర్చించి..కొత్త నిర్ణయాలు తీసుకున్నారు. అదే విధంగా దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు దిశగా ఎండీఎల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఎంవోయూ చేసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.15,000 కోట్ల పెట్టుబడితో 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏడాదికి 12 లక్షల టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యాన్ని ఈ గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ కలిగి ఉంది.

విదేశాలకు మరోసారి జగన్

ఈ-మెయిల్ సీబీఐ అధికారులకు ఇవ్వాలని ఆదేశాల్లో కోర్టు స్పష్టత ఇచ్చింది. కుటుంబంతో కలిసి యూరప్ దేశాల్లో పర్యటించేందుకు దాదాపు 25 రోజుల సమయం కావాలని కోరుతూ జగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉండి, ప్రస్తుతం బెయిల్ మీద ఉన్నందున జగన్ విదేశాలకు వెళ్లాలంటే ప్రతిసారి కోర్టు అనుమతి తప్పనిసరి. ఆయన పాస్‌పోర్ట్ ప్రస్తుతం కోర్టు స్వాధీనంలోనే ఉంది. స్థానిక ఎన్నికల వేళ విదేశాలకు జగన్ జగన్ కుమార్తెలు ఇద్దరూ లండన్‌లోనే ఉన్నత చదువులు పూర్తి చేసి, అక్కడే స్థిరపడ్డారు. గతంలో వారి గ్రాడ్యుయేషన్ డే కోసం కూడా జగన్ లండన్ వెళ్లి వచ్చారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 30వ తేదీ మధ్య యూరప్ వెళ్లేందుకు అనుమతి రావటంతో.. స్థానిక ఎన్నికల షెడ్యూల్ కు అనుగుణంగా టూర్ తేదీలు ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ పర్యటనకు వెళ్లేందుకు అనుమతి కోసం జగన్ రూ. లక్ష పూచీకత్తు సమర్పించాలని, పర్యటన ముగించుకుని వచ్చాక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలకు హాజరు కావాలని కోర్టు స్పష్టం చేసింది. అధికారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్న ప్రధాన షరతుతో జగన్ విదేశీ ప్రయాణానికి మార్గం సుగమమైంది. దీంతో. .. జగన్ కుటుంబ సభ్యులతో కలిసి విదేశాలకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. పార్టీ నేతలతో చర్చించి.. టూర్ షెడ్యూల్ ఫిక్స్ చేస్తారని చెబుతున్నారు.

ఖైరతాబాద్ ఉపఎన్నికల్లో దానం పోటీ చేయొచ్చా? చట్టం ఏం చెబుతోంది?

బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ లోకి ఫిరాయించడమే కాకుండా, గత లోక్ సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ బీఫారంతో పోటీ చేసి దొరికిపోయి అనర్హత వేటు పడిన దానం నాగేందర్ పరిస్థితి ఎలా మారబోతోంది ?, తెలంగాణ హైకోర్టు తీర్పు ప్రకారం దానం నాగేందర్ పై అనర్హత వేటు ఖరారైంది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తానంటూ కోర్టులో చెప్పిన దానం.. ఆ తర్వాత మనసు మార్చుకున్నారు. సుప్రీంకోర్టుకు వెళ్లబోనని తేల్చిచెప్పేశారు. అయితే ఇప్పుడు దానంపై వేటుతో ఖాళీ అయిన ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో ఆయన పోటీ చేసే అవకాశం ఉందా లేదా అన్న చర్చ జరుగుతోంది. దానం నాగేందర్ పై రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం తెలంగాణ హైకోర్టు పార్టీ ఫిరాయించినందుకు అనర్హత వేటు వేసింది. ఈ కారణంతో అనర్హత వేటు వేస్తే తిరిగి తదుపరి జరిగే ఉపఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించే నిబంధన ఏదీ లేదు. దీంతో ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో దానం నాగేందర్ పోటీ చేసేందుకు అవకాశం ఉంది. ఆయనపై ఆరేళ్ల పాటు అనర్హత వేటు పడినట్లు జరుగుతున్న ప్రచారంలో కూడా వాస్తవం లేదు. అందుకే ఆయన హైకోర్టు తీర్పు తర్వాత కీలక వ్యాఖ్యలు చేశారు. తనపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ పేర్కొన్నారు. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని కూడా తేల్చిచెప్పేశారు. అలాగే ప్రజా క్షేత్రంలో, ఎన్నికల్లో కొట్లాడతానని, ఎన్నికల్లో పోరాడటం తనకు కొత్తేమీ కాదని దానం స్పష్టం చేశారు. పోరాటాలు చేసే ఈ స్థాయికి వచ్చానని, ఎన్నికలు వస్తే ప్రజా క్షేత్రంలో పోరాడతానంటూ ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీ చేస్తానని పరోక్షంగా ఆయన వెల్లడించారు. దీంతో ఖైరతాబాద్ లో జరిగే ఉప ఎన్నికల్లో దానంను గెలిపించుకోవాల్సిన పరిస్థితి రేవంత్ రెడ్డి సర్కార్ కు ఎదురుకాబోతోంది.

22 ఏ భూములపై సీఎం రేవంత్ కీలక నిర్ణయం

చట్టబద్ధమైన ప్రైవేట్ ఆస్తులు కూడా పొరపాటున ఈ నిషేధిత జాబితాలోకి చేరిపోయాయి. ఒకే సర్వే నంబర్‌లో కొంత ప్రభుత్వ భూమి ఉండి, మిగతాది ప్రైవేట్ వ్యక్తులదైనా సరే.. మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో ట్యాగ్ చేయడంతో అసలు యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ భూములను అమ్ముకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక యజమానులు సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా స్పష్టతనిచ్చారు. బాధితుల నుంచి వస్తున్న విజ్ఞప్తులు, దరఖాస్తులను పరిశీలించి సత్వర పరిష్కారం అందించేందుకు సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో కూడిన హై-లెవల్ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ రాబోయే 30 రోజుల్లోగా అర్హులైన భూ యజమానుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించనుంది. అవసరమైతే చట్ట సవరణలు చేసి, జిల్లాల వారీగా అడ్డంకులను తొలగించి ప్రజలకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం ప్రణాళిక చేయనుంది.

దానం నాగేందర్‌పై అనర్హత వేటు

బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, ఆ తర్వాత కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన దానంపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను స్పీకర్ కొట్టివేసారు దీంతో.. ఇదే అంశం పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేసింది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్.. ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని, పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, కే వివేక్‌రెడ్డి ఇప్పటికే హైకోర్టుకు తెలిపారు. ముఖ్యంగా దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో అత్యంత కీలక ఆధారమని తమ వాదనల్లో స్పష్టం చేసారు. అదే విధంగా పార్టీ ఫిరాయింపును నిర్ధారించేందుకు అసెంబ్లీ లోపల ఎమ్మెల్యే వ్యవహరించిన తీరును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాల న్న స్పీకర్ వైఖరిని పిటిషనర్లు వ్యతిరేకించారు. మరో పార్టీ తరఫున పోటీచేయడం ద్వారా అసలు పార్టీ పట్ల తన రాజకీయ అనుబంధాన్ని వదులుకు న్నట్టు స్పష్టమవుతున్నప్పుడు వేరే ఆధారాల కోసం చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. స్పీకర్ నిర్ణయం న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటుందని, స్పీకర్ అధికారాలు అపరిమిత మైనవి కావని వాదించారు. పిటిషనర్ల వాదనలతో దానం నాగేందర్ న్యాయవాది వ్యతిరేకించారు. ఆయన బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వాన్ని తీసుకున్నట్టు ఎకడా ప్రకటించలేదని తెలిపారు. దానం ఇప్పటికీ అసెంబ్లీ రికార్డుల్లో బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని చెప్పారు. దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసినంత మాత్రాన అసెంబ్లీ సభ్యత్వం కోల్పోయినట్టు భావించరాదని వాదించారు. వాదనలు విన్న తరువాత ధర్మాసనం దానం నాగేందర్ పై అనర్హత వేటు వేస్తూ తీర్పు వెల్లడించింది. దీంతో.. ఖైరతాబాద్ కు ఉప ఎన్నిక జరగనుంది.

కుల గణనలో బీసీలకు అన్యాయం జరగొద్దు

బీసీ జనాభా విషయంలో ఎలాంటి గందరగోళం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కేవలం క్యాస్ట్ కాలం పెట్టేసి చేతులు దులుపుకుంటామంటే ఊరుకునేది లేదన్నారు. ప్రతి రాష్ట్రంలో ఉన్న కులాల జాబితాను కచ్చితంగా అప్‌లోడ్ చేయాలని, అదే విధంగా ఉపకులాలను కూడా కలిపి లెక్కించాలి. లేదంటే బీసీల జనాభా తక్కువగా కనిపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకే కులానికి సంబంధించి దేశంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో స్టేటస్ ఉందని...ఆ సమస్యను పరిష్కరించాలంటే బీసీ కులాల ఉపకులాలను కూడా కలిపి లెక్కించటం జరగాలన్నారు. లేదంటే ఉప కులాల్లో ఉండే వారికి న్యాయం జరగదని వారిని కూడా ఒక కులంగా లెక్కల్లో చూపే ముప్పు ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ లో ఉన్న 57 ఉపకులాల కారణంగా ఉప కులాల్లో వారికి న్యాయం జరగటం లేదన్న విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. అయినప్పటికీ వేల కోట్లు ఖర్చు చేస్తూ బీసీ జనగణనలో కూడా పరిష్కారం లేకుండా చేయటం సరికాదన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కుల గణన పేరుతో బీసీ జనాభాను తక్కువ చేసి చూపిందని కవిత పేర్కొన్నారు. కేంద్రం చేపట్టే కుల గణన ద్వారా ఆ సమస్య తీరుతుందని భావిస్తే...వాళ్లు సమస్యను మరింత జఠిలం చేస్తున్నారని మండిపడ్డారు. కుల గణనకు సంబంధించి మరో నాలుగు నెలల సమయం ఉందని...ఈ లోగా కేంద్రం ఈ సమస్య పరిష్కరించటంపై దృష్టి సారించాలన్నారు. మన డీఎన్ఏలోనే కుల వివక్ష కుల వివక్ష అనేది మన డీఎన్ఏలోనే పాతుకుపోయిందని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి, స్పీకర్ లాంటి వాళ్లు కూడా కుల వివక్షకు గురికావటం అన్యాయమన్నారు. ఈ జఠిలమైన సమస్యకు పరిష్కారం అవసరమన్నారు. ఈ సమస్యకు అప్పర్ కాస్ట్, బాధితుడు అనే రెండు కోణాలున్నాయని.. బాధితుడి కోణం నుంచి చూసినప్పుడు మాత్రమే సరైన పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మారోజు వీరన్న చెప్పినట్లుగా ప్రతి కులాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరముందన్నారు. రాజ్యాధికారంతో పాటు ఆర్థికంగా ఆయా కులాలను బాగు చేయాలని.. అధికారంలో ఉన్న పార్టీలే ఆ బాధ్యత తీసుకోవాలని చెప్పారు. చట్టాల పరంగా ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ ఆలోచన విధానంలో మార్పు వచ్చినప్పుడే కుల వివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలకు వేతనం ఇవ్వాలి పురుషులతో సమానంగా పనిచేసినప్పటికీ మహిళలకు వేతనాల్లో వ్యత్యాసం చూపించటం అన్యాయమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతన చట్టాలు ఉన్నప్పటికీ.. 2026లో కూడా వేతన వ్యత్యాసం చూపుతున్నారన్నారు. శుక్రవారం అంతర్జాతీయ సమాన వేతన దినోత్సవం సందర్భంగా ఈ అంశంపై ఎక్స్ లో ట్వీట్ చేశారు. మహిళల శ్రమకు సమానమైన విలువ ఇచ్చినప్పుడు మాత్రమే నిజమైన పురోగతి సాధ్యమవుతుందన్నారు.

పేదల ఖాతాల్లో లక్ష కోట్లు వేస్తావా?..

మాకున్న ప్రతి ఇంచు భూమి రాసిస్తాం..!

పేదల ఖాతాల్లో లక్ష కోట్లు వేస్తామంటే తమ పేరిట ఉన్న ఇంచు భూమిని కూడా రాసిస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (ఖు=) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (=వఝుత్ష్ట్ర =వసఎఎ)కి బంపర్ ఆఫర్ ఇచ్చారు. తమ కుటుంబానికి లక్ష కోట్ల భూములు ఉన్నాయంటూ సీఎం చేసిన ఆరోపణలపై సవాల్ విసిరిన కేటీఆర్ పాలనా వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఆయన అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని ఎక్స్ పోస్ట్‌లో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణల్లో ఒక్క శాతం కూడా నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. తమ పేరుతో ఉన్న ఆస్తులన్నింటినీ రాసిస్తామని, రాష్ట్రంలోని పేద ప్రజల ఖాతాల్లో రూ.లక్ష కోట్లు వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.స్థానిక సేవలను పొందండి "సీఎం రేవంత్.. నువ్వు చేసిన ఆరోపణల్లో ఒక్కటంటే ఒక్క శాతం నిజం లేకపోయినా.. నీకు ఓ ఆఫర్ ఇస్తున్నా. మా కుటుంబానికి లక్ష కోట్ల భూములంటూ పనిగట్టుకుని చేస్తున్న విష ప్రచారంపై నీకు ఓ సవాల్ విసురుతున్నా. మాకున్న ఆస్తులన్నీ రాసిస్తాం.. రాష్ట్రంలోని పేద ప్రజల ఖాతాలో రూ.లక్ష కోట్లు వేస్తావా?" అని కేటీఆర్ ప్రశ్నించారు తెలంగాణలోని పేద ప్రజల ఖాతాల్లో వెంటనే రూ.లక్ష కోట్లు వేస్తానంటే తమ పేరుతో ఉన్న ప్రతి ఇంచు భూమిని ఉన్నపళంగా రాసిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. పేదల ఖాతాల్లో లక్ష కోట్ల రూపాయలు వేసేంత ధైర్యం లేకుంటే తనపై చేస్తున్న ప్రచారాన్ని ఇకనైనా ఆపి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "నీ పిచ్చి ప్రచారాన్ని ఇకనైనా మానుకుని వెంటనే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పు" అని అన్నారు. అప్పుడు వెయ్యి.. ఇప్పుడెలా లక్ష కోట్లుకేసీఆర్ కుటుంబానికి వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ఇంతకాలం చేసిన ప్రచారం బెడిసికొట్టడంతో ఇప్పుడు లక్ష కోట్ల భూములంటూ రేవంత్ రెడ్డి కొత్త ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఉన్నది 67 ఎకరాలు మాత్రమేనని రేవంత్ రెడ్డే అసెంబ్లీలో స్వయంగా అంగీకరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్తు చేశారు. అలాంటప్పుడు మళ్లీ కుతంత్రాలతో కట్టుకథలు అల్లుతున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలు విషయంలో జరిగిన మోసాల నుంచి, 22ఏ భూముల అంశం నుంచి నాలుగు కోట్ల మంది ప్రజల దృష్టిని ఇలాంటి ఆరోపణలతో మళ్లించలేరని ఆయన స్పష్టం చేశారు. "నువ్వు చేసిన ఆరోపణల్లో విషం తప్ప విషయం లేదు. అందులో అసత్యాల వరద, అబద్ధాల బురద తప్ప ఒక్కటంటే ఒక్క శాతం నిజం లేదని తెలిసినా ఎందుకీ కుప్పిగంతులు?" అని సీఎంను సూటిగా కేటీఆర్ ప్రశ్నించారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందంటూ ఇలాగే దుష్ప్రచారం చేశారని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటివరకు ఒక్క పైసా అవినీతిని కూడా నిరూపించలేకపోయారని ఆయన అన్నారు. ఇప్పుడు కేసీఆర్ కుటుంబానికి లక్ష కోట్ల భూములంటూ మరోసారి ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు వాటిని నమ్ముతారని భావించడం సరికాదని ముఖ్యమంత్రికి ఆయన హితవు పలికారు.కొత్త చట్టాలను పరిశీలించండి ప్రాణ త్యాగానికి సిద్ధపడి.. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడి, నాలుగు కోట్ల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్ జీవితం తెరిచిన పుస్తకమని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలు, యూరియా సంక్షోభం, సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాన ప్రతిపక్షంపై సీఎం బురదజల్లడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, వెయ్యి రోజులు గడిచినా పది శాతం ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. తన పాలనా వైఫల్యాలను ఇలాంటి ప్రచారంతో కప్పిపుచ్చలేరని ఆయన పేర్కొన్నారు. పవిత్రమైన అసెంబ్లీలో అసత్యాలు, అభూత కల్పనలతో మాట్లాడి చట్టసభ గౌరవానికి రేవంత్ రెడ్డి భంగం కలిగించారని కేటీఆర్ ఆరోపించారు. ఇది క్షమించరాని విషయమని పేర్కొన ఆయన.. 22ఏ కింద కోటి 20 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చడం వెనుకే సీఎం చెబుతున్న లక్ష కోట్ల భూముల కుంభకోణం దాగి ఉందని ఆరోపించారు. అక్రమ దందాలు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో అడ్డదారిలో అధికారంలోకి వచ్చారని రేవంత్ రెడ్డిని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. దోచుకోవడం, కుంభకోణాలు చేయడం తప్ప ఆయనకు పరిపాలన చేతకాదని ప్రజలకు అర్థమైందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి ఏర్పడగానే కాంగ్రెస్ ప్రభుత్వంలోని అవినీతి, అక్రమాలు, కుంభకోణాలన్నింటినీ బయటపెడతామని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ ప్రజల సాక్షిగా దోచుకున్న ప్రతి పైసాను కక్కిస్తామని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ అన్నారు

రేవంత్.. మా ఆస్తులన్నీ తీసుకో

ఫార్ములా-ఈ రేసు.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్! ఫార్ములా-ఈ రేసు కేసుపై స్పందిస్తూ, హైదరాబాద్ నగరాన్ని ఎలక్ట్రిక్ వాహన రంగానికి ప్రపంచ స్థాయి కేంద్రంగా మార్చాలనే మంచి ఉద్దేశంతోనే ఆనాడు ఈ పోటీలను ఏర్పాటు చేశామని కేటీఆర్ స్పష్టం చేశారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులు మోటార్ స్పోర్ట్స్‌ను ప్రోత్సహించడానికి లండన్ వరకు వెళు ్తంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం రాజకీయ కక్షసాధింపుతో హైదరాబాద్‌కు వచ్చిన అంతర్జాతీయ ఈవెంట్‌ను రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానాలపై తమకు పూర్తి నమ్మకం ఉందని, ఎన్నిసార్లు పిలిచినా విచారణకు సహకరిస్తామని, చివరికి న్యాయమే గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కోర్టు విచారణ వాయిదా! హెచ్ఎండిఏ నిధుల బదిలీలో నిబంధనలు పాటించలేదంటూ ఏసీబీ నమోదు చేసిన కేసులో కేటీఆర్‌తో పాటు అప్పటి ప్రభుత్వ అధికారులు అరవింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డి తదితరులు శు క్రవారం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను అక్టోబర్ 30కి వాయిదా వేసింది. పాలనను పక్కనబెట్టి ప్రతిపక్షాలను వేధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెప్తారని కేటీఆర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధం..

ప్రతి ఎన్నికకూ మునుపటి ఓటర్ల జాబితా రద్దవుతుంది, కాబట్టి గతంలో ఓటు హక్కు ఉన్నవారైనా తప్పనిసరిగా కొత్తగా ఫారం-18 ద్వార దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి ఫారం-18 దరఖాస్తులను సమర్పించాల్సి ఉండగా, దానికి నవంబర్ 6వ తేదీని తుది గడువుగా ఖరారు చేశారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నవంబర్ 20వ తేదీ నాటికి ముసాయిదా ఓటర్ల జాబితా ముద్రణ పనులు పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత నవంబర్ 25వ తేదీన అధికారికంగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ముసాయిదా జాబితా విడుదలైన నాటి నుంచి, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, మార్పులు చేర్పులు లేదా క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు మరియు విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించి డిసెంబర్ 25 నాటికి వాటిని పూర్తిగా పరిష్కరించనున్నారు. అన్ని ప్రక్రియలు ముగిసిన తర్వాత డిసెంబర్ 30వ తేదీన పట్టభద్రుల నియోజకవర్గాల తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. గతంలో పాత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ, నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరూ ఈసారి కొత్తగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి.

హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు

మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ (ఖుఖుఎ చీుస్త్రవఅఎవతీ) పై హైకోర్టు (ఎఱస్త్రష్ట్ర జశీబతీ) అనర్హత వేటు వేయడం కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టులాంటిదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. హైకోర్టు తీర్పు బీఆర్ఎస్ స్వాగతిస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి , కాంగ్రెస్ పార్టీలో చేరి, అదే పార్టీ తరఫున సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు కీలకమైన పరిణామమని పేర్కొన్నారు. దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు పక్కనపెట్టిందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా వ్యవహరించిందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఇతర ఎమ్మెల్యేలకు కూడా ఈ తీర్పు ఒక స్పష్టమైన గుణపాఠమని అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవించాలి. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం మానుకోవాలని సూచించారు.

ఆర్టీసీలో మోగిన ఎన్నికల నగారా .. అక్టోబర్ 9న పోలింగ్..!

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 18: ఆర్టీసీలో ఎన్నికల నగారా మోగింది. సుమారు ఎనిమిదేళ్లుగా అందరూ ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం(యూనియన్) ఎన్నికలకు ఎట్టకేలకు ఆర్టీసీ యాజమాన్యం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర కార్మిక శాఖ అధికారికంగా విడుదల చేసింది. అక్టోబర్ 9న పోలింగ్, 17న ఫలితాలు వెలువడనున్నాయి. దీంతో వరంగల్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఆర్టీసీలో గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. సెప్టెంబర్ 21వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. అక్టోబర్ 9న ఓటింగ్ నిర్వహిస్తారు. అక్టోబర్ 17న ఓట్ల లెక్కింపు పూర్తిచేసి విజేతలను ప్రకటించనున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం వెల్లడించింది. దాంతో.. వరంగల్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపోల్లో(హనుమకొండ, వరంగల్-1, వరంగల్-2, నర్సంపేట, పరకాల, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, తొర్రూరు) యూనియన్ల సందడి, ప్రచారం ముమ్మరమైంది. చివరిసారిగా ఆర్టీసీలో 2018లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు 2026 గుర్తింపు కార్మిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ముందుగా గుర్తింపు కార్మిక సంఘం కోసం ఎన్నికలు జరిపి.. అనంతరం ప్రభుత్వంలో విలీనం చేపడతామని ప్రభుత్వం తెలిపింది. ఆర్టీసీ ప్రభుత్వ విలీన ప్రక్రియ నేపథ్యంలో ఈ గుర్తింపు సంఘం ఎన్నికలు అత్యంత కీలకంగా మారడంతో సంఘాల మధ్య తీవ్ర పోటీ నెలకొననుంది.

మోదీకి రష్యా చమురు.. అమెరికా టారిఫ్ చిక్కు

రష్యా చమురు విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇప్పుడు కీలక చిక్కులో పడింది. ఒకవైపు దేశ ఇంధన భద్రత. మరోవైపు అమెరికా మార్కెట్. రష్యా నుంచి చౌకగా లభిస్తున్న ముడిచమురును కొనసాగిస్తే అమెరికా నుంచి భారీ టారిఫ్‌ల ముప్పు. కొనుగోళ్లు తగ్గిస్తే ప్రత్యామ్నాయ చమురు కోసం ఎక్కువ ధర చెల్లించాల్సి రావచ్చు. ఈ రెండు పరిణామాల మధ్య భారత్ తన ప్రయోజనాలను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాయిటర్స్ ఇదే విషయాన్ని మోదీ ప్రభుత్వానికి ఎదురైన కీలక సవాలుగా వివరించింది. 100 శాతం వరకు టారిఫ్ ముప్పు రష్యా నుంచి చమురు, గ్యాస్ వంటి ఇంధనాన్ని భారీగా కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు అదనపు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి ఇచ్చే బిల్లును అమెరికా కాంగ్రెస్ ఆమోదించింది. ఇప్పుడు అది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదానికి వెళ్లింది. బిల్లు చట్టంగా మారితే భారత్ వంటి రష్యా చమురు కొనుగోలు దేశాలపై అమెరికా కొత్త ఒత్తిడి పెరగవచ్చు.ఇది మోదీ ప్రభుత్వానికి సాధారణ వాణిజ్య వివాదం కాదు. అమెరికా భారత్‌కు అతిపెద్ద ఎగుమతి మార్కెట్. ఏప్రిల్--ఆగస్టు మధ్య అమెరికాకు భారత వస్తువుల ఎగుమతులు 42.79 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో 40.39 బిలియన్ డాలర్లు. ఈ మార్కెట్‌పై కొత్త టారిఫ్‌లు పడితే భారత ఎగుమతిదారులకు అదనపు భారం ఏర్పడే అవకాశం ఉంది.చాశ్రీంశీ =ముం – తుపాకీ మిస్‌ఫైర్.. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మృతి రష్యా చమురు వదులుకుంటే? ఇక్కడే మోదీ ప్రభుత్వ అసలు సమస్య మొదలవుతుంది.రష్యా చమురు కొనుగోళ్లను గణనీయంగా తగ్గిస్తే భారత్ ఇతర దేశాల నుంచి ముడిచమురు కొనాల్సి రావచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇప్పటికే చమురు ధరలు భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా అధిక స్థాయిలో ఉన్నాయి. సెప్టెంబర్ 18న బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు సుమారు 104 డాలర్ల వద్ద ఉంది.ఖరీదైన చమురు అంటే భారత్ దిగుమతి బిల్లు పెరగడం. రూపాయిపై ఒత్తిడి పెరగడం. రవాణా ఖర్చులు పెరగడం. చివరకు పెట్రోల్, డీజిల్ నుంచి సరుకుల ధరల వరకు ప్రభావం పడే అవకాశం.అంటే రష్యా చమురును తగ్గిస్తే అమెరికా సమస్య కొంత తగ్గవచ్చు. కానీ దేశీయంగా ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం విషయంలో కొత్త సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. అమెరికా ఒత్తిడి రష్యా చమురు కొనుగోళ్లను కొనసాగిస్తే మరో వైపు ప్రమాదం ఉంది. అమెరికా 100 శాతం వరకు అదనపు టారిఫ్ విధించే అవకాశం ఉంటుంది. అప్పుడు అమెరికా మార్కెట్‌లో భారత ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉంది.టెక్స్‌టైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, రసాయనాలు, ఆభరణాలు వంటి అమెరికా మార్కెట్‌పై ఆధారపడే రంగాలపై ప్రభావం పడవచ్చు. ఎగుమతిదారుల లాభాలు తగ్గవచ్చు. ఆర్డర్లపై ఒత్తిడి రావచ్చు. మోదీ ముందున్న రెండు దారులు రష్యా చమురు కొనసాగిస్తే --- అమెరికా టారిఫ్ ముప్పు. రష్యా చమురు తగ్గిస్తే --- ఖరీదైన ప్రత్యామ్నాయ చమురు, దేశీయ ఇంధన వ్యయంపై ఒత్తిడి. ఈ రెండింటిలో ఏ మార్గం ఎంచుకున్నా ఆర్థిక ప్రభావం ఉంటుంది. అందుకే భారత్ ఒక్క దేశంపైనే ఆధారపడకుండా వివిధ దేశాల నుంచి చమురు కొనుగోలు చేస్తామని చెబుతోంది. విదేశాంగ శాఖ దేశ ఇంధన భద్రతే అత్యంత ముఖ్యమని స్పష్టం చేసింది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ సరఫరాదారుల నుంచి కొనుగోళ్లు కొనసాగిస్తామని తెలిపింది. అమెరికాతో సంబంధాలూ కీలకమే ఇది కేవలం చమురు కొనుగోలు సమస్య కాదు. భారత్--అమెరికా వాణిజ్య సంబంధాలకూ ఇది పరీక్షగా మారింది. ఇప్పటికే ఇరు దేశాల మధ్య టారిఫ్‌లపై విభేదాలు ఉన్నాయి. ఇప్పుడు రష్యా చమురు అంశం వాటికి మరో పొరను జోడించింది.అదే సమయంలో రష్యాతో భారత్‌కు దీర్ఘకాలిక ఇంధన సంబంధాలు ఉన్నాయి. చౌకైన రష్యా చమురు భారత్‌కు దిగుమతి ఖర్చును నియంత్రించడంలో సహాయపడింది. ఇప్పుడు ఆ సరఫరాను ఒక్కసారిగా మార్చడం కూడా సులభం కాదు. సామాన్యుడిపైనే చివరి భారం? రష్యా చమురు వివాదం ఢిల్లీ దౌత్య వర్గాల్లో మొదలైనా దాని ప్రభావం చివరకు సామాన్యుడి వరకు రావచ్చు.చమురు ఖరీదైతే రవాణా ఖర్చు పెరుగుతుంది. రవాణా ఖర్చు పెరిగితే సరుకుల ధరలపై ఒత్తిడి వస్తుంది. మరోవైపు అమెరికా టారిఫ్‌లు పెరిగితే ఎగుమతి రంగాల్లో ఉద్యోగాలు, పెట్టుబడులు, వ్యాపార నిర్ణయాలపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.అందుకే మోదీ ప్రభుత్వానికి ఇప్పుడు ప్రశ్న ఒక్కటే కాదు.రష్యా చమురును ఎంతవరకు కొనసాగించాలి?,అమెరికా టారిఫ్ ఒత్తిడిని ఎంతవరకు ఎదుర్కోవాలి?,దేశ ఇంధన భద్రతను, ఎగుమతి ప్రయోజనాలను ఒకేసారి ఎలా కాపాడాలి?, రష్యా చమురు విషయంలో మోదీ ముందున్న అసలు చిక్కు ఇదే.

22 ఏ నుంచి రేవంత్ రెడ్డి తప్పించుకోలేడు..

ఆయనకు శిక్ష పడాల్సిందే : మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని డ్రామాలు చేసినా 22 ఏ పై చేసిన తప్పుల నుంచి తప్పించుకోలేడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇతరుల పై ఆరోపణలు చేసి తప్పించుకోవాలని తెలివి తక్కువ వేషాలు వేస్తున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రికి ప్రజల నుంచి శిక్ష తప్పదని హెచ్చరించారు. చేతనైతే బీఆర్ఎస్ సభ్యులను శాసనసభకు అనుమతించి చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. సభ నుంచి బయటకు పంపి బ్యాట్స్‌మెన్ లేకుండా కాంగ్రెస్ బౌలింగ్ చేస్తుందని విమర్శించారు. తమకు అవకాశం ఇస్తే అసెంబ్లీలో సిక్సుల మోత మోగుతుందని అన్నారు. ఎర్రవల్లి భూముల సర్వేలో ప్రభుత్వానికి దళితుల నుంచి చుక్కెదురైందని వెల్లడించారు. ఇప్పటి వరకు నోటీసులు ఇవ్వకుండా సర్వే పేరిట ఫాం హౌస్ చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. డ్రామా పొడిగింపు కోసమే ఎమ్మెల్యేలు , ఎంపీలను పంపుతామం టున్నారని ఆయన అన్నారు. కాలయాపన చేయడానికే హై లెవెల్ కమిటీ ని ప్రకటించారని ఎద్దేవా చేశారు. ఎల్‌నినో పేరిట పేరిట డ్రామాలాడి ఆంధ్రాకు నీటిని పంపుతున్నారని ఆరోపించారు. రైతులు ఇప్పటికైనా మేల్కోవాలని , నమ్మి ఓటేసినందుకు గొయ్యి తొవ్వుతున్నారని అర్థం చేసుకుని రైతులు తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

బ్రిక్స్ ప్రకటనలకే పరిమితం కారాదు

ప్రస్తుతం ప్రపంచంలో భౌగోళిక, రాజకీయ విభేదాలు, ఘర్షణలు పెరుగుతున్న సమయంలో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి భారత్ ఎంతో సమర్థవంతమైన ఆతిథ్యం ఇచ్చింది. ఈ కూటమి లోని దేశాల మధ్య అనేక అంతర్గత విభేదాలు ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న రెండు ప్రధాన యుద్ధాల్లో ఒక దేశం బాధిత దేశం కాగా, మరొక దేశం యుద్ధానికి కారణమైన దేశంగా బ్రిక్స్‌లోనే ఉండటం గమనార్హం. అయినప్పటికీ ప్రధాని మోడీ తన ప్రత్యేకమైన వ్యక్తిగత దౌత్యశైలితో ఈ విభేదాలను సర్దుబాటు చేసి సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించగలిగారు. పశ్చిమాసియా పరిస్థితిపై సభ్యదేశాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, సంయమనం పాటించడం, పౌరుల రక్షణ, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, దౌత్యపరమైన పరిష్కారాలకు ప్రాధాన్యం ఇవ్వడం, అణుభద్రతను కాపాడడం వంటి అంశాలపై సభ్యదేశాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. 11 దేశాలు, 10 భాగస్వామ్య దేశాలు కలిసి సంయుక్త ప్రకటనపై సంతకం చేయడం దౌత్యపరమైన విజయంగా పరిగణించవచ్చు. ఈ ప్రకటన ద్వారా బ్రిక్స్ తన ప్రపంచ పాలనా వ్యవస్థను మార్చడంలో మరింత పాత్ర పోషించాలన్న లక్ష్యాన్ని, గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను బలపరచాలనే ఉద్దేశాన్ని మరోసారి స్పష్టం చేయగలిగింది. అలాగే ఆర్థిక వ్యవహారాలు, వాణిజ్యం, సాంకేతికత అభివృద్ధి వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింతగా పెంచాలని బ్రిక్స్ సంకల్పించింది. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న యుద్ధాలను, ముఖ్యంగా తూర్పు ప్రాంతాలకు సాధారణ సముద్రమార్గాల ద్వారా చమురు, సహజ వాయువు, వస్తువులు, ఇతర సరకుల స్వేచ్ఛాయుత రవాణాపై ఆధారపడిన దేశాలను ప్రభావితం చేస్తున్న యుద్ధాలను ఈ సంయుక్త ప్రకటన పూర్తిగా ఖండించాల్సినంత స్థాయిలో ఖండించలేదు. దీనికి కారణం రష్యా బ్రిక్స్ లోని ముఖ్య సభ్యదేశాల్లో ఒకటి కావడం. అలాగే 2022 లో రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసిన తరువాత రష్యా అధ్యక్షుడు పుతిన్ తొలిసారిగా బ్రిక్స్ సదస్సుకు హాజరు కావడం కూడా మరో కారణం. చైనాతో ద్వైపాక్షిక సంబంధాలను చక్కదిద్దుకోవడంలో భారత్ ఇంకా తగినంతంగా ముందడుగు వేయలేదని చెప్పవచ్చు. చైనాతో అన్ని రంగాల్లో సంబంధాలను అభివృద్ధి చేయడానికే ప్రాధాన్యం ఇవ్వాలా లేక వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఎసి) వద్ద శాంతి, ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలా అనే విషయంలో రెండు దేశాల మధ్య ఇప్పటికీ ప్రాథమికంగా అభిప్రాయ భేదం కొనసాగుతోంది. ఈ సదస్సులో అంతర్జాతీయంగా వాణిజ్యరంగానికి సంబంధించి కొన్ని అవకాశాలు వచ్చినా బ్రిక్స్ దేశాలతో వాణిజ్యంలో ఉన్న లోటును తగ్గించడంపై భారత్ తగినంత శ్రద్ధ చూపించలేకపోయింది. సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడంపైనే దృష్టి కేంద్రీకరించడంతో కొన్ని అవకాశాలు కోల్పోయాయి. అయితే ఇక్కడ ప్రధాన ప్రశ్న ఏమిటంటే విభిన్న అభిప్రాయాలు, ప్రయోజనాలు కలిగిన దేశాలతో కూడిన బ్రిక్స్ తన సమష్టి ఆర్థిక, రాజకీయ బలాన్ని వ్యూహాత్మక సామర్థ్యంగా మార్చగలదా? సభ్యదేశాలన్నీ ఒకే విధమైన రాజకీయ అభిప్రాయాలను కలిగి ఉండాలని బలవంతం చేయకుండా ఇది సాధ్యమా అనేది ముఖ్యమైన విషయం. జ్ఞానం ఓన్లీ ఫర్ సేల్... దేశాల మధ్య జరిగే అంతర్జాతీయ చెల్లింపులు, స్థానిక కరెన్సీల వినియోగాన్ని పెంచడం, అభివృద్ధి కోసం ఆర్థిక సహాయం, పెట్టుబడి వేదికలు, బీమా, ఆర్థిక భద్రతా వ్యవస్థలు, ఇవన్నీ కేవలం ఆలోచనలకే పరిమితం కాకుండా ఆచరణ లోకి తీసుకు రావడం ఇప్పుడు అవసరం. బ్రిక్స్‌దేశాలకు కృత్రిమ మేధస్సు (ఎఐ), సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలు, సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డిపిఐ), అలాగే సాంకేతిక ప్రమాణాల రూపకల్పన వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకునే అవకాశం ఉంది. అయితే ఇది పరస్పరం పోటీపడే సాంకేతిక విభాగాలు లేదా వ్యవస్థలను సృష్టించకుండా ఉండాలి. ఇదే విధమైన విధానం ఆరోగ్యం, ఆహారం, ఇంధన భద్రతకు కూడా వర్తిస్తుంది. ఈ కూటమికి బలమైన పర్యవేక్షణ వ్యవస్థలు, వైద్యసరఫరా గొలుసులు, వ్యవసాయ సహకారం, వస్తువుల ధరలు, ఇంధన ధరల్లో వచ్చే అకస్మాత్తు మార్పుల ప్రభావాన్ని తగ్గించే విధానాలు అమలు చేసే స్థాయి ఉంది.

గణపతి దీవెనలు ప్రజలందరిపై ఉండాలి..

ఐదో రోజు గ్రామాలలో మహా అన్నదానం

- నాగేపల్లి, ?రత్నాపూర్, కల్వచర్ల గ్రామాల్లో పలు గణనాధులను దర్శించుకున్న తోట్ల తిరుపతి యాదవ్

రామగిరి, సెప్టెంబర్ 18(ది క్రైమ్ న్యూస్):–గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రామగిరి మండలంలోని నాగేపల్లి,రత్నాపూర్,కల్వచర్ల గ్రామాలలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.గణపతి నవరాత్రి ఉత్సవాల ఐదవ రోజు సందర్భంగా రామగిరి మండలంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.నాగేపల్లి గ్రామంలోని గౌడ్స్ యూత్ వినాయక ఉత్సవ కమిటీ,రత్నాపూర్ పద్మశాలి సంఘం, రత్నాపూర్ గ్రామంలోని పల్లె వాడలో ఏర్పాటుచేసిన వినాయక మండపాన్ని దర్శించుకొని, అలాగే కల్వచర్ల గ్రామంలో మహిళలు వైభవంగా జరుపుకున్న కుంకుమ పూజలలో పాల్గొని కల్వచర్ల లోని గణేష్ నగర్, 9వ వార్డు, 10వ వార్డు, 8వ వార్డు కోనేరు వీధులలో భక్తుల ఆహ్వానం మేరకు వారు ప్రతిష్ఠించిన గణనాధులను మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ దర్శించుకున్నారు.తిరుపతి యాదవ్ గణనాధుల వద్ద ప్రత్యేక పూజలు చేసి, స్వామివారి ఆశీర్వాదం తీసుకొని ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని కోరారు. అనంతరం ఆయా వినాయక మండపాల వద్ద నాగేపల్లి, కల్వచర్ల, రత్నాపూర్ గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు మర్యాదపూర్వకంగా తోట్ల తిరుపతి యాదవ్ ని ఘనంగా సన్మానించారు.?ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, రత్నాపూర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, కల్వచర్ల కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, వినాయక మండపం నిర్వాహకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధర తగ్గింపుపై రైతుల ఆందోళన..

రోజుకో ధరతో దోపిడీ చేస్తున్నారంటూ ఆగ్రహం

ఊట్కూర్, సెప్టెంబరు 18 : పత్తి ధర తగ్గింపుపై రైతులు భగ్గుమన్నారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని విజయ కాటన్ ఇండస్ట్రీ ఎదుట శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు పత్తి వాహనాలతో తెల్లవారేసరికి ఇండస్ట్రీ వద్దకు చేరుకున్నారు. గురువారం క్వింటాలుకు గరిష్ఠంగా రూ.9,500 ధర పలకగా.. శుక్రవారం రూ.200 తగ్గించి రూ.9,400కు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. కొందరికి రూ.9,350 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకో ధర నిర్ణయిస్తూ తమను నష్టాల్లోకి నెడుతున్నారని మండిపడ్డారు. దిగుబడి దారుణం.. ధరా దిక్కులేదు వర్షాభావంతో ఈ ఏడాది పత్తి దిగుబడి భారీగా పడిపోయిందని రైతులు వాపోయారు. చెట్టుకు రెండు, మూడు కాయలు మాత్రమే కాసిన పరిస్థితి ఉందన్నారు. ఎకరాకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పత్తికి గిట్టుబాటు ధర కల్పించకుండా రోజుకో ధర నిర్ణయించడం రైతులను మరింత అప్పుల్లోకి నెడుతోందని రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. ప్రభుత్వమే పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వర్షాభావంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. పత్తి ధరల విషయంలోనూ పట్టించుకోవడం లేదని రైతు సంఘాల నాయకులు విమర్శించారు. పంట దిగుబడి తగ్గి ఇప్పటికే నష్టాల్లో ఉన్న రైతులకు గిట్టుబాటు ధర దక్కకపోతే పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అన్నారు. రైతుల ఆర్థిక ఇబ్బందులు తీవ్రరూపం దాల్చితే ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు ఆందోళనకు దిగడంతో నారాయణపేట వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఉట్కూర్ ఎస్ఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అనంతరం మిల్లు యజమానులతో చర్చించారు. మార్కెట్‌లోని ఆన్‌లైన్ ధరలను మిల్లు యజమానులు రైతులకు వివరించారు. ధరలపై చర్చించిన అనంతరం పోలీసులు, మిల్లు యజమానులు రైతులను సముదాయించారు. దాదాపు గంటపాటు కొనసాగిన ఆందోళన అనంతరం రైతులు ధర్నాను విరమించారు. పత్తికి న్యాయమైన ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు.

నా జీవితం తెరిచిన పుస్తకం..

ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల వివరాలు స్పష్టంగా చెప్పిన : హరీశ్ రావు

నా జీవితం తెరిచిన పుస్తకం అన్ని ఎన్నికల అఫిడవిట్లలో నా భూములు, ఆస్తుల వివరాలు సుస్పష్టంగా చెప్పిన అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బైండ్ల సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ వాళ్లు సిద్దిపేటకు వస్తున్నరట. నా భూములు చూసి పోతరట. వందల మంది పోలీసులు, బుల్లెట్ ప్రూఫ్ బండ్లు, రోప్ పార్టీలు ఎందుకు? డ్రోన్లు పెట్టి ఫొటోలు తీయడం ఎందుకు? నేను ఇక్కడే ఉన్న నాకు చెబితే వారికి అన్ని ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. మంచిగ కడుపు నిండ అన్నం తినిపించి దగ్గరుండి కంటి నిండా తోట అన్నీ చూపిస్తానని పేర్కొన్నారు. కాకుంటే ఉన్నది ఉన్నట్లు చెప్పండి. అబద్ధాలు చెప్పకండని హితవు పలికారు. అన్ని ఎన్నికల అఫిడవిట్లలో నా భూములు, ఆస్తుల వివరాలు సుస్పష్టంగా చెప్పిన. సర్వే నెంబర్లతో సహా భూముల వివరాలు ఇచ్చినం. రామంచల 13 ఎకరాలు ఉంటే లేని పోనీవి చెప్పుతున్నారు. నేను దాచింది ఏముంది. నువ్వు కొత్తగా బయట పెట్టేది ఏముంది. మీ లాగా నేను కబ్జాలు పెట్టలేదు, ప్రజల సొమ్ము దోచుకోలేదని స్పష్టం చేశారు. సిద్దిపేట ప్రజలు నా పని చూసి ఏడు సార్లు గెలిపించారు. నన్ను దీవించారు. మీరు అంత భయపడాల్సిన అవసరం లేదు. మా సిద్దిపేట అంటేనే ప్రేమ, ఆప్యాయతకు, ఆతిథ్యానికి చిరునామా..సిద్దిపేటకు ఎవరు వచ్చినా కడుపునిండా అన్నం పెడతాం ప్రేమగా మాట్లాడుడుతామన్నారు. అంత మంది పోలీసులు పెట్టుకొని భయపడుకుంటూ రావాల్సిన అవసరం మీకు లేదని తెలిపారు.

ఉమ్మడి పౌరస్మృతిపై బిజెపి ఉబలాటం

యూనిఫారం సివిల్ కోడ్ (యుసిసి) అంటే ఉమ్మడి పౌరస్మృతి. దీని ముఖ్య ఉద్దేశం 'అందరికీ ఒకే పౌరచట్టం'. ఇది రాజ్యాంగ నిర్మాతలు భవిష్యత్ తరాల ముందు ఉంచిన ఒక ఆదర్శ లక్ష్యం. దేశం లోని వివిధ వర్గాల ప్రజల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలు, ఆచారాలు, సంప్రదాయాలను సమన్వయం చేసి వారందరూ స్వచ్ఛందంగా ఒకే విధమైన చట్టాన్ని అంగీకరించేలా చేయడం చాలా పెద్ద ప్రయత్నమే కాకుండా కష్ట సాధ్యమని ఆనాటి రాజ్యాంగ నిర్మాతలకు ముందే తెలుసు. ఈ విషయంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఎంతవరకు సుసాధ్యం చేయగలుగుతుందో గమనించాల్సిందే. యుసిసిని కేవలం యాంత్రికంగా అమలు చేయడం కాకుండా, రాజ్యాంగ రక్షణలో ప్రతివ్యక్తికి న్యాయం జరిగేలా, సమాజం లోని ప్రతి వర్గాన్ని ఉత్తమమైన పౌర చట్టాల స్థాయికి తీసుకెళ్ల గలగాలి. మైనారిటీలను ఇతరులుగా లేదా పరాయి వారిగా భావించే పరిస్థితి రాకుండా అందరికీ వర్తించే ఉమ్మడి పౌర చట్టాన్ని అమలు లోకి తీసుకు రావాలి. దేశవ్యాప్తంగా ఈ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఆసక్తిగా ఉంటే వివిధ వర్గాల ప్రజలు, మత పెద్దలు, పౌర సమాజ ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులతో విస్తృతంగా చర్చలు జరపాలి. తన లక్ష్యాలు, ఉద్దేశాల విషయంలో పారదర్శకంగా ఉండాలి. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏకాభిప్రాయానికి వచ్చేలా చేయగలిగితే బిజెపి దేశానికి ఒక మంచి సేవ చేసినట్టు అవుతుంది. అలా కాకుండా రాజకీయ కోణంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలన్న తాపత్రయంతో ఎన్నికల ప్రచార నినాదంగా యుసిసిని వాడుకోరాదు. తెలుగు రాష్ట్రాలకు ఎల్‌నినో ముప్పు కానీ ఇప్పటివరకు ఎన్‌డిఎ ప్రభుత్వ చర్యలు గమనిస్తుంటే 2029 పార్లమెంట్ ఎన్నికలకు యుసిసి ప్రధాన ప్రచార అస్త్రంగా వినియోగించుకోనున్నట్టు బయటపడుతోంది. అయితే జాతీయ స్థాయిలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. పార్లమెంట్‌లో ఎన్‌డిఎకు ఉన్న సంఖ్యాబలం దృష్ట్యా ఆ రాజ్యాంగ సవరణ చేపట్టడం సాధ్యం కాదు. అందుకనే తమ ప్రభుత్వ పాలనలో ఉన్న 21 రాష్ట్రాల్లోనే విడతల వారీగా ఈ కోడ్‌ను అమలు చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించడం.ఇప్పుడు దేశ వ్యాప్త చర్చకు తెరతీసినట్టయింది.యూనిఫారం సివిల్ కోడ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నది బిజెపి దీర్ఘకాలిక లక్ష్యాల్లో ఒకటి. బిజెపి ఆవిర్భవించిన నాటి నుంచి యుసిసి అమలు విషయంలో తన విధానాన్ని స్పష్టంగా ప్రకటిస్తూ వచ్చింది. అయితే ఈ కోడ్ ఎలా ఉండాలి? దీని పూర్తి వివరాలు ఏమిటి? తదితర విషయాలను ఇప్పటివరకు బిజెపి వెల్లడించకపోవడం గమనించాల్సిన విషయం. తన కనుసన్నల్లో నడుస్తున్న 21 రాష్ట్రాల్లో యుసిసిని అమలు చేయడానికి బిజెపి సిద్ధమవుతున్నా దీని మిత్రపక్షాల నుంచి వ్యతిరేకత కనిపిస్తోంది. బీహార్ లోని నితీశ్ కుమార్ సారథ్యం లోని జనతాదళ్ (యునైటెడ్), యుసిసి భావనకు మద్దతు ఇచ్చినప్పటికీ, అమలుకు మాత్రం అంగీకరించడం లేదు. మరో మిత్రపక్షం ఆంధ్రప్రదేశ్ లోని తెలుగుదేశం ప్రభుత్వం కూడా యుసిసి ఆలోచనకు కట్టుబడి ఉన్నామని చెబుతూ దీనిపై మరింత చర్చ జరగాలని కోరుతోంది. బ్రిక్స్ ప్రకటనలకే పరిమితం కారాదు ఈ రెండు మిత్రపక్షాల మద్దతు వల్లనే కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం మనుగడ సాగిస్తోంది. అందువల్ల కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన సూచనకు ఇవి ఎలాంటి షరతులు లేకుండా వెంటనే మద్దతు ఇస్తాయని అనుకోవడం అంత సులభం కాదు. యుసిసి ప్రధాన లక్ష్యం 'సమానత్వం'. ఇది భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కు. అయితే రాజ్యాంగం లోని ఆర్టికల్ 44 న్యాయస్థానంతో నేరుగా అమలు చేయలేని 'ఆదేశిక సూత్రాల్లో' భాగంగా ఉంది. దేశం లోని విభిన్న మతాలు, సమాజాల కోసం చారిత్రకంగా ఏర్పడిన వివిధ వ్యక్తిగత చట్టాలు ఉన్నందున యుసిసి అమలు అనేక అంశాలతో ముడిపడి ఉంది. ఉత్తరాఖండ్ 2024లో యుసిసి చట్టాన్ని అమలులోకి తెచ్చింది. అది వివాహం, విడాకులు, వారసత్వం వంటి అంశాలను నియంత్రిస్తుంది. ఇక్కడ షెడ్యూల్డ్ తెగలకు రాజ్యాంగ పరంగా కొంత మినహాయింపు కల్పించారు. గుజరాత్, మధ్యప్రదేశ్, అసోం రాష్ట్రాలు కూడా ఇలాంటి చట్టాలను ఆమోదించాయి.రాజస్థాన్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఇలాంటి కోడ్‌లను రూపొందించే ప్రక్రియను ప్రారంభించాయి.

సంపాదకీయం

అధికారమే అన్ని పార్టీల లక్ష్యం !

దేశంలో రాజకీయాల తీరు మారుతోంది. అధికారమే లక్ష్యంగా ఎత్తులు పైఎత్తులు వేస్తున్నారు. రాజకీయ నాయకులు కూడా తమకు ఎక్కడ అనుకూలమో అక్కడ చేరుతున్నారు. అధికారమే పరమావధిగా నేతలు పావులు కదుపుతున్నారు. తెలంగ్గాణలె ఎన్నికైన ప్రజాప్రతినిధులంతా అధకార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఓటమి చెందిన లేకుంటా ఇంతకాలం రాజకీయంగా అవకాశం కోల్పోయిన వారంతా బిజెపిలో చేరుతు న్నారు. ఎపిలో బిజెపితో పొత్తుకోసం వెంటపర్లాడిన టిడిపి-జనసేన కూటమి ఎట్టకేలకు ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామ్యం అయ్యింది. మొత్తంగా రాజీయ నాయకులు గెలుపు ఎలా అన్న సూత్రం ఆధారంగా తమ రాజకీయాలను నెరపుతున్నారు. అయితే ప్రజలు సచ్ఛీల రాజకీయాలను కోరుకుంటున్నారు. బతకాడానికి అవకాశాలు కలిగేలా పాలన చేసే నేతలు రావాలని ఆశిస్తున్నారు. ప్రజలకు కావాల్సింది సమస్యలను పరిష్కరించడం.. శాంతిభద్రతలను పరిరక్షించడం..అవినీతికి దూరంగా ఉండడం ముఖ్యం. ప్రజలు విజ్ఞులు. రాజకీయ నేతలను మించి ఆలోచన చేయగలరు. రాజకీయ నేతలు అదేపనిగా తాయిలాలు ఎందుకు ఇస్తున్నారో తెలుసుకోగలరు. చిత్తశుద్ధితో పనిచేస్తున్నారా లేదా తెలుసుకోగలరు. అందుకే ఎప్పుడైనా ఫలితాలు ప్రజల విజ్ఞతకు దర్పణంగా చూడాలి. వారు విచక్షణతో వేసిన ఓటుగా భావించాలి. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా అన్నాహజారే స్ఫూర్తితో అవినీతికి వ్యతిరేకంగానే రాజకీయాల్లోకి వచ్చారు. ఢిల్లీలో కొత్తగా ప్రయోగాలు చేయడానికి ఏమీ లేకున్నా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. దాని ప్రభావం పంజాబ్‌పై పడింది. సాగుచట్టాలపై మొండి వైఖరి కారణంగా పంజాబ్‌లో బిజెపి భారీ మూల్యం చెల్లించుకుందనే చెప్పాలి. అయితే పన్నుల రూపంలో వసూలు చేస్తున్న ఆదాయాన్ని పాలకులు సంక్షేమం పేరిట అప్పనంగా నగదుబదిలీలు, ఉచిత పంపిణీ పథకాలతో ప్రజలను ఓట్ల యంత్రాలుగా మారుస్తున్నారు. ఈ విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఢిల్లీ ముందంజలో ఉంది. తాత్కాలికంగా ఇది మంచి ఫలితమే ఇచ్చినా అభివృద్ధికి నిరోధకంగా తయారవుతుందని గుర్తించాలి. ఇకపోతే యూపిలో యోగి ఆదిత్యనాథ్ రాకుముందు ఉన్న యూపికి..నేటి యూపికి భారీ తేడాను గమనించవచ్చు. ఎస్పీ కాలంలో అక్కడ గూండారాజ్యం కొనసాగింది. ములాయం సిఎంగా ఉన్నప్పుడు, అఖిలేశ్ యాదవ్ సిఎం అయిన తరవాత కూడా ఇదే కొనసాగింది. గుండాలు తమ ఇష్టం వచ్చినట్లుగా రాజ్యాన్ని ఏలారు. యూపిలో పాలనపై దృష్టి పెట్టిన యోగి గూండాలను నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. అక్రమార్కులకు సింహస్వప్నంగా నిలిచారు. శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇచ్చారు. గ్రామాల్లో ప్రజలు నిర్బయంగా తమ పనులు చేసుకునే విధంగా పాలనను తీర్చి దిద్దారు. రేపులు, దందాలు చేసే వారిని అణచివేశారు. ఈ క్రమంలోనే ప్రజలు మరోమారు యోగికి పట్టం కట్టారని తెలుసుకోవాలి. ప్రజల పాలనను మరచి ఇప్పుడు ప్రశాంత్ కిశోర్ లాంటి వారిపై ఆధారపడి గెలుపు ఎలా అనే సూత్రాన్ని పాటించాలనుకునే వారికి ప్రజలు ఎప్పటికప్పుడు బుద్ద ఇచెబుతూనే ఉన్నారు. నిజానికి ప్రజలకు కావాల్సింది ఇది కాదు. వారికి ప్రశాంత జీవనం, బతకడానికి అవకాశాలు కావాలి. ప్రజలను ప్రేమతో,పనులతో గెలవాల్సిన పాలకులు ఎదుటి వారిని శతృవులుగా చూస్తున్నారు. సవాళ్లు విసురుతున్నారు. అభివృద్ధి, పాలన తదితర అంశాలనే ప్రధానంగా దృష్టి సారిస్తే ప్రలజు తప్పకుండా ఆదరిస్తారు. అయినా కాంగ్రెస్ తన రాజకీయాల తీరును మార్చుకోవడం లేదు,. అధికార బిజెపి తప్పులను ఎత్తిచూపి తాము ఎలా ముందుకు పోవాలనుకుంటున్నామో.. ప్రత్యామ్నాయం ఎందుకో చెప్పడం లేదు. కొడుకు, కూతురు మాత్రమే కాంగ్రెస్ అన్న విధానంలో ఉన్న సోనియా తీరు ప్రజలకు రుచించలేదు. అందుకే వారు ఎక్కడ ప్రచారం చేసినా కాంగ్రెస్ ఓటమి పొందుతోంది. ఇండియా కూటమి కూడా బలంగా అడుగులు వేయడం లేదు. బెంగాల్లో తృణమూల్ ఒంటరి పోరాటం చేస్తామని ప్రకటించింది. ఇది కాంగ్రెస్‌పై నమ్మకం లేకనే అని తెలుసుకోవాలి.ప్రతిఎన్నికల్లో గెలుపోటములు సమజమే అయినా గెలిచిన వారి ప్రత్యేకతను మాత్రమే చర్చించాలి. ఇదే క్రమంలో జాతీయ కాంగ్రెస్ తిరుగులేని పతనాన్ని లిఖించు కుంది. తాజా ఎన్నికల ఫలితాలతో దేశంలోనే కాంగ్రెస్ ఒక అప్రధాన రాజకీయ శక్తిగా మిగిలిపోయింది. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవాన్ని పునరుద్ధరించేందుకు చేస్తున్న ప్రయత్నా లు ఫలించడంలేదు. ఇండియా కూటమి పెట్టినా పెద్దగా ముందుకు కదలడం లేదు. ఇందుకు కారణాలను వారే విమర్శ చేసుకోవాలి. ఓ రకంగా చెప్పాలంటే కాంగ్రెస్ పునరుజ్జీవానికి ఎంతగా ప్రయత్నం చేసినా ప్రజలను ఆకట్టుకోలేక పోయారు. అంటే ప్రజలు నమ్మగలిగేలా వారి ప్రయత్నాలు లేవనే చెప్పాలి. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్‌ను కీలుబొమ్మ ప్రధానిగా పెట్టుకున్న సోనియా,రాహుల్‌లు అవినీతిలో మునిగి తేలారు. గత పదేళ్ల యూపిఎ పాలనతో పోలిస్తే మోడీ పదేళ్ల పాలన వెయ్యి రెట్లు మెరుగన్న భావనలో ప్రజలు ఉన్నారు. గతంలో తమ పాలనలో ప్రజల విశ్వాసాన్ని చూరగొనడంలో కాంగ్రెస్ విఫలమయింది. తత్ఫలితంగానే అధికారాన్ని మళ్లీ కైవసం చేసుకోలేకపోయింది. అందుకే ప్రస్తుత నాయకత్వంలో కాంగ్రెస్ మళ్లీ జాతీయ రాజకీయాలలో ప్రధాన శక్తి కావడం అసంభవమనే చెప్పాలి. ప్రజలతో మమేకం కావడం ద్వారా వారి మనసులను గెలుచునే రాజకీయాలు చేయాలి. అప్పుడే ప్రజలు నమ్ముతారు. ప్రజలను నమ్మించేలా కార్యక్రమాలు ఉండాలి. కార్యాచరణ ఉండాలి. అప్పుడే విజయానికి చేరువ అవుతారు.

బిజెపి అన్యాయాలను ఎలా విస్మరిస్తారు

ప్రజలు ఆదరించడానికి ప్రాతిపదిక ఉందా

ఎపిలో బిజెపి ఎలాంటి వ్యూహం అనుసరిస్తుందో ?

అమరావతి : ఎన్‌డిఎలో టిడిపి చేరడంతో ఇప్పుడు బిజెపి ఎపి ఎన్నికల్లో కీలకం కాబోతున్నది. అయితే విబజన తరవాత బిజెపికి పెద్దగా ఆదరణ దక్కలేదు. ఇప్పుడు టిడిపి-జనసేనతో కలసి పోరాడుతున్న వేళ ప్రజలకు ఎలాంటి హామీలు ఇస్తారన్నదే ముఖ్యం. ఎలా వారి మనసులు గెల్చుకుంటారన్నది కూడా ముఖ్యం. అధికారం నిలుపుకోవడం కోసం బిజెపి దక్షిణాదిలో ఎక్కువ సీట్లు సంపాదించే క్రమంలో పొత్తులకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇంతకాలం ఎపిలోనూ పాగా వేస్తామని అంటూ వచ్చిన నేతలు ఇప్పుడు డిపితో కలసి పోరాడబోతున్నారు. తాడూ బొంగరం లేని చోట ఆట ఎలా ఆడుతారో బిజెపిని చూసి నేర్చుకోవాలేమో. ఎందుకంటే ఎపి విషయంలో బిజెపి తీరు దారుణంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ చేసిన నిర్వాకాలను ఎండగడుతూ వచ్చిన బీజేపీ కూడా తాము అధికారంలో లేని రాష్ట్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన అనంతరం... విభజిత ఆంధ్ర ప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని పట్టించుకోలేదు. తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేయక పోగా, పునర్వ్యస్థీకరణ చట్టం-2014లో పేర్కొన్న రెవెన్యూలోటు భర్తీ, వెనుకబడిన 7 జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖకు రైల్వేజోన్ తదితర కీలకమైన అంశాలను; పార్లమెంట్ సాక్షిగా ఇస్తామని వాగ్దానం చేసిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశాన్ని పక్కన పెట్టేసింది. ఆంధప్రదేశ్ పునర్వ్యస్థీకరణ చట్టం-2014 ప్రకారం 9వ షెడ్యూల్‌లో 91 సంస్థలు, 10వ షెడ్యూల్‌లో 142 సంస్థలు ఉన్నాయి. వీటిని రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభజన; ఉద్యోగుల విభజన; ఆస్తులు, అప్పులు, ఆదాయ విభజన వంటి అంశాలు ఇంకా పూర్తికాలేదు. ఆంధప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం అని బీజేపీ చెబుతోంది. ప్రత్యేక హోదా వల్ల ఒరిగేదేమిటని ప్రశ్నించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు తన ఉనికి కోసం బిజెపి పంచన చేరింది. ఆంధప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు.. పదేళ్లు ఇవ్వాల్సిందేనని విభజన బిల్లు ఆమోదం పొందే సందర్భంలో రాజ్యసభలో పట్టుబట్టి, గొంతెత్తి పోరాడిన బీజేపీ నేతలు ప్రత్యేక హోదాను పక్కన పెట్టిన తీరు మోసం చేయడం తప్ప మరోటి కాదు. రాజకీయ కారణాల వల్లనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని ప్రజలకు కూడా అర్థమైంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై చర్చ మరోసారి మొదలైంది. కేంద్రం నియంతృత్వ ధోరణిని అవలింబిస్తోందని ప్రాంతీయపార్టీల నేతలు అంటున్నారు. ఇదే సమయంలో సమీప భవిష్యత్తులో దేశంలో చోటు చేసుకోబోయే రాజకీయ పరిణామాల్ని సైతం చర్చిస్తున్నారు. గత కొంతకాలంగా ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాలతో సంప్రదించకుండా కొన్ని అంశాల్లో ఏకపక్షంగా తీసుకొంటున్న నిర్ణయాలతో ఆందోళన చెందుతున్నారు. కేంద్రంలో ఇటీవల వరకూ ఎవరు అధికారంలోకి వచ్చినా ఏకపక్ష పోకడలు పోవడం ఎక్కువగా కనిపిస్తోంది. కేంద్రంలో సుదీర్ఘ కాలం అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు... రాష్ట్రాలను చిన్నచూపు చూసేది. రాజకీయ ఫిరాయింపులను ప్రోత్స హించింది. దీంతో దానికి వ్యతిరేకంగా దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. ప్రాంతీయ అస్తిత్వం, ఆత్మగౌరవం, రాష్ట్రాల హక్కుల పరిరక్షణ అనే అంశాల ఆధారంగానే అవి ప్రజల విశ్వాసాన్ని చూరగొని అధికారంలోకి రాగలిగాయి. ఇప్పుడు బిజెపి కూడా అదే పద్దతిలో రాష్ట్రాలను చూస్తోంది. విభజన హామీలను నెరవేర్చే విషయంలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణకూ న్యాయం జరగలేదు. ఇందుకు కూడా రాజకీయాలే కారణం. విభజన బిల్లులో పేర్కొన్న ప్రకారం తెలంగాణకు ఇవ్వాల్సిన కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా; నీతి ఆయోగ్ సిఫార్సు మేరకు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలకు రూ. 24,000 కోట్ల ఆర్థిక సాయం వంటివి అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రాలను బలహీన పర్చడం వలన సాధించేదేమీ ఉండదని ప్రధాని నరేంద్ర మోదీ గ్రహించడం లేదు. ఇది ఓరకంగా ప్రజలను విస్మరించడమే అని బిజెపి కూడా గుర్తించడం లేదు. రాజ్యాంగ బద్ధంగా లభించాల్సిన నిధులు, హక్కులు బదలాయించి సమాఖ్య స్ఫూర్తిని చాటుతామన్న తొలినాళ్ల హామీలను మోడీ విస్మరించారు. ఈ క్రమంలో పొత్తులతో ముందుకు వస్తున్న బిజెపి ప్రజలకు ఏ రకంగా హామీలు ఇస్తుందన్నది ఆసక్తిగా మారింది.

వైకాపా మోసాలకు పరాకాష్ట

మేదరమెట్ల సభను గ్రాఫిక్‌తో ముంచారు

టిడిపి నేత లోకేశ్ ఘాటు విమర్శలు

అనంతపురం : మేదరమెట్ల వైకాపా 'సిద్ధం' సభలో చూపించిన జనమంతా గ్రాఫిక్స్ అంటూ తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఒక గుంపు జనాన్ని పలుచోట్ల అమర్చారంటూ కొన్ని ఫొటోలను ఆయన బయటపెట్టారు. ఏకంగా మార్ఫింగ్ ఫొటోలు వేసిన వైనం చరిత్రలో ఎప్పుడైనా చూశారా?అని ప్రశ్నించారు. డ్రోన్ చిత్రాలు, గ్రీన్ మ్యాట్‌తో దొరికిపోయారని.. ఇప్పుడు ఏకంగా మార్ఫింగ్ చేసి ఫొటోలు వదిలారని ఎద్దేవా చేశారు. జగన్‌కు ప్రజల మద్దతు లేదని.. ఎంత ప్రయత్నించినా ఆయన్ను చిత్తుగా ఓడించడం ఖాయమని లోకేశ్ పేర్కొన్నారు. జగన్ బిల్డప్ బాబాయి... సిద్ధం సభలో డ్రోన్ చూసి భయపడ్డాడు' అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. సోమవారం అనంతపురంలో జరిగిన శంఖారావం సభలో యువనేత మాట్లాడుతూ... సభకు జనం రారని తెలిసి గ్రాఫిక్స్ కోసం గ్రీన్ మ్యాట్ వేశారన్నారు. అరగంట అంబటి, బెట్టింగ్ స్టార్ అనిల్ తనను బండబూతులు తిట్టారని.. వాళ్లకు చెబుతున్నా.. ఎందుకు డ్రోన్ చూసి పిల్లుల్లా భయపడుతున్నారని వ్యాఖ్యలు చేశారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తును చూసి జగన్ భయపడిపోతున్నారన్నారు. చంచల్ గూడ జైలులో కూడా జగన్ పేరు ఉండటం ఖాయమన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం.. 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెన్షన్ హామీ ఏమైందని ప్రశ్నించారు. టీడీపీ - జనసేన ప్రభుత్వంలో ప్రతి ఏడాది డీఎస్సీ, పెండింగ్ పోస్టులు భర్తీచేస్తామన్నారు. మాధవ్ జిల్లా పరువే కాదు... దేశం మొత్తం పరువు తీశారన్నారు. యూట్యూట్ స్టార్ భరత్, బూతుల స్టార్ సన్నబియ్యం సన్నాసి కొడాలి నాని అంటూ విరుచుకుపడ్డారు. టీడీపీ - జనసేన ఏర్పడిన ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగాలు వచ్చే వరకు ప్రతి నెల రూ.3వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. 2014లో టీడీపీ-బీజేపీ ఆనాడు కలిసికట్టుగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశామని... ఏనాడూ మైనార్టీ సోదరులపై దాడులు జరగలేదన్నారు. సీనియర్లు, జూనియర్లను సమానంగా గౌరవిస్తానని... పనిచేసేవారినే ప్రోత్సహిస్తా, పదవులు ఇస్తామని లోకేష్ పేర్కొన్నారు.

భట్టిని కింద కూర్చోబెట్టారు

దళితజాతికి తీరని అవమానం

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శలు

హైదరాబాద్ : యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి సాక్షిగా డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అవమానం జరిగిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ... రెడ్డి నాయకుల దగ్గర ఒక ఎస్సీ బిడ్డను క్రింద కూర్చోబెట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సతీమణినిపైన కూర్చోబెట్టి బీసీ బిడ్డ అయిన కొండా సురేఖను కింద కూర్చోబెట్టారన్నారు. దేవుడి దగ్గరే ఇంత అవమానం జరిగితే దళిత జాతి ఎక్కడ చెప్పుకోవాలి?... ఎవరికి చెప్పుకోవాలని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడైనా భట్టి విక్రమార్కనే అవమానించారన్నారు. 4 యేండ్ల స్వాతంత్ర భారతంలో దళితులకు కాంగ్రెస్ పార్టీలో అవ మానం జరుగుతుందన్నారు. యావత్ దళిత జాతిని ఈరోజు అవమానిం చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి భట్టి విక్రమార్క ఫోటో పక్కన పెడుతున్నా రని.... ప్రభుత్వ యాడ్స్‌లో డిప్యూటీ సీఎం ఫోటోను పక్కన పెట్టారన్నారు. జరిగిన ఘటనపై నయా దేశ్ ముఖ్ సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విసునూరి రామచంద్ర రెడ్డి లాంటి వాడు రేవంత్ రెడ్డి అని... భట్టి విక్రమార్కకు జరిగిన అవమానంపై కాంగ్రెస్ పార్టీ హైకామండ్ స్పందించాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటన జరగకుండా చూడాలని బాల్క సుమన్ డిమాండ్ చేశారు.

విజయవాడ రైల్వేలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

నేడు ప్రారంభించనున్న ప్రధాని మోడీ

విజయవాడ : విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో పలు ప్రాజెక్టులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈనెల 12న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించ నున్నారని డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. తణుకు, బిక్కవోలు, ఏలూరుల్లో మూడు అప్ గ్రేడెడ్ గూడ్సు షెడ్లను, 67 ఓఎస్ఓపీ స్టాళ్లు, గూడూరు- బిట్రగుంట, బిట్రగుంట- కరవది- చీరాల మూడో లైన్లను, విజయవాడ బైపా?సలైన్‌ను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. ఈ మొత్తం ప్రాజెక్ట్ వ్యయం రూ.3,246 కోట్లుగా పేర్కొన్నారు. వీటితో పాటు సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య రెండో వందేభారత్ రైలును ప్రారంభించనున్నట్టు తెలిపారు. విశాఖపట్నం-విజయవాడ-సికింద్రబాద్ మధ్య ప్రయాణికులకు ఈ రైలు ఉపయుక్తంగా ఉందన్నారు. విజయవాడ రైల్వే డివిజన్‌కు 15 గూడ్స్ షెడ్ల అప్‌గ్రేడేషన్ కోసం రూ. 150 కోట్లు కేటాయించిందన్నారు. తాడేపల్లి గూడెం, బయ్యారం, బిక్కవోలు, ద్వారపూడి, పడుగుపాడు, సామర్లకోట, కృష్ణాకెనాల్, ఏలూరు. గుడివాడ, తెనాలి, నిడదవోలు, పాలకొల్లు, అకివీడు, తణుకులలో గూడ్స్ షెడ్లు ఉన్నాయని తెలిపారు. అదనపు డీఆర్ఎం ఎం.శ్రీకాంత్ సీనియర్ డివిజనల్ కమర్షియల్‌మేనేజర్ వావిలపల్లి రాంబాబు, పీఆర్ఓ నుస్రత్ ఎం మంద్రుప్కర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

దిశశ్చ నారాయణః

తిరుమల : దిక్కులకు మనం తూర్పు, పశ్చిమం అని ఇలా దిక్కులు పెట్టుకున్నాం. మనకు కనిపించిన వాటిలో సూర్యుడు ఎప్పటికీ ఉండువాడు కనక ఆ సూర్యుడు ఎక్కడ కనపడితే అది తూర్పు అని ఇలా దిక్కులు ఏర్పాటుచేసుకున్నాం. ఆ దిక్కులను బట్టి ప్రతి దిక్కులు ఆగ్నేయం, ఈశాన్యం అని ఇలా పెట్టుకున్నాం. మరి ఈ అనంతమైన విశ్వంలో సూర్యుడి కంటే పెద్ద నక్షత్రాలు ఎన్నో ఉన్నాయి. ఒక వేల మనం సౌరమండలాన్ని దాటి బయటికి వెళ్తే మనం దిక్కులు ఎట్లా చెప్పగలం ? దిక్కులనేవి ఒకేలా ఉండవు. అందుకే మన పూర్వులు చాలా అందంగా చెబుతారు. ఇప్పుడు మనం చూసే తిరుమలని ఉత్తర తిరుమల అని అంటారు. మరి దక్షిణ తిరుమల అని కూడా ఒకటి ఉంది. ఆండాళ్ తల్లి తను వెయ్యి గంగాలాల్లో పాయసం పెడతానని మొక్కుబడి చేసింది, ఆయన పేరు సుందరభాహు స్వామి. ఆ ఉందరభాహు స్వామి ఉండే ప్రదేశాన్ని దక్షిణ తిరుమల అని అంటారు. ఉత్తర దక్షిణాలు ఎవరిని బట్టి నిర్ణయం చేసారు అంటే, ఈ సూర్యుడిని బట్టి చేయలేదు. భగవంతుడిని బట్టి నిర్ణయం చేసారు. ఈ భూమిపై మొదటగా కనిపించిన భగవంతుడు 'శ్రీరంగ నాథుడు', ఆయనను బట్టి చెప్పారు. మొదట శ్రీరామ చంద్రుడి ఇలవేల్పు అతడు. తరువాత ఉభయ కావేరీ మధ్యన చేరి ఉన్నాడు. సూర్యుడికి కూడా కాంతినిచ్చేవాడు ఆ భగవంతుడే కదా. భగవద్గీతలో భగవంతుడు ఇదే చెప్పాడు. ఉపనిషత్ కూడా ఈ విషయమే చెబుతుంది. నతత్ర సూర్యో భాతి నచంద్ర తారకంనేమా విద్యుతో భాతి కుతోయమగ్నిఃతమేవ భాంతమనుభాసితర్వం తస్య భాస సర్వమిదం విభాసి ఈ కాంతి నిచ్చే గోళాలు ఏవీ సహజంగా కాంతి నివ్వడంలేదు. వెనకాతల ఆయన లేకుంటే ఆ కనిపించే సూర్య గోళం కూడా మూలన పడి ఉండాల్సిందే. అందుకే మనకు శ్రీరంగనాథుడు ఎక్కడ ఉంటే సూర్యుడు ఉన్నట్టు లెక్క. దాన్ని బట్టి దిక్కులు. శ్రీరంగం మధ్యలో ఉంది ఇటు వెంకటేశుడు ఉన్నాడు, అటు సుందరబాహు స్వామి ఉన్నాడు. అందుకే వెంకటేశుడు ఉన్న ప్రాంతాన్ని ఉత్తర తిరుపతి అని, సుందరబాహు స్వామి ఉన్న ప్రదేశాన్ని దక్షిణ తిరుపతి అని అంటారు



ఆధ్యాత్మికం

ఒంటరి మహిళా రైతులకు ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థిక భరోసా

● హార్టికల్చర్ శాఖ సబ్సిడీకి అదనంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఆర్థిక సహాయం ● ఎకరా నుంచి 5 ఎకరాల భూమి కలిగిన అర్హులైన మహిళా రైతులకు అవకాశం ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి జిల్లాలోని ఒంటరి మహిళా రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించి, వారి జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హార్టికల్చర్ శాఖ ద్వారా ఆయిల్‌పామ్ మొక్కలు, అంతర పంటలు, డ్రిప్ పరికరాలపై నాలుగు సంవత్సరాలకు గాను ఎకరానికి రూ.16,800 రాయితీ అందించబడు తుందని తెలిపారు. దీనికి అదనంగా రైతు వాటాగా చెల్లించాల్సిన మొత్తం లేదా రైతుకు అదనంగా అయ్యే ఖర్చును జిల్లా యంత్రాంగం ప్రత్యేక సహాయం కింద భరించనున్నట్లు పేర్కొన్నారు. భర్తను కోల్పోయిన లేదా ఇతర కారణాలతో ఒంటరిగా జీవిస్తున్న ఆర్థికంగా వెనుకబడిన మహిళా రైతులు, 1 ఎకరం నుంచి 5 ఎకరాల వరకు భూమి కలిగి ఉన్న వారు ఈ అదనపు ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన మహిళా రైతులు తమ గ్రామంలోని హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు, హార్టికల్చర్ అధికారులు, ఆయిల్‌పామ్ ఫీల్డ్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అలాగే స్వయం సహాయక సంఘాల ద్వారా లేదా ఐడీఓసీలోని జిల్లా హార్టికల్చర్ అధికారి కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కలు పక్వానికి వచ్చే మొదటి నాలుగు సంవత్సరాల్లో ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూరగాయలు వంటి పంటలను సాగు చేసుకోవడం ద్వారా రైతులు తరచుగా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఆయిల్‌పామ్ దిగుబడికి వచ్చిన అనంతరం నాలుగో సంవత్సరం నుంచి ఎకరానికి సంవత్సరానికి సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2.00 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒంటరి మహిళా రైతులు తమకు ఉన్న భూమిని సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్‌తో పాటు అంతర పంటల సాగు ద్వారా స్థిరమైన ఆదాయం పొందుతూ ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలన్నదే ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. అర్హులైన మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ సాగు ద్వారా తమ కుటుంబ జీవనోపాధిని మెరుగు పరచుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏఐఎస్ఎఫ్ 90వ వారోత్సవాలను జయప్రదం చేయండి

● ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

గోదావరిఖని ప్రతినిధి : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 28,29,30 తేదీలలో హన్మకొండలో జరగబోయే ఏఐఎస్ఎఫ్ 90 వ వారోత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం తెలిపారు. ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ ఓజా ఆవిష్కరించడం జరిగిందని, అనంతరం ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘమని, స్వాతంత్రం రాకపూర్వమే 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని, లక్నో నగరంలోని బెనారస్ యూనివర్సిటీలో పురుడోసుకున్నదని ,కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు, నాటి నుంచి నేటి వరకు విద్యార్థుల హక్కులు, ప్రభుత్వ విద్య పరిరక్షణ ,సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏదైనా ఉన్నదంటే అది ఒక అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ అని ఆయన అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్నటువంటి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలలో మౌలిక సదుపాయాల కల్పించాలని, పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ,ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని, మెస్ ,కాస్మోటిక్ చార్జీలను ధరలకు అనుగుణంగా పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, విద్యాశాఖ మంత్రిని వెంటనే కేటాయించాలని, గురుకుల విద్యార్థులకు సొంత భవనాలను కేటాయించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, అనేక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆయన అన్నారు. విద్యార్థులకు అండ, ఏఐఎస్ఎఫ్ జెండా ఎల్లప్పుడూ ఉంటదని ,ఈనెల 28,29,30 తేదీలలో హన్మకొండలో జరగబోయే ఏఐఎస్ఎఫ్ 90 వ వారోత్సవాలకు విద్యార్థి లోకం తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ గర్ల్స్ జిల్లా కన్వీనర్ గుండ్ల లక్ష్మీప్రసన్న, అభిషేక్, ఆరే జశ్వంత్, చైత్ర,సజన్, మహిన్, ఆరిఫ్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై ఏకాగ్రత సాధించేందుకు అల్పాహార కార్యక్రమం

● హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ సమన్వయంతో విద్యార్థులకు అల్పాహారం ● ప్రతిరోజూ అల్పాహారంతో పాటు పాలు, రాగిజావ ● విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి : విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు చదువుపై మరింత ఏకాగ్రత సాధించేందుకు పాఠశాలల్లో నిర్వహిస్తున్న అల్పాహార కార్యక్రమం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం కమాన్‌పూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న అల్పాహార కార్యక్రమాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి అల్పాహారం నాణ్యత, రుచి, పరిమాణంపై వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకున్నారు. విద్యార్థుల ఏకాగ్రతకు అల్పాహారం దోహదం ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు అల్పాహారం తీసుకోవడం వల్ల ఆకలి సమస్య లేకుండా చదువుపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పోషకాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ విద్యార్థులకు అల్పాహారంతో పాటు పాలు, రాగిజావ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అందించే అల్పాహారం నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతిరోజూ అందిస్తున్న అల్పాహారం ఎలా ఉంది, రుచిగా ఉంటుందా, పాలు లేదా రాగిజావ అందుతున్నాయా తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని కార్యక్రమం మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణతో పాటు వారి విద్యాభ్యాసానికి అవసరమైన అనుకూల వాతావరణం కల్పించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటెండెన్స్ పడింది డ్యూటీ గాలి కెళ్లింది

● సింగరేణి మైన్‌లో మందు మజా! ● జీతం సింగరేణిది జల్సా కొందరిది! ● అటెండెన్స్ అండతో డ్యూటీకి డ్యూటీ ఎంజాయ్‌కి ఎంజాయ్ ● డ్యూటీ పేరుతో ఎంట్రీ మద్యం మత్తులో ఎగ్జిట్ - ఆర్జీ-2లో హాట్ టాపిక్

గోదావరిఖని ప్రతినిధి : బొగ్గు కోసం భూమి గర్భంలోకి దిగే కార్మికుడికి డ్యూటీ అంటే ప్రాణంతో సమానం. చెమట చిందిస్తేనే జీతం వస్తుంది. ప్రమాదాలను ఎదుర్కొంటేనే సింగరేణి ఉత్పత్తి పెరుగుతుంది. కానీ ఆర్జీ -2 పరిధిలో కొందరి తీరు మాత్రం “డ్యూటీకి వచ్చామా అటెండెన్స్ వేయించుకున్నామా ఇక మనకేం పని” అన్నట్టుగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెకండ్ షిఫ్ట్, నైట్ షిఫ్ట్ సమయంలో కొందరి వ్యవహారశైలి సరిగా లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. విధులకు హాజరైనట్లు అటెండెన్స్ వేయించుకుని పని చేయకుండా మద్యం సేవిస్తూ కాలక్షేపం చేస్తున్నారన్న ఆరోపణలు ఇప్పుడు మైన్ పరిధిలో చర్చనీయాంశంగా మారాయి. అటెండెన్స్‌కు సంతకం డ్యూటీకి గుడ్‌బై అన్నట్టుగా ఉంది కొందరితీరు. నెలకు 60 వేల నుండి లక్ష రూపాయల వరకు వేతనం, ఇతర అలవెన్సులు తీసుకునే ఉద్యోగులు విధులు నిర్వహించకుండా జీతం తీసుకుంటే ఆ జీతం ఎవరి కష్టానికి ప్రతిఫలం, ఒకవైపు సింగరేణి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులు, మరోవైపు అదే సంస్థ జీతం తీసుకుంటూ విధులను విస్మరిస్తున్నారన్న ఆరోపణలు. ఇది డ్యూటీనా, దోపిడీనా, ఇది ఉద్యోగమా, ఎంజాయ్‌మెంట్ ప్యాకేజీనా, అటెండెన్స్ పడిన తర్వాత డ్యూటీని పక్కన పెట్టే అవకాశం ఉంటే రేపు నిజాయితీగా పనిచేసే కార్మికుడు కూడా అదే బాట పట్టే ప్రమాదం ఉందంటున్నారు. “మనోళ్లు” ఉంటే మైన్‌లో మజానేనా? “అటెండెన్స్ వేసే అధికారులు మనవాళ్లే మనల్ని ఎవరు ఏం చేస్తారు” అన్న ధీమాతోనే కొందరు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు మరింత తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అధికారుల అండదండలు ఉంటే నిబంధనలు నిద్రపోతున్నాయా, తనిఖీలు కేవలం నిజాయితీగా పనిచేసేవారికేనా, ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సింది ఎవరు. కొందరు అధికారులు కార్మికులందరినీ సమానంగా చూడకుండా నచ్చిన వారికి ఒక తీరు, నచ్చని వారికి మరో తీరు చూపుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిబంధనలు అందరికీ ఒకటే అయితే అమలు మాత్రం ఎందుకు ఒక్కో వ్యక్తికి ఒక్కోలా. తమ కళ్ల ముందే జరుగుతున్న వ్యవహారాలను ప్రశ్నించడానికి కూడా కార్మికులు భయపడే పరిస్థితి ఉంటే అది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు. మొత్తం వ్యవస్థను ప్రశ్నించే పరిస్థితి. కష్టపడేవాడు బొగ్గు కొడతాడు, కొందరు కూర్చొని జీతం కొడతారా. సింగరేణిని తమ కుటుంబంగా భావించి పనిచేసే కార్మికులే సంస్థకు అసలు బలం. అలాంటి వారి మధ్య విధులకు ఎగనామం పెట్టేవారికి ప్రత్యేక సౌకర్యాలు లభిస్తున్నాయన్న భావన ఏర్పడితే నిజాయితీగా పనిచేసే కార్మికుడి మనసులో ఏం జరుగుతుంది. “నేను ఎందుకు కష్టపడాలి” అనే ప్రశ్న మొదలైతే అది ఒక్కరి సమస్యగా మిగలదు. కూసే గాడిద మేసే గాడిదను చెడగొట్టినట్టు కొందరి వ్యవహారశైలి చూసి నిజాయితీగా పనిచేసేవారు కూడా నిరుత్సాహానికి గురయ్యే ప్రమాదం ఉందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు గని అంటే సరదా ప్రదేశం కాదు. అక్కడ నిర్లక్ష్యానికి చోటుండదు. మద్యం మత్తులో విధులు నిర్వహించడం జరిగితే అది వ్యక్తిగత వ్యవహారం కాదు. సహచరుల భద్రతకు సంబంధించిన అంశం. అందుకే ఆరోపణలు నిజమో కాదో తేల్చేందుకు ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు, హాజరు రికార్డుల పరిశీలన, అవసరమైన శాఖాపరమైన విచారణ చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు. సింగరేణి జీతం సింగరేణికే వెన్నుపోటా. సంస్థ లాభాల్లో నడవడానికి ఒక్కో కార్మికుడి చెమట చుక్క విలువైనదే. కానీ పని చేయకుండా వేతనం తీసుకోవడం నిజమైతే అది సంస్థపై భారం. డ్యూటీ ఎగ్గొట్టి జీతం తీసుకోవడం ఒక తప్పు అయితే, దాన్ని చూసీ చూడనట్టు వదిలేయడం మరో పెద్ద తప్పు. తప్పు చేసేవాడిని ప్రశ్నించాలి. తప్పును కప్పిపుచ్చేవారిని కూడా ప్రశ్నించాలి. నిబంధనలు ఉల్లంఘించినా అండగా నిలిచే వ్యవస్థ ఉంటే దానిపైనా సమాధానం కావాలి. “డ్యూటీకి డ్యూటీ.. ఎంజాయ్‌కి ఎంజాయ్”. సింగరేణి యాజమాన్యం ఈ ఆరోపణలను తేలికగా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఆరోపణల్లో వాస్తవం ఎంతుందో నిష్పక్షపాతంగా తేల్చాలి. అటెండెన్స్ ఎవరు వేశారు, విధులు ఎవరు నిర్వహించారు. షిఫ్ట్‌లో పర్యవేక్షణ ఎవరు చేశారు, మద్యం సేవించినట్లు ఆరోపణలు ఉన్నవారిపై తనిఖీలు జరిగాయా, నిజాయితీగా పనిచేస్తున్న కార్మికులకు ఎందుకు భయం. ఇవన్నీ బయటకు రావాల్సిన ప్రశ్నలు. సింగరేణి కార్మికుడి చెమటతో నిలబడిన సంస్థలో “మనవాళ్లు--మనకేం కాదు” అనే సంస్కృతికి చోటుంటే అది చివరికి సంస్థకే నష్టం. సింగరేణి బొగ్గు గనుల్లో బొగ్గు మండాలి. కార్మికుల కష్టార్జితం కాదు! డ్యూటీ చేయాల్సిన చేతుల్లో పనిముట్లు ఉండాలి. మద్యం గ్లాసులు కాదు. విధులు ఎగ్గొట్టేవారిపై చర్యలు ఎప్పుడు. అండగా నిలిచే అధికారులపై విచారణ ఎప్పుడు. నిజాయితీగా పనిచేసే కార్మికుడికి న్యాయం ఎప్పుడు. ఈ ప్రశ్నలకు సింగరేణి యాజమాన్యం సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

హమారా ప్రసాద్‌ను అరెస్టు చేసి జైలుకు పంపాలి....

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్18: ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానుపాటి రవి ఎరుకల, దళిత సంఘాల నాయకులు కలిసి కరీంనగర పట్టణంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వారు మాట్లాడుతూ కల్పిత నాయకుడు అంబేద్కర్ అనే బుక్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హమారా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కల్పిత నాయకుడు అంబేద్కర్ అని రాసిన బుక్కును రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేస్తూ హమారా ప్రసాద్ ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర సీఎం వెంటనే దినిపైన స్పందించాల్సిన అవసరం ఉందని ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మత దళిత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పైన రాసిన బుక్ ను రద్దు చేసి వెంటనే హమారా ప్రసాద్ ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. హమారా ప్రసాద్ వెనుక ఉండి నడిపిస్తున్న దేశ ద్రోహులను, దుర్మార్గులను కఠినంగా శిక్షించాని డిమాండ్ చేశారు. ఇంకోసారి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మీద ఇలాంటి చిల్లర మాటలు మాట్లాడకుండా అమరా ప్రసాదును వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బిజిలి శ్రీనివాస్ ఎరుకల యువసేన రాష్ట్ర కన్వీనర్ కట్టా రాజ్ కుమార్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బిజిలి శ్రీనివాస్ కూతాడి రమేష్ కోతాడి శ్రీనివాస్ సీనియర్ దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓసిపి 5లో నూతన యంత్రాలను ప్రారంభించిన యాజమాన్యం

హాజరైన గుర్తింపు సంఘం ఏఐటీయుసి నాయకులు

గోదావరిఖని ప్రతినిధి : సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె ఓసిపి 5లో శుక్రవారం 6.4 క్యూబిక్ మీటర్ లోడర్, 1 క్యూబిక్ మీటర్ షవల్ యంత్రాలను ఘనంగా ప్రారంభించడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు బోగ సతీష్ బాబు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగరేణి రామగుండం రీజియన్ ఏజీఎం రమేష్, ఓసిపి 5 ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, గుర్తింపు సంఘం ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ లు పాల్గొని ప్రాజెక్టులో యాజమాన్యం ఏర్పాటు చేసిన కొత్త యంత్రాలను ప్రారంభించారని, ఏఐటియుసి కృషి వల్ల యాజమాన్యం ఓసిపి 5లో కొత్త యంత్రాలు తెప్పించి ప్రారంభించినందుకు సింగరేణి యాజమాన్యానికి ఏఐటియుసి తరపున అభినందనలు తెలుపుతున్నామని ఆయన అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఓసిపి 5 ప్రాజెక్టు మేనేజర్ అనిల్ గబాలే, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, సహాయ కార్యదర్శి మాదన మహేష్,ఏఐటియుసి ప్రాజెక్టు కార్యదర్శి జి. ప్రభుదాస్, ప్రాజెక్టు ఇంజనీర్ శైలేంద్ర కుమార్, అలాగే ఓసిపి-5 కి చెందిన అధికారులు, యూనియన్ నాయకులు, కార్మికులు , ఉద్యోగులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో రోడ్ల దుస్థితిని ప్రస్తావించిన ఎమ్మెల్యే

కవ్వంపల్లి: రోడ్డు పూర్తిచేయకుంటే దీక్షకు పూనుకుంటా

గన్నేరువరం, సెప్టెంబర్18: కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలో గుండ్లపల్లి నుండి పొత్తూర్ వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని పంచాయతీరాజ్, రోడ్లు--భవనాల శాఖల పరిధిలో పలు రోడ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయని చాలాసార్లు ప్రస్తావించడం జరిగిందన్నారు. అనుమతులు మంజూరవుతున్నప్పటికీ, నిధులు విడుదల కాక పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడమే ప్రధాన కారణంగా గుండ్లపల్లి--పొత్తూర్ రోడ్డు నిర్మాణం విషయంలో కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని పాత బిల్లులను వెంటనే చెల్లించి గుండ్లపల్లి--పొత్తూర్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని ఇప్పటికే ఆ ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణం పూర్తికాకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టక తప్పదని స్పష్టం చేస్తూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రోడ్డు సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు.

హైదరాబాద్ (తారా జ్యోతి): మాజీ ఎంపీ మధుయాష్ గౌడ్ నూతనంగా ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్ పర్సన్ గా నియమితులైన సందర్భంగా వారికి కాంగ్రెస్ యూనియన్ నాయకులు జి రామన్ గౌడ్ టి పి సి సి ప్రధాన కార్యదర్శి సత్యం గౌడ్ మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వక కలిసి వారికి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

మేదరి వర్గాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి

● మేదరి పిల్లలకు ఉన్నత విద్య అందించాలి ● మేదరి కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు ● ఉప్పల్ బాగాయత్‌లో మేదరి భవన నిర్మాణానికి నిధులు ● వృత్తికి నైపుణ్యం జోడించి కాలానుగుణంగా ముందుకు సాగాలి ● మేదరి వృత్తిని ఆధునికీకరించి అభివృద్ధి సాధించాలి ● తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ : సెప్టెంబర్ 18 : మేదరి వర్గాలు సంప్రదాయ వృత్తితో పాటు మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుని ముందుకు సాగాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేదరి కులానికి చెందిన వారు కళాత్మకంగా రూపొందించిన వివిధ వెదురు వస్తువులను మంత్రి పరిశీలించారు. అనంతరం 'మేదరి జీవన విధానం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ నాయకుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు బీసీ సంఘాల నాయకులు, రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన మేదరి సంఘం ప్రతినిధులు రాష్ట్ర అధ్యక్షులు జొరిగల శ్రీనివాస్, కోన రాజశేఖర్, పాత కోటిఉమ, పిల్లి మహేంద్ర కుమార్, ప్యారసాని రమాకాంత్, జంట నగరాల అధ్యక్షులు రేశం మల్లేష్, జిల్లా అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు. తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఎన్నికలు, కార్యక్రమాల సందర్భంగా జెండా కట్టెల కోసం వెదురు కొనుగోలు చేసేవాడినని పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. మేదరి వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కుల గణన నిర్వహించిందని, దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారని ఆయన పేర్కొన్నారు. బీసీల అంశాలకు సంబంధించిన డిమాండ్లపై ప్రభుత్వం తరఫున కృషి చేస్తామని తెలిపారు. ఉప్పల్ బాగాయత్‌లో మేదరి సంఘానికి ఉన్న స్థలంలో భవన నిర్మాణానికి ఈ నెలలోనే నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. వెదురు పెంపకం, వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అందుబాటులో ఉన్న స్థలాలను ఉపయోగించుకోవాలని సూచించారు. మేదరి కార్పొరేషన్ ఏర్పాటు విషయంలో సంఘం ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ముందుకు వస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కార్పొరేషన్‌కు చైర్మన్‌ను కూడా నియమిస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. వృత్తి బతకాలంటే కాలానుగుణంగా మార్పులు చేసుకోవాలని, నైపుణ్యంతో పాటు సరైన శిక్షణ పొందాలని సూచించారు. మేదరి వర్గాల

సామాజిక, ఆర్థిక అభివృద్ధికి పిల్లల విద్య కీలకమని చెప్పారు. పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, ఈ దిశగా ప్రతి కుటుంబం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుల సర్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలను పరిశీలిస్తే ఉన్నత విద్య ద్వారా అనేక కుటుంబాలు అభివృద్ధి చెందాయని మంత్రి పేర్కొన్నారు. మేదరి వర్గాలకు అవసరమైన సహకారం అందించేందుకు సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నవారు ఐక్యంగా ముందుకు రావాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

గణనాథుడు పనులు విఘ్నాలు లేకుండా విజయవంతం అయ్యేలా చూడాలి

● రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ● వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, గోదావరి నదిలో గణనాథుని నిమజ్జనం

గోదావరిఖని క్రైమ్ : విఘ్నాలు లేకుండా విజయవంతంగా పనులు పూర్తయ్యేలా చూడాలని మహాగణపతిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారని, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది తాము ప్రారంభించిన పనులు ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యేలా చూడాలని మహాగణపతిని కోరుకున్నామని తెలిపారు. ముఖ్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ శాఖ సూచనల మేరకు ఆయా మండపాల నిర్వాహకులు, ? యువత తగిన జాగ్రత్తలు తీసుకోవడం అభినందనీయమని, ఇదే విధంగా నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించినట్లు వెల్లడించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్‌లో గత ఐదు రోజులుగా విశేష పూజలు అందుకున్న గణనాథుని శోభాయాత్రను ప్రారంభించగా, గణపతి విగ్రహాన్ని డప్పు వాయిద్యాల నడుమ పోలీస్ అధికారులు, సిబ్బంది, పిల్లలు, మహిళలు కోలాటాలు, ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి గోదావరి నదిలో నిమజ్జనం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏవో శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు బీమేష్, శ్రీనివాస్, ఆరఐలు శేఖర్, రమేష్, దామోదర్, మల్లేశం, సీసీ సందీప్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నవీన్, ఉపాధ్యక్షుడు తిరుపతి, సంయుక్త కార్యదర్శి ఓంకార్, సీపీఓ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు సురక్షితమైన వైద్యం అందించడమే లక్ష్యం..

● డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్

జమ్మికుంట సెప్టెంబర్ 18 : ఆరోగ్య సేవలు పొందుతున్న ప్రతి రోగికి సురక్షితమైన, నాణ్యమైన వైద్యం అందించడమే పేషెంట్ సేఫ్టీ డే ముఖ్య ఉద్దేశమని హుజురాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చందన ఆధ్వర్యంలో పేషెంట్ సేఫ్టీ డే సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ప్రభుదాస్ మాట్లాడుతూ.. వైద్య చికిత్స సమయంలో సంభవించే ప్రమాదాలను తగ్గించడంతో పాటు, మందుల వినియోగం, రోగ నిర్ధారణ, వైద్య చికిత్సలో జరిగే పొరపాట్లను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధులు వంటి దీర్ఘకాలిక వ్యాధులకు సురక్షితమైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. వైద్య చికిత్సకు సంబంధించిన నిర్ణయాల్లో రోగులు, వారి కుటుంబ సభ్యులు భాగస్వాములు కావడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. కార్మికులకు రక్తపోటు, మధుమేహం తదితర అసంక్రమిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. వడ్డెర కాలనీలో డ్రై డే కార్యక్రమం వడ్డెర కాలనీలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డ్రై డే ఫ్రైడే, డ్రై డే ట్యూస్‌డే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు. డ్రై డే పాటించడం ద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, అనారోగ్యానికి గురైనప్పుడు సమీపంలోని

ప్రభుత్వ వైద్య సిబ్బందిని సంప్రదించి ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సదానందం, శరత్, జిల్లా ఆరోగ్య విద్యాధికారి పంజాల ప్రతాప్ గౌడ్, సబ్‌యూనిట్ ఆఫీసర్ రాజేందర్ రాజు, ఆరోగ్యశాఖ సిబ్బంది సాజిదా పర్వీన్, నరేందర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏటి వద్ద లైటింగ్ ఏర్పాటు చేసిన సర్పంచ్ ఆదిలక్ష్మి

మధిర ప్రతినిధి, సెప్టెంబర్ 18 : వినాయక నిమజ్జనం సందర్భంగా ఏటివద్ద రాత్రివేళల్లో ప్రజలు ఎదుర్కొంటున్న చీకటి సమస్యకు పరిష్కారం లభించింది. మధిర మండలం ఇల్లూరు ఏటి వద్ద బ్రిడ్జి సమీపంలో గ్రామ సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులకు, రాత్రివేళల్లో ఇబ్బందులు లేకుండా వెలుతురు అందుబాటులోకి వచ్చింది. ప్రతి ఏటా వినాయక నిమజ్జనం సమయంలో ఏటి పరిసరాల్లో చీకటి కారణంగా ఇబ్బందులు ఎదురయ్యేవి.

ఈసారి సమస్యను గుర్తించి బ్రిడ్జి వద్ద లైట్లు ఏర్పాటు చేయడం పట్ల సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మికి, ఉప సర్పంచ్ కోట వరుణ్ కి, పాలకవర్గానికి గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ చర్య అభినందనీయమని పేర్కొన్నారు..

ఎస్సారెస్పీ భూములను పరిశీలించిన కలెక్టర్..

హుజురాబాద్ సెప్టెంబర్ 18 : హుజురాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎక్లాస్పూర్ గ్రామంలో ఎస్సారెస్పీకి సంబంధించిన భూములను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు నాలుగు సర్వే నంబర్ల పరిధిలో ఉన్న సుమారు 24 ఎకరాల భూమి వివరాలను పరిశీలించిన కలెక్టర్.. భూమి ప్రస్తుత పరిస్థితి, వినియోగం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సైదాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్‌ను అడిగి భూమికి సంబంధించిన పలు వివరాలను తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ భూమి ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉందా? అనే అంశంపై క్షేత్రస్థాయి పరిస్థితులను కలెక్టర్ పర్యవేక్షించారు. భూమికి సంబంధించిన సర్వే నంబర్లు, విస్తీర్ణం, రెవెన్యూ రికార్డుల్లో నమోదైన వివరాలను పరిశీలించి సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సర్వేయర్ మనోజ్ రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

గోదావరిఖని క్రైమ్ : శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద శుక్రవారం ఘనంగా అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత సీపీ స్వయంగా భక్తులకు, పోలీసు సిబ్బందికి అన్నప్రసాదం వడ్డించి సిబ్బందితో కలిసి భోజనం చేస్తూ వారితో ఆత్మీయంగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది ఐకమత్యం, సమన్వయం, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని కోరారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు సేవాభావంతో పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని సీపీ పిలుపునిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పోలీసు అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్ గౌస్ అలాం

జమ్మికుంట, సెప్టెంబర్ 18 : జమ్మికుంట పట్టణంలో జరగనున్న శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం నాయిని చెరువు వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ గౌస్ అలాం పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా, వేగవంతంగా నిర్వహించేందుకు మూడు క్రేన్లతో నిమజ్జన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, ఏసీపీ మాధవి, సీఐ రామకృష్ణ గౌడ్, ఎస్ఐలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా నాయిని చెరువు వద్ద గణేష్ నిమజ్జనానికి అవసరమైన భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్య చర్యలు, విద్యుత్ సౌకర్యాలు, తాగునీటి వసతి, లైటింగ్ మరియు ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చనున్నట్లు తెలిపారు.పట్టణ ప్రజలు గణేష్ మండపాలను సురక్షితంగా ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వం, పోలీసు శాఖ జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని, భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

మధిర ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా వేల్పుల పవన్ కళ్యాణ్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నిక....

మధిర ప్రతినిధి, సెప్టెంబర్ 18 :ఎమ్మార్పీఎస్ మధిర మండల నూతన కమిటీ నిర్మాణంకి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా ఇంచర్జ్ కందికట్ల విజయ్ మాదిగ, మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ కూరపాటి సునీల్ మాదిగ ఎం ఎస్ పి మాజీ జిల్లా అధ్యక్షులు తూటికశీటి అంజయ్య మాదిగ శుక్రవారం నాడు మధిర రికరేషన్ క్లబ్ నందు ఎమ్మార్పీఎస్ మధిర ఇంచార్జ్ పార్సపు ఏనుక మాదిగ ఆధ్వర్యంలో మధిర మండలంలోని అన్ని గ్రామాల ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏకగ్రీవంగా ఎన్నికైన మధిర మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ, మండల అధ్యక్షుడు, వేల్పుల పవన్ కళ్యాణ్ మాదిగ అధికార ప్రతినిధి: దోర్నాల ఆంజనేయులు మాదిగ ప్రధాన కార్యదర్శి:దర్శి నాగభూషణం మాదిగ కార్యదర్శులు: పుట్టా రవికుమార్ మాదిగ, గుంట పుల్లారావు మాదిగ, చౌటుపల్లి రవీందర్ కుమార్ మాదిగ ఉపాధ్యక్షులు: కొరివి శేఖర్ మాదిగ, కామచి శ్రీనివాసరావు మాదిగ కోశాధికారి: రాయవరపు రామకృష్ణ మాదిగ ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కనకపుడి శ్రీను మాదిగ, రాయవరపు దాసు మాదిగ, ఎం ఎస్ పి సీనియర్ నాయకులు ఎస్.కె రంజాన్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పల్లె పోగు స్వామి మాదిగ, ఎమ్మెస్ పి సీనియర్ నాయకులు ఎండి జమీర్, ఎస్కే దస్తగిరి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువతలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పించాలి

● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 18: ఖమ్మం జిల్లాను హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎయిడ్స్ అవగాహన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, లింక్ వర్కర్లు తదితరులు హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, హెచ్ఐవి వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు అవగాహన, జాగ్రత్తలు, బాధ్యతా యుతమైన ఆరోగ్య అలవాట్లు ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యంగా యువతలో ఎయిడ్స్ పై శాస్త్రీయమైన అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎయిడ్స్ తో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా, వారికి సామాజిక మద్దతు అందించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా హెచ్ఐవి నివారణ, నియంత్రణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని, ముఖ్యంగా యువత, విద్యార్థులు, అధిక ప్రమాదానికి లోనయ్యే వర్గాల్లో అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎచ్ఐవి ఎలా వ్యాప్తి చెందుతుంది, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధి నిర్ధారణ, చికిత్స, అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజలకు సరైన సమాచారాన్ని చేరవేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జానపద కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాతా సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ కథన విధానం 'పల్లె సుద్దులు' ద్వారా ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, చికిత్స మరియు వివక్ష నిర్మూలనపై యువత, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ డా. రామారావు, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వేణు మాధవ్, అదనపు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి (ఎయిడ్స్ ఉ లెప్రసి) డాక్టర్ ఎల్. ప్రవీణ, ఎస్ఆర్ఉబిజిఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ జాకీరుల్లా, ఆర్ఆర్సీ కోఆర్డినేటర్ డాక్టర్ బి. చెంచు రత్నయ్య, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. సునంద, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం అధికారులు, సిబ్బంది, కె.సి. పుల్లయ్య స్వచ్ఛంద సేవా సిబ్బంది, జనవాణి స్వచ్ఛంద సేవా సిబ్బంది, లింక్ వర్కర్స్ స్వచ్ఛంద సేవాసిబ్బంది,ఎ.శంకర్,అప్పాప్రెసిడెంట్,డిగ్రీకళాశాల విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైన అల్ఫోర్స్ ఇ- టెక్నో స్కూల్ విద్యార్థులు

● సైన్స్ జీవితంలో ఒక భాగం చాలా ప్రభావితం చేస్తుంది ● అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్18): విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య ద్వారా చాలా విషయాలు చర్చించవచ్చని తెలపవచ్చని, పలు పోటీ పరీక్షలకు సైతం ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేయవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు జిల్లా స్థాయి సౌత్ సైన్స్ డ్రామా పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సైన్స్ ద్వారా విద్యార్థులకు ఎన్నో విషయాలు ప్రధానంగా పరిశోధనాత్మకంగా వ్యవహరించడానికి చాలా ఉపకరిస్తుందని దాని లోని విషయాలను చాలా విశ్లేషణాత్మకంగా తెలుసుకోవడం ద్వారా సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చని మరియు నూతన విషయాలను ఆవిష్కరింప చేయవచ్చని వారు చెప్పారు. విద్యార్థులు తప్పనిసరిగా వైజ్ఞానిక శాస్త్రం పై పట్టు సాధించాలని, వివిధ సందర్భాలలో నిర్వహిస్తున్నటువంటి పోటీ పరీక్షలలో సైతం పాల్గొనాలని వారు చెప్పారు రోబోటిక్స్ శాస్త్రానికి మరియు ఇన్నవేషన్ టెక్నాలజీకి దగ్గర సంబంధం ఉన్నదని కావున సైన్స్ లోని విషయాలను విశ్లేషణాత్మకంగా నేర్చుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సైన్స్ మ్యూజియంలో నిర్వహించినటువంటి జిల్లా స్థాయి సౌత్ సైన్స్ డ్రామా పోటీలలో పాఠశాలకు చెందిన మాన్విత్ పటేల్, ఎస్.ఇషిత, ఈ.శ్రీకర్ రెడ్డి, ఎం.ఆద్య, ఎం.ఈశాన, వై శృతిజ, 7 వ తరగతి ఎస్. రేహాంత్ సాయి, సిహెచ్.రెహాన్ కార్తికేయ, ప్రథమ స్థానంలో నిలిచారని త్వరలో హైదరాబాద్లో నిర్వహించబోయేటువంటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం చాలా హర్షించదగ్గ విషయమని వారు చెప్పారు. రాష్ట్ర సాయి పోటీలకు ఎంపిక ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు పుష్పగుచ్ఛాలను అందజేసి రాష్ట్రస్థాయిలోనూ అద్భుతమైనటువంటి విజయాలను నమోదు చేయాలని జాతీయ స్థాయికి సైతం ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు కోసం బీజేపీ నిరంతర పోరాటం వల్లే అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే: తిప్పర్తి నిఖిల్

గన్నేరువరం, సెప్టెంబర్18: కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలో గుండ్లపల్లి - పొత్తూరు రెండు వరుసల రహదారి నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గత రెండున్నర ఏళ్లుగా బీజేపీ ఆధ్వర్యంలో సాగుతున్న పోరాటం ఫలితంగా నేడు అసెంబ్లీ సమావేశాల్లో రోడ్డు సమస్య చర్చకు వచ్చిందని బిజెపి మండలాధ్యక్షుడు తిప్పర్తి నిఖిల్ ఒక ప్రకటనను విడుదల చేశారు.గత ఎన్నికల్లో గుండ్లపల్లి - పొత్తూరు రోడ్డును కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారని, 100రోజులు 1000రోజులుదాటుతున్నా పనులు ముందుకు సాగక రోడ్డు గుంతలమయమై పూర్తిగా అధ్వానంగా తయారైందని, దీనివల్ల ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. దీంతో సమస్యపై బిజెపి నాయకులు ప్రజల పక్షాన నిలిచి గత రెండున్నర ఏళ్లుగా నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారని, ఇటీవల మరోసారి నిరసన కార్యక్రమం చేపట్టి, రోడ్డు దుస్థితిని వెంటనే అసెంబ్లీలో ప్రస్తావించాలని తాను ఎమ్మెల్యే కవ్వంపల్లిని డిమాండ్ చేశానని తిప్పర్తి నిఖిల్ తెలిపారు.బీజేపీ శ్రేణుల నిరసనలు,ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎట్టకేలకు గుండ్లపల్లి - పొత్తూరు రోడ్డు నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నేటి అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రభుత్వాన్ని కోరారని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం బిజెపి ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటానికి ఎమ్మెల్యే దిగివచ్చి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించడం సంతోషకరమని, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారి అస్తవ్యస్తంగా, నరకయాతనగా మారిన గుండ్లపల్లి-పొత్తూర్ రోడ్డుకు వెంటనే నిధులు విడుదల చేసి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని తిప్పర్తి నిఖిల్ మరోసారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహాజన సోషలిస్ట్ పార్టీ మధిర మండల అధ్యక్షుడుగా ఇర్మియం మాదిగ ఏకగ్రీవంగా ఎన్నిక...

మధిర ప్రతినిధి, సెప్టెంబర్ 18: ఎమ్మార్పీఎస్ మధిర మండల నూతన కమిటీ నిర్మాణంకి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా ఇంచార్జ్ కందికట్ల విజయ్ మాదిగ, మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ కూరపాటి సునీల్ మాదిగ ఎం ఎస్ పి మాజీ జిల్లా అధ్యక్షులు ఈతికేటి అంజయ్య మాదిగ శుక్రవారం నాడు మధిర రిక్రియేషన్ క్లబ్ నందు ఎమ్మార్పీఎస్ మధిర ఇంచార్జ్ పార్టపు ఏసుక మాదిగ గారి ఆధ్వర్యంలో, మధిర మండలంలోని అన్ని గ్రామాల ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏకగ్రీవంగా ఎన్నికైన మధిర మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ,మండల అధ్యక్షుడు:ఎం ఎస్ పి మేక పోగు ఇర్మియ మాదిగ అధికార ప్రతినిధి: బంక జవరత్న మాదిగ ప్రధాన కార్యదర్శులు ఇరుగు పుల్లారావు మాదిగ పగిడిపల్లి కాసిం మాదిగ ఉపాధ్యక్షులు పుట్ట భాస్కర్ మాదిగ కనకపుడి వెంకన్న మాదిగ, మంద ఆదాం మాదిగ, కోశాధికారి వేల్పుల మోహన్ రావు మాదిగ, కార్యదర్శులు గొల్లమందల స్వామి దాస్ మాదిగ, చాట్ల ఈశ్వరయ్య మాదిగ, సహాయ కార్యదర్శి వర్మాల స్వామి మాదిగ మారిపోగు రామారావు మాదిగ, సంగెపు రామారావు కార్యవర్గ సభ్యుడు పార్టపు నాగేశ్వరరావు మాదిగ ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కనకపుడి శ్రీను మాదిగ రాయవరపు దేవదాస్ మాదిగ, ఎంఎస్పి సీనియర్ నాయకులు ఎస్.కె రంజాన్ సీనియర్ నాయకులు పల్లె పోగు స్వామి మాదిగ, ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు ఎండి జమీర్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

-ఆర్జీ-త్రీ పరిధిలో నెలకొన్న సమస్యల పై జనరల్ మేనేజర్‌కి వినతిపత్రం

-తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు నాగెల్లి సాంబయ్య

రామగిరి, సెప్టెంబర్ 18:- సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, సింగరేణి యాజమాన్యం అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్నాయని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు నాగెల్లి సాంబయ్య ఆరోపించారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆర్. జి -త్రీ జీఎం కార్యాలయంలో సుంకర మధుసూదన్ కు వినతిపత్రంశ్రీ అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు నాగెల్లి సాంబయ్య మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో సింగరేణి కార్మికులకు స్వర్ణయుగం కొనసాగిందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. టీబీజీకేఎస్ సమర్పించిన ప్రధాన డిమాండ్లు కింద ఇవ్వబడ్డాయి సెంటినరీ కాలనీ నుండి గోదావరిఖని వెళ్లు కోల్ కారిడార్ రోడ్డు గుంతల మయమై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇట్టి రోడ్డును వెంటనే బీటీ రెన్యువల్ చేయించడం.అలాగే ప్రధానరోడ్డుకు ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కల వలన రోడ్డుపై వస్తున్న వాహనదారులకు ఇబ్బందులు ఇబ్బందులు ఎదురవుతున్నందున వాటిని తొలగించాలని పన్నూరు చౌరస్తా నుండి జీఎం ఆఫీస్ మీదుగా అడ్రియాల గని మూల మార్పు రోడ్డు వరకు ఉన్న రహదారి పూర్తిగా గుంతల మయమై ప్రమాదాలకు కారణమవుతున్నది. పోలీస్ స్టేషన్, రెవెన్యూ, ఎంపీడీవో, జనరల్ మేనేజర్ కార్యాలయాలతో పాటు ప్రముఖ జేఎన్టీయూ కాలేజ్ మరియు అడ్రియాల గనికి వెళ్ళు ప్రధాన రహదారి ఇది. వెంటనే ఇట్టి రోడ్డును మరమ్మత్తు చేయించాలి లేదా పునర్నిర్మించాలి.శీలు పెద్దపెల్లి -మంథని మార్గంలోని ప్రధాన రహదారి సెంటినరీ కాలనీ వద్ద జోన్ 1 ,జోన్ 2 మరియు జ2 క్వార్టర్లకు వెళ్ళు అప్రోచ్ రోడ్లను కంకర వేసి దీ వేయకుండా వదిలేశారు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే అప్రోచ్ రోడ్లపై తారు బీటీ నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.వాజ 2 మైన్ ముందు ప్రధాన రహదారి వద్ద డివైడర్లకు వార్నింగ్ సిగ్నల్స్ కానీ రేడియం సిగ్నల్స్ కానీ లేవు. సరైన వెలుతురు లేక వాహనాలు వేగంగా వచ్చి డివైడర్లను ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ డివైడర్లకు రేడియం ఇండికేటర్స్ మరియు బ్లింక్ లైటింగ్ ఏర్పాటు చేయించాలి. ఓసి 2 ఆఫీస్ కి వెళ్లే ప్రధాన రహదారి కంకర వేసి నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశారు. వెంటనే బీటీ పనులను పూర్తి చేయించాలి. ఓసి 2 గని ప్రధాన రహదారి వద్ద రిక్వెస్ట్ బస్సు స్టాప్ ఏర్పాటు చేసి షెల్టర్ ను నిర్మించాలి. రాణి రుద్రమదేవి స్టేడియంలో వాకింగ్ ట్రాక్ ను గ్రేడింగ్ చేయించి ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలి. స్టేడియం గ్రౌండ్ లో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించే విధంగా రాత్రి 11 గంటల వరకు సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయాలి. అవసరమైతే సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేయాలి.ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ పింగిలి సంపత్ రెడ్డి,సెంట్రల్ నాయకులు దేవ శ్రీనివాస్, రమ్యా రెడ్డి, డివిజన్ నాయకులు దాసరి మల్లేష్, గండి శ్రీనివాస్, పెద్ది స్వామి, పిట్ సెక్రటరీలు గీటుకు శ్రీనివాస్, రవిశంకర్ చిప్ప సురేష్ సైన్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలి: సీపీ గౌష్ ఆలం

శంకరపట్నం, సెప్టెంబర్ 18: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన "పోలీసులు మీకోసం" కార్యక్రమానికి జిల్లా పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులకు భవిష్యత్ ప్రణాళిక, లక్ష్య సాధనపై అవగాహన కల్పించారు. భవిష్యత్ లక్ష్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుని, ప్రతి విద్యార్థికి గోల్ కార్డు రూపొందించి, ఫోటో ఫ్రేమ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.... తన తండ్రి ఆర్మీలో పనిచేయడం వల్ల చిన్ననాటి నుంచే యూనిఫాం సర్వీస్‌పై ఆసక్తి ఏర్పడిందని, అదే లక్ష్యంతో కష్టపడి 25 ఏళ్ల వయసులో ఐపీఎస్ సాధించానని తన స్వీయ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. కేవలం లక్ష్యాన్ని చేరుకోవడం మాత్రమే కాక లక్ష్యం వెనుకున్న 'పర్పస్'ను నెరవేర్చడం అత్యంత ముఖ్యమన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని, అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరిస్తూ, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ, చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలంటూ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు సిపి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన డ్రగ్స్ వ్యతిరేక స్కిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను సీపీ ప్రారంభించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని తెలుపుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు హెల్మెట్లు, విద్యార్థులకు వాలీబాల్, క్యారమ్ బోర్డులు, ఇతర క్రీడా సామగ్రిని పంపిణీ చేసి పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఏసీపీ మాధవి, ఎస్సై శేఖర్, పోలీసు అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు వెంటనే విద్యుత్ పునరుద్ధరించాలి

ఆర్.జి-త్రీ లో కార్మికుల క్వార్టర్లకు కరెంట్ కట్‌పై ఆగ్రహం

బీజేపీ పెద్దపల్లి జిల్లా ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు ములుమూరి శ్రీనివాస్

రామగిరి, సెప్టెంబర్ 18:- సింగరేణి ఆర్.జి-త్రీ పరిధిలోని సెంటినరీ కాలనీలో కార్మికుల క్వార్టర్లకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడంపై బీజేపీ పెద్దపల్లి జిల్లా ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు ములుమూరి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు విష జ్వరాలు, మరోవైపు వాతావరణ మార్పులు, ఎండ తీవ్రతతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్న సమయంలో క్వార్టర్లకు కరెంట్ కట్ చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. కరెంట్ లేకపోవడం వల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని, రేపు ఏదైనా ప్రమాదం జరిగితే సింగరేణి యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్.జి-త్రీ సెంటినరీ కాలనీలో కరెంట్ కట్ చేసిన అన్ని క్వార్టర్లకు వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ములుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

అక్రమ కేసులతో వేధిస్తున్నారు: బాధితుల ఆవేదన

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 18: అక్రమ కేసులతో కూసుమంచి ఎస్ఐ వేధిస్తున్నారని కూసుమంచి మండలం, కేసవాపురం గ్రామానికి చెందిన మందపల్లి శ్రీనివాసరావు, రజనీ, మందపల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన పోటు ప్రదీప్, పోటు తిరుమలరావు అనే ఇద్దరు వ్యక్తులు రాత్రు, కర్రలతో తమ భూమిలోకి వచ్చి గొడవ చేసారని, వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. పైగా తామే దాడి చేశామంటూ అసత్య ఆరోపణలు చేస్తూ ప్రదీప్, తిరుమలరావు మాపై కూసుమంచి పోలీసులకు ఫి ర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. దీంతో తాము ఎఫ్ఐఆర్ కాపీ తీసుకుని డీజీపీ వద్దకు 03.11.2025 న వెళ్లి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఈ విషయం తెలిసి, కక్ష సాధింపు చర్యగా కూసుమంచి ఎస్సై తమపై అక్రమ సెక్షన్లతో కేసు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ఈ కేసు గురించి ఛార్జిషీట్ వచ్చిందంటూ తమను కోర్టుకు పిలిపించారని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్, ఆర్ ఐ విచారణ చేసి, తమకు వ్యతిరేకంగా, ప్రదీప్ కు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చారని ఆరోపించారు. అబద్దపు సాక్ష్యాలతో, ఎస్ఆర్సీని కలుస ఉన్న భూమిని మట్టి రోడ్డుగా మార్చి చూపుతూ అధికారులు తప్పుడు నివేదికలు తయారు చేశారని ఆరోపించారు. మాకు జరిగిన ఈ అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ కేసులను తొలగించి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి: సిపి గౌస్ ఆలం



కేశవపట్నం, సెప్టెంబర్18: కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలకేంద్రంలోని పలు గణేష్ మండపాలను జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం శుక్రవారం సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మండపాల వద్ద ఎలక్ట్రికల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచిస్తూ నిమజ్జన రోజున విద్యుత్ తీగలు, నీటి వనరులు, ట్రాఫిక్ తదితర అంశాల్లో అప్రమత్తంగా ఉండి భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. మండపాల వద్ద నిర్వహిస్తున్న పాయింట్ బుక్‌లను సీపీ తనిఖీ చేసి, సిబ్బంది విధులు, భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఏసీపీ మాధవి, ఎస్సై శేఖర్, పోలీసు సిబ్బంది సిపి వెంట సందర్శనలో పాల్గొన్నారు.

కుంభమేళా తరహాలోనే రాబోయే గోదావరి పుష్కరాలు

● ఏప్రిల్ నాటికి పనులు పూర్తి కావాల్సిందే ● గత పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కావొద్దు ● ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమష్టిగా ఏర్పాట్లు చేయండి ● గోదావరి పుష్కరాలు-2027" కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు

రామగిరి, సెప్టెంబర్ 18:-కుంభమేళా తరహాలోనే రాబోయే గోదావరి పుష్కరాలను నిర్వహించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని, అందుకు అనుగుణంగా వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమష్టిగా ముందుకెళ్లాలని అధికారులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. గత పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని వారికి దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన "గోదావరి పుష్కరాలు - 2027" కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా... గోదావరి పుష్కరాల సన్నద్ధత, ప్రముఖ దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు, ఘాట్ల నిర్మాణం, రవాణా, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్ల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... పుష్కర ఏర్పాట్లలో సమన్వయ లోపం తలెత్తకుండా జిల్లాలవారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాల్లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చేపట్టాల్సిన అదనపు ఏర్పాట్లపై ఘాట్ల వారీగా ప్రత్యేకంగా కలెక్టర్లతో క్షేత్రస్థాయి అధ్యయనం చేయించామన్నారు. పుష్కరాలు మొదలయ్యే నాటికి పూర్తయ్యే అవకాశమున్న పనులకే తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. చివరి వరకూ వేచి చూడకుండా గ్రౌండ్ రియాల్టీకి అనుగుణంగా ప్రతి పనికి ఒక నిర్దేశిత గడువును విధించుకోవాలని ఆదేశించారు. ఆయా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఇంటిగ్రేటెడ్ డ్యాష్‌బోర్డ్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. ఇంజినీర్ల కొరత తలెత్తకుండా ఆర్అండ్‌బీ, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలన్నారు. పుష్కరాల సమయంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని చెప్పారు. భద్రాచలం వద్ద ఎస్‌టీపీ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ఎన్ని నిధులనైనా కేటాయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, పుష్కర ఏర్పాట్లు, పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని తేల్చి చెప్పారు.

విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

● పలు గణనాథులను దర్శించుకున్న వెలిచాల రాజేందర్‌రావు దంపతులు ● హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం ప్రకటన

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్18: విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో కరీంనగర్ ప్రజలంతా సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన తన సతీమణి రేఖతో కలిసి నగరంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట జ్యోతినగర్‌లోని హనుమాన్ సంతోష్ మాత ఆలయంలో గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రకాశం గంజు, కోతిరాంపూర్, వెంకటేశ్వర కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, భారత్ టాకీస్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దర్శించుకున్నారు. ఆయా మండపాల వద్ద నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు రాజేందర్‌రావు దంపతులకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ కరీంనగర్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. నగరంలో వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమం ప్రారంభం: హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వెలిచాల రాజేందర్‌రావు ప్రారంభించారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్నదానం వడ్డించారు. భక్తులు, మండప నిర్వాహకులతో ఆయన ముచ్చటించారు. హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి రూ.5 లక్షలు: జ్యోతినగర్‌లోని హనుమాన్ సంతోష్ మాత ఆలయంలో పునర్నిర్మాణం చేపడుతున్న హనుమాన్ ఆలయానికి తమ వంతు సహాయంగా రూ.5 లక్షల విరాళం అందిస్తామని వెలిచాల రాజేందర్‌రావు--రేఖ దంపతులు ప్రకటించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ సంతోష్ మాత ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని పేర్కొన్నారు. హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం ప్రకటించడంపై స్థానిక కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్, ఆలయ కమిటీ ప్రతినిధులు రాజేందర్‌రావు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కార్పొరేటర్లు పడాల శ్రీజ అజయ్, పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య, ఆకుల నందిని ఉదయ్, కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్ నిమ్మల అంజన్న, ఆకుల ప్రకాష్, వేల్పుల వెంకటేష్, మిడిదొడ్డి కపిల్ మాధవ్, సముద్రాల రమణారావు, అనంతుల రమేష్, తిప్పారపు శ్రీనివాస్, బోనాల అశోక్, కొలిపాక కనకరాజు, కర్రె పావని, వెలిచాల యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్, పోరండ్ల రమేష్, పెద్దపల్లి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారత్ - అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందాలను పునఃసమీక్షించాలి

● రైతు ప్రయోజనాలను కాపాడే విధంగా వాణిజ్య విధానాలు రూపొందించాలి: రైతు సదస్సులో వక్తల డిమాండ్

పెద్దపల్లి ప్రతినిధి : అమెరికాతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావాన్ని సమగ్రంగా పునఃసమీక్షించాలని, భారత రైతుల ప్రయోజనాలను పరిరక్షించే విధంగా దేశ వాణిజ్య విధానాలను రూపొందించాలని రైతు సమస్యల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎం.బి. గార్డెన్స్‌లో రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ముడి మడుగుల మల్లన్న ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏలేశ్వరం వెంకటేష్, దుర్గం నగేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తలుగా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పేద ప్రజలకు "దున్నే వానికే భూమి" అనే డిమాండ్‌తో నక్సల్బరి వంటి రైతాంగ ఉద్యమాలు పుట్టుకొచ్చాయని పేర్కొన్నారు. మరోవైపు సెజ్‌లు, పారిశ్రామీకరణ, ఫ్యాక్టరీల ఏర్పాటు పేరుతో కార్పొరేట్ సంస్థలకు లక్షలాది ఎకరాల భూములను కేటాయిస్తున్నారని విమర్శించారు. వ్యవసాయం చేసుకునే భూమిలేని పేదలకు ప్రభుత్వం భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. విదేశాల్లో రైతులకు ప్రభుత్వాలు నీటిపారుదల, విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ అవసరాలకు వివిధ రకాల మద్దతు, సబ్సిడీలు అందిస్తున్నాయని తెలిపారు. అదే విధంగా భారతదేశంలో వ్యవసాయంపై ఆధారపడుతున్న కోట్లాది కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలు, చౌకగా ఎరువులు, సాగునీటి సౌకర్యం, పండించిన పంటలకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యాలు, శీతల గిడ్డంగులు తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. భారత్--అమెరికా వాణిజ్య చర్చల్లో వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన మార్కెట్ యాక్సెస్, సుంకాలు, ఇతర వాణిజ్య పరిమితులపై పలు అంశాలు చర్చకు వచ్చినట్లు అధికారిక పత్రాలు పేర్కొంటున్నాయి. భారత ప్రభుత్వం సున్నితమైన వ్యవసాయ ఉత్పత్తులకు రక్షణ కల్పించేందుకు కొన్ని ఉత్పత్తులను మినహాయింపు జాబితాలో ఉంచినట్లు చెబుతోంది. అయితే ఈ ఒప్పందాల వల్ల భారత రైతులపై పడే ప్రభావాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి, అవసరమైతే ఒప్పందాలను పునఃసమీక్షించాలని సదస్సు డిమాండ్ చేసింది. భారత రైతులకు నష్టం కలిగించే విధంగా దిగుమతులు పెరగకుండా, దేశీయ వ్యవసాయ ఉత్పత్తులకు రక్షణ కల్పించాలని కోరారు. భారతదేశ ఎగుమతులపై అనవసరమైన ఆంక్షలు, అధిక సుంకాల సమస్యలను పరిష్కరించి, రైతులు తమ ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పారదర్శకమైన మరియు న్యాయమైన మార్కెట్ పరిస్థితుల్లో విక్రయించుకునే అవకాశం కల్పించాలని వక్తలు కోరారు. భవిష్యత్తులో ఇతర దేశాలతో భారత్ చేసుకునే వాణిజ్య, వ్యవసాయ ఒప్పందాలపై నిర్ణయాలు తీసుకునే ముందు రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు, రైతులు, సంబంధిత ప్రజా సంఘాలతో విస్తృతంగా సంప్రదింపులు జరపాలని డిమాండ్ చేశారు. రైతుల జీవనోపాధి, దేశ ఆహార భద్రత, వ్యవసాయ రంగం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం రైతు ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చే విధానాలను అమలు చేయాలని, అలాగే బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి ఎక్కువ మొత్తం లో బడ్జెట్ కేటాయింపులు జరపాలి. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేయాలని, స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలనీ సదస్సు పిలుపునిచ్చింది. ఈ సదస్సు లో ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు కే విశ్వనాథ్ కాల్వ శ్రీరాంపూర్ మాజీ జెడ్పిటిసి గోపగాని సారయ్య గౌడ్, న్యూ డెమోక్రసీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కోడిపుంజుల రాజన్న, సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సామాజిక నాయకులు పోరెడ్డి వెంకట్ రెడ్డి, ఉమామహేశ్వర్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్ జిల్లా కమిటీ సభ్యులు రాజు అంజన్న పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొంకూరు లక్ష్మణ్, నారా వినోద్, రెడ్డి రాజుల సంపత్, శంకర్, సది, రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్ భీమన్న, ప్రజాపంథా మాస్ లైన్ పెద్దపెల్లి డివిజన్ కార్యదర్శి తిగుట్ల రాములు, గూళ్ల రాజు, బియ్యాల స్వామి, యాదన్న, సీనియర్ జర్నలిస్టు నరేంద్ర చారి సీపల్లి రాజేశం తదితరులు పాల్గొన్నారు. పిట్టల రమేష్, తూండ్ల రాజన్న, గోస్కుల రమేష్, కాసర్ల మల్లేశం, బుర్రగడ్డ రవి, తొలిపొద్దు అంజన్న, గోమేల సమ్మన్న ఆధ్వర్యంలో సంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి.

ఆర్టిఐ ముసుగులో వసూళ్ల పర్వం.. వీళ్లకు సహకరిస్తున్నది అధికారులేనా ..!

● సామాన్యులు రోజులు తిరిగిన అందని సమాచారం వీళ్లకు ఎలా అందుతుంది..! ● వసుల్లరాయుల దూకుడుతో వ్యాపారస్తుల కలవరం... ● వసూల్ రాయలకు చెరమగీతం పాడాల్సిందే..



జమ్మికుంట సెప్టెంబర్ 18 : ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు, ప్రభుత్వ శాఖల్లో పారదర్శకతను తీసుకురావడానికి ఉన్న సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)ను కొందరు వ్యక్తులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామాజిక కార్యకర్తలుగా పరిచయం చేసుకుంటూ వివిధ వ్యాపార సంస్థలు, సంస్థల నిర్వాహకులను లక్ష్యంగా చేసుకుని సమాచారం పేరుతో ఒత్తిళ్లు తెస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల సహకారం ఉందా..? సామాన్య ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజులు తిరిగినా సకాలంలో అందని సమాచారం, కొందరు వ్యక్తులకు మాత్రం తక్కువ సమయంలోనే ఎలా అందుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత శాఖల్లోని కొందరు అధికారుల సహకారం లేకుండా ఇంత వేగంగా సమాచారం అందుబాటులోకి వస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. వ్యాపారస్తుల్లో కలవరం తరచూ సమాచార అభ్యర్థనలు, నోటీసులు, ఫిర్యాదుల పేరుతో ఒత్తిడి పెరుగుతుండటంతో కొందరు వ్యాపారస్తులు ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. చట్టబద్ధంగా సమాచారం కోరడం ప్రతి పౌరుడి హక్కే అయినప్పటికీ, ఆ హక్కును వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారా? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. వసూళ్ల ఆరోపణలపై విచారణ జరగాలి ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులను అడ్డుపెట్టుకుని ఎవరైనా వ్యక్తిగతంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లయితే, దానిపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. నిజంగా వసూళ్లకు పాల్పడుతున్న వారెవరు? వారికి సహకరిస్తున్న అధికారులెవరైనా ఉన్నారా? అన్న అంశాలపై విచారణ జరిగితే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది. చట్టబద్ధమైన ఆర్టీఐ వినియోగాన్ని గౌరవిస్తూనే, దాని పేరుతో ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న తోట దంపతులు

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 18 : ఖమ్మం 3 టౌన్ ప్రాంతంలోని 46వ డివిజన్ జూబ్లిపుర ప్రాంతంలో శ్రీ బాల గణేష్ 21వ వార్షికోత్సవ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా 48వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు దంపతులు పాల్గొని గణనాధుని దర్శనం చేసుకొని పూజలో పాల్గొని అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఆధ్యాత్మికశోభను ఉద్దేశించి తోట దంపతులు మాట్లాడుతూ అన్ని పండుగలలో కంటే ఈ వినాయకచవితి అత్యంత ఆధ్యాత్మికంగా దైవ భక్తితో వాడవాడలా గణనాథుని ప్రతిష్టాపన చేసి తొమ్మిది రోజులు నవరాత్రి ఉత్సవాలు చేస్తూ భక్తి పరమయ్యే శుభప్రదమైన రోజులని గత 21 సంవత్సరాలుగా బాల ఉత్సవ కమిటీ సభ్యులు అత్యంత ప్రతిష్టాత్మకంగా గణనాథుని ప్రతిష్టాపన చేసి తొమ్మిది రోజులు నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుంకుమ పూజ, సరస్వతీ పూజ, మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారని. వారికి ఆ గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటు విఘ్నాలను తొలగించే వినాయకుడు ప్రజలందరికీ సుఖశాంతులు ఆయురారోగ్యాలు, సకల సంపదలు కలగజేయాలని ఆ గణనాథుని వేడుకొని భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు చేతి శ్రీను, చేతి కృష్ణమోహన్, దండా శివరాం, శ్రీనాథ్, ఉపేందర్, హరికృష్ణ, సంతోష్, ధనుంజయ్, అశోక్ మరియు భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు అవార్డు ఎంక్వయిరీ వాయిదా వేయాలి

-124 ఇళ్లను అవార్డులో చేర్చాలని రాజాపూర్--ఆదివారం పేట బాధితుల వినతి

రామగిరి,సెప్టెంబర్ 18: సింగరేణి భూసేకరణలో భాగంగా రాజాపూర్ గ్రామ పరిధిలోని ఆదివారం పేట రెవెన్యూ గ్రామంలో నిర్వహించనున్న అవార్డు ఎంక్వయిరీని గ్రామ సమస్యలు పరిష్కరించే వరకు వాయిదా వేయాలని బాధితులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ అధికారి, పెద్దపల్లి జిల్లాకు వినతిపత్రం సమర్పించారు. రాజాపూర్ గ్రామ పరిధిలోని ఆదివారం పేట రెవెన్యూ గ్రామంలో సుమారు 14 ఎకరాల 8 గుంటల భూములు, ఇళ్లకు సంబంధించి అవార్డు ఎంక్వయిరీకి హాజరు కావాలని ఈ నెల 16న నోటీసులు జారీ చేసినట్లు బాధితులు తెలిపారు. అయితే ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన నేపథ్యంలో ఎంక్వయిరీని సెప్టెంబర్ 18కు వాయిదా వేసినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా సమాచారం అందిందన్నారు. తమ గ్రామంలో మొత్తం 253 ఇళ్లు ఉండగా, ప్రాచీ పరిధిలో 35, ఐఎం పరిధిలో 77, నా-మ్రా పరిధిలో 14 ఇళ్లు కలిపి మొత్తం 124 ఇళ్లు పబ్లిక్ డిక్లరేషన్‌లో లేదా నోటీసుల్లో అధికారికంగా నమోదు కాలేదని బాధితులు పేర్కొన్నారు. మిస్సింగ్‌గా ఉన్న 124 ఇళ్లను గుర్తించి, వాటిని అవార్డు ప్రక్రియలో చేర్చకముందే ఎంక్వయిరీ నిర్వహిస్తే తమకు నష్టం జరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా ఇళ్లను పూర్తిగా గుర్తించి, అవార్డులో చేర్చిన అనంతరం మాత్రమే ఎంక్వయిరీ నిర్వహించాలని కోరారు. గ్రామంలోని సమస్యలను పూర్తిగా పరిష్కరించే వరకు అవార్డు ఎంక్వయిరీని వాయిదా వేసి, తమకు న్యాయం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ అధికారిని రాజాపూర్--ఆదివారం పేట భూసేకరణ బాధితులు కోరారు.

గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: రవికుమార్ యాదవ్

రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : శ్రీరామ్‌నగర్ సి-బ్లాక్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించగా, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్ యాదవ్ పాల్గొని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి దివ్య ఆశీస్సులతో శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతను చాటేలా నిర్వహించడం అభినందనీయమన్నారు. కాలనీలు, బస్తీలలో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులను ఆయన అభినందించారు. భక్తుల కోసం అన్నప్రసాద వితరణ చేపట్టడం సంతోషకరమన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్వేజ

బరువు తగ్గడానికి నీటి ఉపవాసం సులువైన మార్గమా? ప్రాణాలకే ప్రమాదమా?

బరువు తగ్గాలనే కోరికతో నేటి యువత ఏం చేయడానికి అయినా సిద్ధపడుతున్నారు. తమ అందం, ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగింది. బరువు తగ్గడానికి ఎన్నో మార్గాలు అందుబాటులో ఉన్నాయి. అయితే, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని ట్రెండ్స్ యువత ప్రాణాలకే ప్రమాదంగా మారుతున్నాయి. అలాంటి ఘటనే కేరళలో జరిగింది. 18 ఏళ్ల అమ్మాయి ఆన్‌లైన్‌లో చూసిన వీడియోను నమ్మి, కొన్ని నెలల పాటు నీళ్లు మాత్రమే తాగి ప్రాణాలు కోల్పోయింది. నీటి ఉపవాసం-నిజమెంత? నీటి ఉపవాసం అంటే, కొన్ని రోజుల పాటు ఆహారం మానేసి కేవలం నీళ్లు మాత్రమే తాగడం. ఈ విధానం ద్వారా వేగంగా బరువు తగ్గవచ్చని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే, ఇది ఎంత ప్రమాదకరమో చాలా మందికి తెలియదు. కొన్ని పరిశోధనల ప్రకారం, నీటి ఉపవాసం చేయడం వల్ల శరీరంలోని కణాలు తమను తాము శుద్ధి చేసుకుంటాయి. దీన్నే 'ఆటోఫాగి' అంటారు. అయితే, ఈ ప్రయోజనాలు చాలా తక్కువ కాలం మాత్రమే ఉంటాయి. %నూశ్రీంశీ =ఝుం% గ్రీన్ కార్డు ఉన్నా తరిమేస్తాం- తేల్చేసిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్..! 72 గంటలు దాటితే ప్రమాదమే! సాధారణంగా, నీటి ఉపవాసం 24 నుంచి 72 గంటల వరకు మాత్రమే చేయాలి. అంతకంటే ఎక్కువ రోజులు చేస్తే, అది ప్రాణాంతకం కావచ్చు. ఎక్కువ కాలం చేస్తే ప్రమాదకరం అని నిపుణులు చెబుతున్నారు. వాటర్ తాగడం 72 గంటలు దాటితే ఆరోగ్యానికి ప్రమాదం. శరీరంలో ఎలక్ట్రోలైట్స్ (సోడియం, పొటాషియం) స్థాయిలు పడిపోతాయి. డీహైడ్రేషన్ (శరీరంలో నీటి శాతం తగ్గడం) వస్తుంది. రక్తపోటు, చక్కెర స్థాయిలు పడిపోతాయి. గుండె పనితీరు మందగిస్తుంది. కండరాలు బలహీనపడతాయి. కిడ్నీలు దెబ్బతింటాయి. చివరికి ప్రాణాలు కూడా పోవచ్చు. మొదటిసారి నీటి ఉపవాసం ప్రయత్నించే వారికి, బలహీనత, మైకము మరియు తక్కువ రక్తపోటు సాధారణ దుష్ప్రభావాలు తలెత్తుతాయి. ఎవరికి ప్రమాదం? నీటి ఉపవాసం 72 గంటల మించితే ఆరోగ్యానికి ప్రమాదమే. గర్భిణీ స్త్రీలు, పిల్లలు అనారోగ్యాలకు గురైయ్యే అవకాశం ఉంది. గుండె, కిడ్నీ సమస్యలు ఉన్నవారు నీటి ఉపవాసానికి దూరంగా ఉండటం మంచిది. నీటి ఉపవాసం చేయాలనుకుంటే, ముందుగా డాక్టర్‌ను సంప్రదించాలి. క్రమంగా ఆహారం తగ్గించాలి, ఒకేసారి మానేయకూడదు. పుష్కలంగా నీళ్లు తాగాలి. ఏదైనా సమస్య వస్తే వెంటనే ఉపవాసం ఆపేయాలి.

రోజూ రాగి జావ తాగుతున్నారా
అయితే, ఇవీ తెలుసుకోవాల్సిందే..!!

రాగిజావ. ప్రాచుర్యం పొందిన పోషక పదార్థం. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆహారం. శరీరానికి కావాల్సిన పోషకాలను అందించటం లో సహకరిస్తుంది. ఇందులో ఉండే కార్బోహైడ్రేట్లు శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. ఉదయం వేళ ఖాళీ కడుపుతో తీసుకుంటే మరింత శక్తివంతగా పని చేస్తుంది. అదే విధంగా జీర్ణ వ్యవస్థ పని తీరు ను మెరుగు పరుస్తుంది. కడుపులో సహజంగా వచ్చే సమస్యలను నియంత్రిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ కారణంగా కడుపు నిండుగా ఉండటంతో పాటుగా బరువు తగ్గించటంలోనూ సహాయ కారిగా నిలుస్తుంది. అయితే, ఈ రాగి జావ ఎంత మంచిదో... అతిగా తీసుకుంటే సమస్యలు ఉన్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. రాగిజావ సహజ సిద్దంగా శరీరానికి మేలు చేస్తుంది. ఇందులో ఉండే కాల్షియం.. పోషకాలు ఎంత గానో ఉపకరిస్తాయి. చర్మానికి కావాల్సిన తేమను అందించి..ఆరోగ్యంగా ఉంచేందుకు సహకరి స్తుంది. మధుమేహ వ్యాధి గ్రస్తులకు ఈ జావ మేలు చేస్తుంది. ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ మోతాదు తక్కువగా ఉంటుంది. దీని కారణంగా చెక్కెర స్థాయి నియంత్రణలో ఉంచుతూ.. శరీరానికి శక్తిని అందిస్తుంది. ఉదయం వేళలో తీసుకోవటం ద్వారా శరీరానికి తక్షణ శక్తిని ఇస్తూనే.. ఎముకలకు బలాన్నిస్తుంది. ఇందులో ఉండే ప్రొటీన్ కణాల పునరుద్దరణకు సహకరిస్తుంది. ఇక, ఇదే సమయంలో రాగిజావ కు ప్రతీ రోజు ఒక సమయం కేటాయించి.. ఆ టైమ్ లో తీసుకోవటం ద్వారా ఆరోగ్య పరంగా ప్రయోజనం ఉంటుందని నిపుణులు సూచిసు న్నారు. రాగిజావ వినియోగంలోనూ కొన్ని సూచనలు చేస్తున్నారు. రాగి జావ ఉదయం వేళ తీసుకుంటే మంచి లాభాలు ఉంటాయి. రాత్రి సమయంలో కొందరికి ఇబ్బందులకు కారణం అవుతుందని చెబుతున్నారు. అదే విధంగా మూత్రాయశయ సమస్యలు... కిడ్నీల్లో రాళ్లు ఉన్న వారు రాగిజావ తీసుకోకపోవటం మంచిదని సూచిస్తున్నారు. బరువు పెరగాల నుకొనే వారికి రాగిజావ వలన ప్రయోజనం ఉండదు. అదే విధంగా మోతాదు మేరకు వినియోగిస్తే సమస్యల ఉండవని.. అంతకు మించి తీసుకుంటే కడుపులో ఉబ్బరం తో పాటుగా డయేరియాకు అవకాశం ఉంటుందని అలర్ట్ చేస్తున్నారు. థైరాయిడ్ సమస్యలు ఉన్న వారు వైద్యుల సూచనల మేరకే రాగిజావను తీసుకోవటం మంచిది. ప్రస్తుతం ఇన్ స్టంట్ గా వస్తున్న రాగిజావ కంటే ఇంట్లో తయారు చేసుకునే రాగిజావ ఆరోగ్య రీత్యా మంచిది.

నిద్ర పట్టట్లేదా? హాయైన నిద్ర కోసం
ఈ హెర్బల్ టీలను తాగండి!

ప్రస్తుత సమాజంలో చాలామంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. అయితే ఎవరైతే నిద్ర సరిగ్గా పోరో వారి ఆరోగ్యం పాడవుతుంది. వారు చురుగ్గా పనిచేసుకోలేరు. ఎక్కువకాలం నిద్రలేమి సమస్య కొనసాగితే ఆరోగ్యానికి చేటు జరుగుతుంది. కాబట్టి ఇటువంటి వారికి నిద్ర పట్టడం కోసం కొన్ని హెర్బల్ టీ లు ఎంతగానో సహకరిస్తున్నాయి. మరి వాటిని గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాం. ఈ టీ తాగితే హాయిగా నిద్ర పడుతుంది సాధారణంగా నిద్రపోకుండా ఉండాలంటే టీ తాగుతారు. అయితే మంచి నిద్ర పోవడానికి కూడా కొన్ని రకాల టీలు ఉపయోగపడతాయి. ఇవి మన మానసిక ఆందోళనను తగ్గించి, ఒత్తిడిని తగ్గించి మనకు బాగా నిద్ర పట్టేందుకు దోహదం చేస్తాయి. ప్రశాంతతను కలిగించి నిద్రను మెరుగుపరుస్తాయి. ఇక అటువంటి టీలలో గ్రీన్ టీ ఒకటి. గ్రీన్ టీతో హాయిగా నిద్ర గ్రీన్ టీ లో ఎల్ థియనైన్ అనే అమైనో యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. గ్రీన్ టీ తాగినప్పుడు చాలా హాయిగా అనిపించి నిద్ర పడుతుంది. అయితే కెఫీన్ తక్కువగా ఉండే గ్రీన్ టీ రకాన్ని ఎంచుకొని తాగడం ఎంతో మంచిది. ఇక మనకు నిద్ర బాగా పట్టడానికి ఉపయోగపడే టీ లలో చామంతి టీ ఒకటి. చమోమైల్ టీ, లావెండర్ టీ తో హాయిగా నిద్ర ఈ చామంతి టీ ని తాగడం వల్ల కూడా ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. చమోమైల్ టీలో ఉండే ఫ్లేవర్స్ శరీరానికి హాయిని ఇస్తాయి ఇది నాణ్యమైన నిద్ర పట్టడానికి ప్రతి ఒక్కరికి సహకరిస్తుంది. ఇక ప్రశాంతమైన నిద్రపోవడానికి లావెండర్ టీ కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనివల్ల మన నిద్రలో నాణ్యత పెరుగుతుంది. ఈ టీ తాగినట్లయితే మన శరీరం చాలా రిలాక్స్ అవుతుంది. ఆందోళన తగ్గుతుంది. గిన్ సెంగ్ టీ గిన్ సెంగ్ టీ.. ఈ టీలో అడాప్టేజన్ కాంపౌండ్స్ ఎక్కువగా ఉంటాయి.. ఇవి మన శరీరంలో హార్మోన్ల అసమతుల్యతను తగ్గిస్తాయి. ఇవి మనం ప్రశాంతంగా నిద్రపోవడానికి ఎంతగానో దోహదం చేస్తాయి. ఈ గిన్ సెంగ్ టీ బ్యాగులు మార్కెట్లో బాగానే లభ్యమవుతున్నాయి. త్వరలో నక్కతోక తొక్కి సంపన్నులయ్యే రాశులు వీరే.. రాసి పెట్టుకోమన్న రాహువు! వలెరియన్ మొక్క వేరుతో చేసిన టీ ఇక మనకు ప్రశాంతంగా నిద్ర పట్టించే టీ లలో వలేరియన్ మొక్క వేరుతో చేసే టీ ఒకటి. వలేరియన్ మొక్క వేరులో చాలా ఔషధ గుణాలు ఉంటాయి. ఇవి నిద్రలేమి సమస్యను తగ్గిస్తాయి. ఈ టీ తాగడం వల్ల నిద్ర మెరుగుగా పడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి నాణ్యమైన నిద్రకు ఈ టీ ఎంతగానో సహకరిస్తుంది.

మందార పూల టీ తాగితే మీ ఆరోగ్యంలో జరిగేవి అద్భుతాలే.. ట్రై చెయ్యండి!

ఇటీవల కాలంలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. ముఖ్యంగా ఉదయం పూట టీ తాగే విషయంలో చాలామంది తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తేయాకుతో తయారుచేసిన టీ కి బదులు శంఖు పూల టీ, మందార పూల టీ, తులసి ఆకుల తో టీ, గ్రీన్ టీ, బ్లూ టీ, లెమన్ టీ ఇలా రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. మందార పువ్వులలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ప్రస్తుతం మనం మందార పూలతో తయారుచేసే టీ లో ఉండే ఆరోగ్య ప్రయోజనాలను గురించి తెలుసుకుందాం. మందార చెట్టు రకరకాల రంగులతో రకరకాల సైజులలో పూస్తుంది. మందార పువ్వులలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. మందార పువ్వులలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంవల్ల ఇది మన శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. %నూశ్రీంశీ =ఝుం% రేపటినుండి ఈ రాశులవారికి జాక్ పాట్.. వెలిగిపోతారన్న సూర్యుడు మందార పూల టీతో యవ్వనంగా మందార పూల టీ తాగితే మన చర్మం వృద్ధాప్య సంకేతాలను ఇది తగ్గిస్తుంది. శరీరాన్ని డిహైడ్రేడ్ కాకుండా మందార పూల టీ కాపాడుతుంది. మందార పూల టీ ని తాగడం వల్ల మన శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బరువు కూడా తగ్గుతారు. ఇక మందార పూల టీని తయారు చేసే విధానానికి వచ్చినట్లయితే మందార పువ్వులను బాగా ఎండబెట్టి ఆ ఎండిన పూలను పక్కన పెట్టుకోవాలి. మందార పూల టీ తో బరువుకు చెక్ నీటిని బాగా మరగపెట్టి అందులో ఎండిన మందార పూలను వేసి మరిగించాలి. ఇక మందార పువ్వుల టీ ని తయారు చేయడానికి ఎండిన పువ్వులనైనా, తాజాగా ఉన్న పువ్వులనైనా వాడవచ్చు. ఈ పూల టీని తాగితే బరువు కూడా తగ్గుతారని ఎన్నో అధ్యాయాలు ఇప్పటికే వెల్లడించాయి. దీనిని ఒక హెర్బల్ టీ గా చెప్తారు. ఈ టీతో అధిక రక్తపోటు సమస్య తగ్గుతుంది. మందార పూల టీ తో డయాబెటిస్, బీపీ కంట్రోల్ మందార పూల టీతో శరీరంలో చెడు కొలెస్ట్రాల్ సమస్య తగ్గుతుంది.

మార్కెట్

బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపు!

న్యూఢిల్లీ : బీమా ప్రీమియం చెల్లింపుదారులకు త్వరలో ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీమా ప్రీమియం వసూళ్లపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించే విషయంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రస్థాయి లో కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంపై బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ సూచనలు చేయాలని జీఎస్టీ కౌన్సిల్ ఆదేశించినట్లు తెలుస్తున్నది. ఈ నిర్ణయానికి అనుగుణంగా వచ్చే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. మే, జూన్ నెలలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశంకాబో తున్నది. ప్రస్తుతం హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం వసూళ్లపై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిని తగ్గించాలనే ప్రతిపాదనపై గత కొన్నేండ్లుగా చర్చలు జరుగుతున్నప్పటికీ ఇంకా కొలిక్కిరాలేదు. ఈ సారి కొలిక్కిరానున్నట్లు, ఎంతమేర తగ్గించేదానిపై చర్చలు జరుగుతున్నాయని ప్రభుత్వవర్గాలు సూచనప్రా యంగా వెల్లడించాయి. ప్రీమి యం వసూళ్లపై జీఎస్టీని సున్నా లేదా 5 శాతం లేదా 12 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయి. కానీ, ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీమా రంగ ప్రతినిధులు కలుసుకొని 12 శాతం విధించాలని సూచించారంట. పలువురు రాష్ట్ర మంత్రులు కూడా 5 శాతం విధించాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఐఆర్‌డీఏఐ..బీమా రంగ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నది. త్వరలో జీఎస్టీ కౌన్సిల్‌కు ఒక నివేదికను సమర్పించనున్నది.

పశ్చిమాసియా సంక్షోభంతో
పెరుగుతున్న ముడి చమురు ధరలు..

భారత కంపెనీలపై ఒత్తిడి..!

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం భారత చమురు మార్కెట్‌తో పాటు గ్యాస్ కంపెనీలపై ఆర్థికంగా ఒత్తిడి పడే అవకాశం ఉన్నది. ఐసీఐసీఐ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం.. ముడి చమురు ధర ప్రస్తుతం బ్యారెల్‌కు 73 డాలర్ల నుంచి 74 డాలర్ల వరకు ఉన్నది. అయినప్పటికీ.. చమురు మార్కెట్ కంపెనీల (%ూవీజం%) ఆదాయంపై ప్రభావితమవుతున్నది. అదే సమయంలో అప్‌స్ట్రీమ్ కంపెనీల ఆదాయం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నది. అప్‌స్ట్రీమ్ కంపెనీలు చమురు, గ్యాస్ పరిశ్రమ ప్రారంభ భాగంలో పని చేస్తుంటాయి. భూమి నుంచి చమురు, గ్యాస్‌ను వెలికితీసే ప్రక్రియ. ఇది గ్యాస్ కంపెనీలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశాలున్నాయి. ఎల్ఎన్‌జీ ముడి చమురుకు సంబంధించింది. ముడి చమురు ధర పెరిగితే.. ఎల్ఎన్‌జీ ధర సైతం పెరుగుతుంది. చమురు ధరల్లో ఈ పెరుగుదల ఇప్పటికీ 2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పెరుగుదల కంటే తక్కువగా ఉందని పేర్కొంది. ప్రస్తుత పెరుగుదల గత నాలుగు సంవత్సరాల సగటు కంటే చాలా తక్కువగా ఉన్నది. ప్రస్తుతం, బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు దాదాపు 75 డాలర్లుగా ఉన్నది. ఇది 2026 ఆర్థిక సంవత్సరానికి విశ్లేషకుల అంచనా 68 డాలర్ల కంటే కంటే దాదాపు 6-7 డాలర్లు ఎక్కువ. అయినప్పటికీ, ముడి చమురు ధరలు 2022-25 సగటు కంటే 9డాలర్లు తక్కువగా.. 25 ఆర్థిక సంవత్సరం సగటు కంటే 4డాలర్లు తక్కువగా ఉన్నది. డిమాండ్ లేకపోవడం మార్కెట్‌ను ఆధిపత్యం చేస్తుంది.అయితే, ఇంధన కంపెనీ స్టాక్స్ హెచ్చుతగ్గులను చూస్తున్నాయి. ఇది ప్రపంచ అనిశ్చితుల మధ్య మార్కెట్ ఆందోళనలను ప్రతిబింబిస్తున్నది. దీని వెనుక కారణం హోర్ముజ్ జలసంధిలో తీవ్రమవుతున్న సంక్షోభం కారణం. హోర్ముజ్ జలసంధి ప్రపంచంలోని కీలకమైన సముద్ర మార్గాల్లో ఒకటి. ఎందుకంటే ఇది పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్‌ను కలుపుతుంది. ప్రపంచంలోని చమురు రవాణాలో ఎక్కువ భాగం ఈ మార్గం గుండా వెళుతుంది. భారతదేశం చమురు దిగుమతుల్లో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ, ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో సగానికిపైగా హోర్ముజ్ జలసంధి గుండా వెళతాయి. ఈ మార్గంలో ఏదైనా ఆటంకాలు ఎదురైతే.. భారతదేశం ఇతర వనరులు, మార్గాల కోసం వెతకాల్సిన అవసరం ఏర్పడుతుంది.

ప్రధాని మోడీ ఓ నిజమైన కర్మయోగి

దేశం తలెత్తుకునేలా పాలన చేస్తున్న మోడీ

కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్లు ఉండాలి

కర్నూలు సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

కర్నూలు : దేశ సేవే పరమావధిగా ప్రజలకు సేవ చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ని ఓ నిజమైన కర్మయోగిగా చూస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివర్ణించారు. ధర్మాన్ని పాటిస్తూ కర్మను పాటించే నాయకుడు మోదీ అని ప్రశంసించారు. కర్నూలు జిల్లాలోని నన్నూరులో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్' బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. మోదీ దేశాన్ని మాత్రమే కాదని.. రెండు తరాలను నడుపుతున్నారని కొనియాడారు. దేశం తలెత్తి చూసే విధంగా ఆత్మనిర్భర్ భారత్‌ని మోదీ తీసుకువచ్చారని కీర్తించారు. కూటమి 15 ఏళ్లకు తక్కువ కాకుండా బలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా తట్టుకుని మనం నిలబడాలని సూచించారు. మోదీ కేవలం ప్రభుత్వాన్ని మాత్రమే కొనసాగించడం లేదని.. రెండు, మూడు తరాల ప్రజలకు దిశా నిర్దేశర చేస్తున్నారని కొనియాడారు పవన్ కల్యాణ్. ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా ప్రపంచ పటంలో దేశాన్ని నిలబెడుతున్నారని ప్రశంసించారు. గూగుల్ లాంటి అతిపెద్ద ప్రాజెక్టులు దేశానికి ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కి వచ్చాయని ఉద్ఘాటించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేదలు, సామాన్యులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతోందని తెలిపారు. జీవిత, ఆరోగ్య బీమాతో సహా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గటంతో ప్రజలు ఆదా చేసుకోగలుగుతారని వివరించారు. కూటమి ప్రభుత్వం కనీసం 15 ఏళ్ల పాటు అధికారంలో ఉండాలని ఆకాంక్షించారు. పెట్టుబడులు పరిశ్రమల నమ్మకాన్ని సడలించకుండా అంతా కలిసి ఉండి స్థిరమైన ప్రభుత్వాన్ని కొనసాగిస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీని కర్మయోగిగా చూస్తాం.. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్నారు కాబట్టే మోడీని కర్మయోగి అంటాం అని పేర్కొన్నారు. ఇక ఇక, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం 15 ఏళ్లు ఉండాలని ఆకాక్షించారు పవన్ కల్యాణ్.. దీని కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తట్టుకొని నిలబడతాం అన్నారు.. ఇబ్బందులు ఉన్నా.. ఏమున్నా తట్టుకుని నిలబడాలని సూచించిన ఆయన.. ఒక తరం కోసం ఆలోచించే నాయకులు సీఎం చంద్రబాబు అని.. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయకత్వంలో అందరం సమష్టిగా పనిచేస్తాం.. వచ్చే తరం ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్తాం అని స్పష్టం చేశారు పవన్ కల్యాణ్.. మరోవైపు, ప్రధాని మోడీ దేశాన్ని మాత్రమే కాదు.. రెండు తరాలను నడుపు తున్నారు.. దేశం తలెత్తి చూసే విధంగా ఆత్మనిర్భర్ భారత్ తీసుకువచ్చారని ప్రశంసించారు.. దేశ జెండా ఎంత పౌరుషంగా ఉంటుందో.. అలాగే దేశ పటాన్ని ప్రపంచపటంలో నిలబెట్టారని పేర్కొన్నారు.

కల్తీ మద్యం కేసులో ప్రభుత్వం సీరియస్

జగన్ నేరస్థులను ప్రోత్సహించడంతోనే ఈ కేసు

మండిపడ్డ టిడిపి నేత బుద్దా వెంకన్న

విజయవాడ : నకిలీ మద్యంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ సాగుతోందని టీడీపీ నేత బుద్దా వెంకన్న అన్నారు. నకిలీ మద్యం కేసులో ఉన్నవారిని ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జోగి జోగి కలిస్తే బూడిద రాలినట్లు జగన్, జోగి రమేష్ కలిస్తే బూడిద రాలుతుందని తేలి పోయిందని వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లల్లో జగన్ అవినీతిని, హత్యలు చేసిన వారిని ప్రోత్సహించారని.. అదే చంద్రబాబు అయితే వెంటనే వారిపై చర్యలు తీసుకున్నారని అన్నారు. జోగి రమేష్ కీలక పాత్ర ఉందని జనార్ధన్ స్వయంగా ప్రకటించారని.. తప్పు చేసి దొరికిపోయి కూడా జోగి రమేష్ సిగ్గు లేకుండా వాగుతున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యంతో సంబంధం లేని చంద్రబాబు ఎందుకు ప్రమాణం చేయాలని ప్రశ్నించారు. 'జోగి రమేష్, జనార్ధన్ స్నేహితులం అని చెప్పలేదా. మీ ఇద్దరి మధ్య వాట్సప్ చాటింగ్, ఫేస్ టైమ్ కాల్స్ మాట్లాడింది వాస్తవం కాదా, నువ్వు ఏ తప్పు చేయకపోతే సిట్ ముందుకు వెళ్లు. నీ దగ్గర ఉన్న ఆధారాలు ఇచ్చి సచ్చీలత నిరూపించుకో' అంటూ సవాల్ విసిరారు. జగన్ అవినీతి గురించి లోకమంతా తెలుసన్నారు. ఆయన మద్యం కుంభకోణం వల్ల 12 మంది జైలుకు వెళ్లారని.. ఇప్పుడు నకిలీ మద్యం విషయంలో జోగి రమేష్ అడ్డంగా దొరికిపోయారని అన్నారు. ఇంత జరుగుతున్నా జగన్ నిద్ర పోతున్నాడా... జోగి రమేష్‌ను ఎందుకు సస్పెండ్ చేయలేదని నిలదీశారు. కొడాలి నానీ, పేర్ని నాని, దేవినేని అవినాష్, వెల్లంపల్లి, వల్లభనేని వంశీ వీరంతా గత ప్రభుత్వంలో నోటికొచ్చినట్లు వాగారని.. మహిళలని కూడా చూడకుండా దూషించారని బుద్దా వెంకన్న మండిపడ్డారు.

కర్నూలు చేరుకున్న ప్రధాని మోడీ

ఓర్వకల్లు విమానాశ్రయంలో ఘనస్వాగతం

కర్నూలు : ఒకరోజు పర్యటన కోసం ప్రధాని నరేంద్ర మోదీ గురువారం కర్నూలులోని ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా బరువు బాగా తగ్గిపోయావంటూ మంత్రి నారా లోకేశ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ సరదా వ్యాఖ్యలు చేశారు. లోకేశ్‌తో మోదీ మాట్లాడుతూ గతసారి చూసినప్పటికంటే ఇప్పుడు చాలా బరువు తగ్గావు. త్వరలోనే మీ నాన్నలా తయారవుతావని వ్యాఖ్యానించారు. ఇక్కడి నుంచి మోదీ హెలికాప్టర్‌లో సున్నిపెంట చేరుకున్నారు. హెలికాప్టర్‌లో మోడీ వెంట సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెళ్లారు. రోడ్డుమార్గంలో శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లారు. మధ్యాహ్నం శ్రీశైల మల్లన్న క్షేత్రంలో దర్శించుకున్నారు. అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నన్నూరుకు చరుకున్నారు. రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' బహిరంగ సభకు హాజరయ్యారు.

కర్నూలు సభకు భారీగా జనం రాక

జనం కోసం ప్రత్యేకంగా ఆహారపు పొట్లాల పంపిణీ

కర్నూలు : ప్రధాని మోదీ సభ సందర్భంగా కర్నూలుకు భారీగా ప్రజలు తరలివచ్చారు. కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు ఇప్పటికే ఆయా ప్రాంతాల నుంచి బయల్దేరారు. సభకు వచ్చే ప్రజల కోసం ఆహార ఏర్పాట్లు చేశారు. కర్నూలులోని పలు ప్రాంతాల్లో ఆహార పొట్లాలను సిద్ధం చేసారు. నంద్యాల-కర్నూలు రోడ్డులో ఆహార ఏర్పాట్లను మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఫుడ్‌స్టాల్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల వంటకాలు, ఆహార పదార్థాల నాణ్యతను ఆయన పరిశీలించారు. సభకు వచ్చే సామాన్య ప్రజలు, కూటమి నేతలు, కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు మంత్రి సూచించారు.

ఇంద్రకీలాద్రిపై దీపావళి శోభ

19న ధనత్రయోదశిన శ్రీమహాలక్ష్మీయాగం

నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన ఇవో

విజయవాడ, : విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వం స్వామి వార్ల దేవస్థానం దీపావళి శోభను సంతరించుకుంది. ఈ నెల 19వ తేదీన ధన త్రయోదశి సందర్భంగా శ్రీ మహాలక్ష్మి యాగం, 20వ తేదీన దీపావళి సందర్భంగా శ్రీ ధనలక్ష్మి పూజ, దీపాలంకరణ, బాణాసంచా వెలిగించడం అనంతరం రాత్రి 7 గంటల నుంచి అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలన్నీ కవాట బంధనం చేస్తున్నట్లు ఇవో వివరించారు. కార్తీక మాసం సందర్భంగా ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు జరుగుతున్నట్లు వెల్లడించారు.ఈ నెల 23వ తేదీన గాజుల అలంకారంలో దర్శనమివ్వనున్నారు దుర్గమ్మ. ఈ నేపథ్యంలో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ మీడియాతో మాట్లాడారు. నూతన క్యాలెండర్‌ని ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భవానీ దీక్షా విరమణల షెడ్యూల్ విడుదల చేశారు. నవంబర్ 1వ తేదీ నుంచి దుర్గమ్మ మండల దీక్షాధారణలు ప్రారంభం అవుతాయని తెలిపారు. నవంబర్ 21వ తేదీ నుంచి దుర్గమ్మ అర్థమండల దీక్షా ధారణలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. డిసెంబర్ 4న కలశజ్యోతి ఉత్సవం, డిసెంబర్11 నుంచి 15వ తేదీ వరకు భవానీ దీక్షల విరమణలు ఉంటాయని వివరించారు. ఐదురోజుల పాటు భవానీ దీక్షా విరమణలు జరుగనున్నాయని చెప్పుకొచ్చారు. డిసెంబర్ 15వ తేదీన ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతి, భవానీ దీక్ష విరమణలు ముగింపు ఉంటుందని తెలిపారు. భవానీ దీక్షా విరమణల సందర్భంగా డిసెంబరు 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దేవస్థానంలో జరిగే అన్ని ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ పేర్కొన్నారు.

నిమిషప్రియ కేసులో స్టే కొనసాగుతోంది

మరణశిక్ష అమలుపై సుప్రీంకు కేంద్రం వివరణ

న్యూఢిల్లీ : యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారత నర్సు నిమిష ప్రియకు శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని గురువారం సుప్రీంకోర్టుకు కేంద్రప్రభుత్వం వెల్లడించింది. తీవ్రమైన పరిణామాలు ఏమీ జరగలేదని తెలిపింది. ఈ భారతీయ నర్సును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్యమార్గాలను ఉపయోగించేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. తాజాగా ఆ మరణశిక్ష గురించి ప్రశ్నించింది. ఆమెకు చట్టపరమైన సహకారం అందిస్తోన్న 'సేవ్ నిమిషప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరఫు న్యాయవాది స్పందిస్తూ.. శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వెంకటరమణి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ కేసులోకి కొత్త మధ్యవర్తి వచ్చారు. ఇప్పటివరకు మంచి విషయం ఏంటంటే.. తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకోకపోవడమేనని వెల్లడించారు. ఈ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం కేసును జనవరికి వాయిదా వేసింది. అయితే ఏవైనా అత్యవసర పరిస్థితులు ఉంటే.. ముందస్తు లిస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. నిమిష ప్రియ నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి తలాల్ అదిబ్ మెహది భాగస్వామ్యంతో అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. తర్వాత ఆ వ్యక్తి ప్రియను వేధించి, పాస్‌పోర్ట్, ఇతర పత్రాలను లాక్కొన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. 2016లో అతడిపై ప్రియ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. కానీ, వారు ఆమెను పట్టించుకోలేదు. దీంతో 2017లో మెహదికి మత్తుమందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని భావించింది. కానీ, ఆ డోస్ ఎక్కువకావడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పారేసింది. చివరికి అక్కడినుంచి సౌదీకి వెళ్లిపోతుండగా.. సరిహద్దుల్లో ఆమెను అరెస్టు చేసి, మరణశిక్ష విధించారు. భారత ప్రభుత్వం, మత పెద్దల ప్రయత్నాలతో ప్రస్తుతానికి ఆ శిక్ష అమలు వాయిదాపడింది.

రోగులకు భరోసా కల్పించండి: ఎమ్మెల్యే

చేవెళ్ల : రోగులతో ఆప్యాయంగా మాట్లాడి వైద్యం చేయాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వైద్యులకు సూచించారు. చికిత్సకు వచ్చిన వారికి భరోసా కల్పించాలని అన్నారు. వారికి మనోధైర్యం ముఖ్యమని అన్నారు. గురువారం ఆయన తాండూరు జిల్లా ఆసుపత్రి, నర్సింగ్ విద్యార్థుల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులన్నీ తిరిగి రోగులతో మాట్లాడారు. వైద్యులు సమయపాలన పాటించాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఎదుర్కొంటున్న నీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ బాగాలేదని వైద్య సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యల పరిష్కారానికి పక్షం రోజుల్లోగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ పర్యవేక్షణలో వినయ్ కుమార్, ఆర్ఎంవో ఆనంద్ గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

తిరుగలేని శక్తిగా భారత్ అభివృద్ధి

దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చిన ఘనత

మోడీపై ప్రశంసలు కురిపించిన మంత్రి లోకేశ్

కర్నూలు : ప్రధాని మోదీ భారత్‌ను తిరుగులేని శక్తిగా మారుస్తున్నారని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. కర్నూలు శివారులోని నన్నూరు వద్ద 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగసభలో లోకేశ్ ప్రసంగించారు. పలు సినిమాల్లోని డైలాగులు చెబుతూ ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. 'పహల్గాం దాడి తర్వాత 'నమో' దెబ్బకు పాకిస్థాన్ దిమ్మతిరిగింది. అమెరికా సుంకాలు పెంచితే పెద్ద దేశాలే వణికిపోయాయి. కానీ, నమో స్టైలే వేరు. పేద, మధ్యతరగతి ప్రజలపై జీఎస్టీ భారం తగ్గించారు. దసరా-దీపావళి కలిసి వస్తే ఎలా ఉంటుంది. అలాంటి పండగను దేశ ప్రజలకు అందించారని లోకేశ్ తెలిపారు. బ్రిటీష్ వారిని గడగడలాడించిన ఉయ్యాలవాడ పుట్టిన నేల అని.. కర్నూలు ప్రజల రాజసం కొండారెడ్డి బురుజు అని చెప్పుకొచ్చారు. మన నమో అంటే విక్టరీ.. ఆయన ఏ కార్యక్రమం చేపట్టినా విజయమే అని అన్నారు. గుజరాత్ సీఎంగా.. దేశ ప్రధానిగా 25 ఏళ్లు పూర్తి చేస్తుకున్నారని తెలిపారు. దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చిన ఘనత మోదీది అంటూ మంత్రి కొనియాడారు. మోదీ కొట్టిన దెబ్బకు పాక్ దిమ్మ తిరిగిందన్నారు. ట్రాంప్ టారిఫ్స్‌తో పలు దేశాలు వణికినా మోదీ బెదరలేదని అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు సూపర్ సేవింగ్ అయ్యిందన్నారు. పేద ప్రజల చిరునవ్వే మోదీకి పండుగన్నారు. దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చిన ఘనత మోదీదే అని వెల్లడించారు. జీఎస్టీ తగ్గింపుతో రూ.8వేల కోట్ల ఆదాయం కోల్పోతామని చెప్పినా.. పేదలకు మంచి జరుగుతుందని సీఎం అన్నారని తెలిపారు. డబుల్ ఇంజన్ బు÷-లలెట్ ట్రైన్ సర్కార్ కేంద్రంలో, రాష్ట్రంలో ఉందన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులు, రైల్వే, హైవే ప్రాజెక్టులు ఏపీకి వచ్చాయని చెప్పారు. భారత్ 4వ ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి కారణం ప్రధాని మోదీనే అని అంటూ ప్రధానిపై మంత్రి లోకేష్ ప్రశంసల వర్షం కురిపించారు. కాగా.. జిల్లాలో ప్రధాన ప్రధాన మంత్రి నరేంద్ర పర్యటన కొనసాగుతోంది. శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శనం అనంతరం నన్నూరులో 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్' బహిరంగసభలో పాల్గొన్నారు ప్రధాని. ఈ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి శివుడి జ్ఞాపికను బహుకరించారు సీఎం. ఆపై మోదీని సీఎం, డిప్యూటీ సీఎం శాలువతో సత్కరించారు. అలాగే ప్రధానికి ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ ఆంజనేయస్వామి జ్ఞాపిక అందజేశారు.

కర్నూలు జిల్లాలో ప్రధాని మోడీ పర్యటన

ముందస్తుగా లెఫ్ట్ నేతలు పలువురి గృహనిర్బంధం

విద్యార్థి సుగాలి ప్రీతి తల్లికి తప్పని నిర్బంధం

కర్నూలు, : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జిల్లాలో పర్యస్తున్న నేపథ్యంలో పోలీసులు వామపక్ష నాయకుల పై ప్రజాసంఘాల నాయకులపై నిర్బంధాన్ని ప్రయోగించారు. గురువారం తెల్లవారుజామునే 4:30 గంటలకే వామపక్ష నాయకుల ఇళ్లను పోలీసులు ముట్టడించి గృహనిర్బంధం చేశారు. ఈ మేరకు సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి డి గౌసుదేశాయిని వన్ టౌన్ లోని ఆయన నివాస గృహ ప్రాంగణంలో నిర్బంధించారు. సిపిఐ జిల్లా నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సిపిఎం ఓల్డ్ టౌన్ నగర కార్యదర్శి ఎం రాజశేఖర్, జిల్లా నాయకులు అలివేలు, సిఐటియు నాయకులు ప్రభాకర్ సాయిబాబా, షరీఫ్, కాజా, సిపిఐ నగర సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సోమన్న, దళిత విద్యార్థి సంఘాల నాయకులు మాల వెంకటేష్, ఓబులేసులను అరెస్టు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ జిల్లా పర్యటనను నిరసిస్తూ గో బ్యాక్ మోడీ అంటూ సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని సిపిఐ నాయకులు కార్యకర్తలు చేపట్టారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు నిరసనకారులను దౌర్జన్యంగా అరెస్టు చేసి మూడో పట్టణం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిపిఐ కార్యకర్తలు స్టేషన్‌కు చేరుకొని అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని బైఠాయించి నినాదాలు చేశారు. ఇకపోతే విద్యార్థిని సుగాలి ప్రీతి అనుమానాస్పద మతి కేసులో న్యాయం చేయాలంటూ పోరాడుతున్న ఆమె తల్లి సుగాలి పార్వతిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సుగాలి పార్వతి ప్రధానిని కలుసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించాలని భావించారు. అయితే పలు భద్రతా కారణాలు చూపుతూ, ఆమెను ముందస్తుగా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆమెతో పాటు సుగాలి ప్రీతి కుటుంబ సభ్యులందరినీ పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు.

రైల్లో ప్రయాణికురాలిపై అత్యాచారం

దుండగుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

గుంటూరు, : రైల్లో ప్రయాణికురాలిపై అత్యాచారం చేసిన నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం గుంటూరు స్టేషన్‌కు చేరుకున్న సంత్రగాచి స్పెషల్ రైలులోని మహిళా బోగీలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ కెమెరాల సాయంతో నిందితుడిని గుర్తించారు. తెనాలి స్టేషన్‌లో గుంటూరు రైల్వే పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. ఓ మహిళ సోమవారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో సంత్రగాచి స్పెషల్ రైలు మహిళా బోగీలో ఎక్కారు. గుంటూరు వచ్చేసరికి ఆ భోగిలో ప్రయాణికులు ఎవరూ లేరు. ఆమె మాత్రమే మిగిలారు. రన్నింగ్ ట్రైన్‌లో మహిళ భోగికి ప్రవేశించాడు. కొద్దిసేపటికే తలుపు మూసివేసి ఆమెను కత్తితో బెదిరించాడు. ఆమె వద్ద ఉన్న రూ.5,600, సెల్‌ఫోన్, హ్యాండ్‌బ్యాగును లాక్కొని దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. పెదకూరపాడులో ఫలకనామ ఎక్స్‌ప్రెస్ క్రాసింగ్ కోసం రైలును నిలిపివేశారు. అదే అదునుగా పెదకూరపాడు రైల్వే స్టేషన్ దిగి పారిపోయాడు. మంగళవారం రైలు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకున్న అనంతరం బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నడికుడి జీఆర్పీ పోలీసులకు బదిలీ చేశారు దీంతో రంగంలోకి దగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడుని పట్టుకున్నారు.

ప్రధాని పర్యటనపై అసత్య ప్రచారాలు

వైకాపా తీరుపై కేంద్ర ఇంటిలిజెన్స్ ఆరా

అమరావతి,: ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనను సైతం వైకాపా అసత్య ప్రచారానికి వాడుకోవడంపై కేంద్ర ఇంటెలిజెన్స్ ఆరా తీసినట్టు సమాచారం. ప్రధాని రాష్ట్ర పర్యటన సందర్భంగా కర్నూలు విమానాశ్రయం వద్ద స్వాగతం పలకడం, వీడ్కోలు పలికే సందర్భాల్లో ప్రొటోకాల్ ప్రకారం వైకాపా ప్రజాప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీన్ని రాజకీయం చేసి వైకాపా విమర్శల పాలయ్యింది. ప్రధాని మోదీకి వైకాపా ప్రజాప్రతినిధులు ఎలాంటి వినతిపత్రం ఇవ్వకపోయినా.. మెడికల్ కాలేజీలు, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చాలని వినతి పత్రం ఇచ్చి ప్రధానిని కోరినట్టు అసత్య ప్రచారానికి ఆ పార్టీ అనుబంధ మీడియాల్లో అసత్య ప్రచారం చేశారు. ప్రధానికి ఆహ్వానం పలికిన సందర్భాన్ని సైతం ఫేక్ ప్రచారానికి వాడుకోవడాన్ని కేంద్ర వర్గాలు తప్పుబట్టినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రధాని రాష్ట్ర పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ ప్రకారం ప్రతిపక్ష పార్టీని వైకాపా ఆహ్వానించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం వైకాపా ప్రజా ప్రతినిధులను సైతం ఆహ్వానించి తగు గౌరవం ఇస్తోంది. ఇచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకోకుండా..వైకాపా నేతలు అసత్య ప్రచారానికి తెరలేపడంపై కూటమి నేతలు మండిపడుతున్నారు.

అన్నదమ్ముల వివాదం

తమ్ముడి దాడితో వదిన మృతి

వరంగల్, : జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అన్నపై తమ్ముడు దాడి చేయగా.. అడ్డొచ్చిన వదిన తీవ్రగాయాలతో మృతిచెందారు. నల్లబెల్లి మండలం కొండాపురంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అన్న మేరుగుర్తి రమేశ్‌పై తమ్ముడు సురేశ్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో వదిన స్వరూప (30) అడ్డు వచ్చింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్స్‌లో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో స్వరూప మృతిచెందారు. గాయాలతో ఆస్పత్రిలో రమేశ్ చికిత్స పొందుతున్నాడు. అన్నదమ్ముల మధ్య డబ్బు వివాదమే ఈ ఘటనకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు.

ధీ మంచి టాలెంటెడ్ సింగర్

చిన్మయి పాజిటివ్ కితాబు

స్టార్ సింగర్ చిన్మయి మీద కోలీవుడ్‌లో కొన్నేళ్ల నుంచి సింగింగ్ అవకాశాలు, డబ్బింగ్ ఆఫర్లు ఇవ్వొద్దని అక్కడ బ్యాన్ ఉంది. అయినా కూడా కొంత మంది మేకర్లు మాత్రం ఆమెతో పని చేస్తూనే ఉన్నారు. మరీ ముఖ్యంగా తెలుగులో అయితే ఆమెకు ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. ఇక తాజాగా 'థగ్ లైఫ్' చిత్రంలోనూ చిన్మయి పాట పాడింది. ఆ పాటను తమిళంలో సింగర్ ధీ ఆలపించగా. తెలుగు, హిందీలో మాత్రం చిన్మయి పాడారు. అయితే థగ్ లైఫ్ ఆడియో లాంచ్ ఈవెంట్‌లో, సింగర్ ధీ అందుబాటులో లేక పోవడంతో ఆ పాటను తమిళ్ లో చిన్మయి పాడారు. ఆ పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో ఇంత మంచి వాయిస్‌ని ఇన్ని రోజులు ఎలా మిస్ అయ్యారు.. ఆమె మీదున్న బ్యాన్‌ను తీసేయండని నెటిజన్లు కామెంట్లు- చేస్తూ వచ్చారు.. అయితే తాజాగా దీని మీద చిన్మయి స్పందించింది.. 'సింగర్ ధీ అందుబాటులో లేకపోవడంతో నేను ఆ పాట పడాల్సి వచ్చింది. ఇంత రెస్పాన్స్ వస్తుందని అనుకోలేదు. కానీ నేను ఈ పాట పాడటం వల్ల మా ఇద్దరి మధ్య రెజ్లింగ్ అన్నట్టుగా పోటీ- పెట్టి చూస్తున్నారు, అలా పోల్చాల్సిన అవసరం లేదు. ఇది ఎంత మాత్రం పోటీ- కాదు. ఎందుకంటే సింగర్ ధీకి చాలా ప్రత్యేకమైన వాయిస్. ఆమెను ఎవ్వరూ ఇమిటేట్ చేయలేరు. ఆమె చాలా టాలెంటె-డ్. వయస్సులో కూడా చాలా చిన్నది. ముమ్ముందు ఫ్యూచర్‌లో వంద మంది చిన్మయిల్ని, శ్రేయా ఘోషాల్ని బీట్ చేస్తుంది' అంటూ పొగిడేసింది చిన్మయి. ప్రజంట్ ఈ మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

కమల్ క్షమాపణలు చెప్పేవరకు థగ్‌లైఫ్ ఆపాల్సిందే

కర్ణాటక ఫిలిం బాడీ హెచ్చరికలు

కమల్ హాసన్ తన కొత్త సినిమా థగ్ లైఫ్ కర్ణాటకలో విడుదల కష్టంగానే ఉంది. ఆయన క్షమాపణ చెబితే తప్ప విడుదలకు అంగీకరించమని అక్కడి సినీ వర్గాలు హెచ్చరించాయి. కన్నడ తమిళం నుంచి పుట్టిందని కామెంట్స్ చేయడం వివాదానికి కారణమైంది. కర్ణాటకలోని ప్రజలు, పలు సంఘాలు కమల్ హాసన్ తీరును తప్పుపట్టాయి. ఆయన సినిమా విడుదలకు అనుమతించబోమని హెచ్చరించాయి. కమల్ హాసన్ తన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పకుంటే, ఆయన సినిమా థగ్ లైఫ్‌ని రాష్ట్రంలో విడుదలకు అనుమతించ బోమని కర్ణాటక ఫిలిం బాడీ హెచ్చరించింది. ఆయన క్షమాపణ చెప్పకపోతే, థగ్ లైఫ్ కర్ణాటకను నడవదు. ఇది ఇండస్ట్రీ గురించి కాదు, ఇది రాష్ట్రం గురించి. రాజకీయ పార్టీలు కూడా వ్యతిరేకిస్తున్నాయి, కన్నడ అనుకూల సంస్థలు ఆయన స్పందించాల్సిందేనని స్పష్టం చేస్తున్నాయి. ఆయన క్షమాపణ లేకుండా సినిమా విడుదల కష్టం. మా ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ కమల్ హాసన్ సినిమాను ప్రదర్శించేందుకు సిద్ధంగా లేరు. ఈ సినిమా ఇక్కడ ఎలా విడుదల అవుతుందని కర్ణాటక ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఎం. నరసింహలు అన్నారు.కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు కన్నడ నాట తీవ్ర వివాదంగా మారాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు- బీజేపీ నేతలు కూడా కమల్ హాసన్ తీరును తప్పుపడుతున్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ.. కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉందని, అది కమల్ హాసన్‌కి తెలియదని అన్నారు. బీజేపీ స్టేట్ చీఫ్ బీవై విజయేంద్ర క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.మరోవైపు, తనకు క్షమాపణ చెప్పే ఆలోచన లేదని కమల్ హాసన్ స్పష్టం చేశారు. తాను తప్పు చేశానని అనుకుంటేనే క్షమాపణలు చెబుతానని చెప్పారు.

ఖరీదైన వస్తువులకు నేను దూరం : మృణాల్

మనకు తెలిసి సెలబ్రిటీల లైఫ్ అంటే లగ్జరీ గుర్తుకు వస్తుంది. వారు మాములుగా చిన్న చిన్న బ్రాండ్స్ వాడారు. అన్ని బ్రాండెడ్ వస్తువులనే ఎక్కువగా వాడుతుంటారు. కాస్ట్లీ వాచ్‌లు, కారులు, బట్టలు ఇలా ప్రతి ఒక్కటి లక్షలోనే ఉంటాయి. ఆ మధ్య త్రిష ఈవెంట్లకు రెండు లక్షల డ్రెస్ వేసుకొచ్చింది. అయితే మృణాల్ మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటు ఒదట.. 'సీతారామం' సినిమా ద్వారా పరిచయమైన ఈ హీరోయిన్ ఆ తర్వాత 'హాయ్ నాన్న' చిత్రంతో మంచి విజయం అందుకుంది. ప్రస్తుతం పాత్రలకు ప్రాధాన్యత ఉన్న చిత్రాలు ఎంచుకుంటూ దూసుకు పోతుంది. అయితే..తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకి డ్రస్సుల పైన ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టడం ఇష్టం ఉండదని.. ఇప్పటి వరకు కొన్ని నా ఖరీదైన డ్రెస్ కేవలం 2000 అని చెప్పుకొచ్చింది. ఇద్దంతా నమ్మశక్యంగా లేదు కదా.. ఎందుకంటే ఈ మధ్య కాలంలో నార్మల్ పీపులే వేలకు వేల డ్రెస్‌లు వేసుకుంటున్నారు. ఒక స్టార్ హీరోయిన్ అయి ఉండి ఇలా మాట్లాడటం చూసి.. 'ఈ హీరోయిన్ ఇంత పొదుపరిలా ఉంది' అని కామెంట్ లో పెడుతున్నారు అభిమానులు. కొంతమంది మాత్రం మృణాల్ చెప్పింది నిజమే అని.. తను డబ్బు విలువ తెలిసి ప్రవర్తిస్తుందని అభినందిస్తున్నారు.



వీరమల్లు ట్రైలర్ కోసం ఆత్రుత

పవన్ కల్యాణ్ హరిహర వీరమల్లు కోసం ఫ్యాన్స్ ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. అనేక వాయిదాల తర్వాత జూన్ 12న మూవీ రిలీజ్ చేస్తున్నారు. కానీ ఇంకా ప్రమోషన్లు స్టార్ట్ చేయలేదు. ట్రైలర్ విడుదల కోసం ఫ్యాన్స్ నుంచి ఒత్తిడి వస్తోంది. ఇంకా పది రోజులే ఉంది.. ఇంకెప్పుడు రిలీజ్ చేస్తారంటూ ఫ్యాన్స్ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత ఏఎం రత్నం ట్రైలర్ రిలీజ్ డేట్ మీద క్లారిటీ- ఇచ్చారు. ఫ్యాన్స్ ఆవేదన నాకు తెలుసు. వారు ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. కానీ సెకండ్ హాఫ్ లో సీజీ వర్క్ చాలా పెండింగ్ ఉంది. ఆ పనులు స్పీడ్ గా సాగుతున్నాయి. అతి త్వరలోనే వాటిని కంప్లీట్ చేసి రిలీజ్ చేస్తాం అన్నారు ఆ పనులన్నింటినీ దృష్టిలో పెట్టుకునే సినిమా రిలీజ్ డేట్ ను ప్రకటించాం. పోస్ట్ ప్రొడక్షన్ పనులకు టైమ్ పడుతుంది' అంటూ నిర్మాత చెప్పారు. చూస్తుంటే రెండు మూడు రోజుల్లో ట్రైలర్ రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నాయి. పవన్ కల్యాణ్ కూడా ప్రమోషన్లలో పాల్గొనేందుకు డేట్స్ కేటాయించాడంట. రెండు కీలక ఇంటర్వ్యూలు, మూడు భారీ ఈవెంట్లు ప్లాన్ చేస్తున్నట్టు- తెలుస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ సినిమా కోసం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఈవెంట్లు ప్లాన్ చేస్తున్నారని టాక్.

మీ నెగెటివ్ ప్రచారం నా సినిమాను ఆపలేవు

నా అభిమానులంతా నా వెంటే ఉన్నారు

నటుడు ధనుష్ ఆవేశ పూరతి స్పీచ్

కుబేర'తో బాక్సాఫీసు వద్ద సందడి చేసేందుకు సిద్ధమయ్యారు నటుడు ధనుష్ . ఆయన, నాగార్జున కలిసి నటించిన చిత్రం 'కుబేర'. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని శేఖర్ కమ్ముల తెరకెక్కించారు. రష్మిక కథానాయికగా నటించారు. ఇది జూన్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా తాజాగా చెన్నైలో ఆడియో లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఇందులో ధనుష్ పవర్‌ఫుల్ స్పీచ్‌తో అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు. నేనెప్పుడు నా బెస్ట్ ఇవ్వడానికే ప్రయత్నం చేస్తుంటాను. నాపై, నా సినిమాలపై ఎంత నెగెటివ్ ప్రచారం చేస్తారో చేసుకోండి. నా సినిమాల విడుదలకు ముందు నెలకు రెండుసార్లు ఏదోఒక విషయంలో కుట్రలు చేస్తూనే ఉంటారు. అయినా మీరేం చేయలేరు. ఎందుకంటే నా అభిమానులు ఎప్పుడూ నాతో ఉన్నారు. ఇలాంటి సర్కస్‌లు మానుకోండి. ఇక్కడ ఉన్నవారంతా నా అభిమానులు మాత్రమే కాదు.. వీరంతా 23 సంవత్సరాలుగా నా వెంటే ఉంటు-న్నారు. మీరెంత నెగెటివి ప్రచారం చేసినా వీరంతా ఎప్పటికీ నాతోనే ఉంటారని ధనుష్ పవర్‌ఫుల్ స్పీచ్‌తో అదరగొట్టారు. ఇక అభిమానులను ఉద్దేశిస్తూ సంతోషం ఎప్పుడూ మనలోనే ఉంటుందని దాన్ని బయట వెతుక్కోవద్దని సూచించారు. ఆనందంగా జీవించాలని మనం బలంగా కోరుకోవాలి. అది మనలోనే.. మనతోనే ఉంటుంది. నా వరకూ నేను మంచి భోజనం చేసి సంతోషిస్తాను. అదే నాకు ఆనందం. మన సంతోషానికి మించింది ఏమీ ఉండదని తెలిపారు. ఇక ఇదే ఈవెంట్‌లో దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ.. ధనుష్ నటనపై ప్రశంసలు కురిపించారు. 'కుబేర'లో ఈ పాత్ర ధనుష్ కాకుండా మరెవ్వరూ చేయలేరన్నారు. అద్భుతంగా నటించారని.. నేషనల్ అవార్డు కచ్చితంగా వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అలాగే ధనుష్ దర్శకత్వంలో నటించాలనుందని నాగార్జున అన్నారు. అతను గొప్ప నటు-డని ప్రశంసించారు. ఇంత గొప్ప చిత్రంలో భాగమైనందుకు ఎంతో గర్వంగా ఉందని రష్మిక తెలిపారు. ఈ కథ తనకెంతో నచ్చిందన్నారు.

కాలానుగుణంగా నటులు మారాల్సిందే

నటి విద్యాబాలన్ అభిప్రాయం

బాలీవుడ్ నటి విద్యా బాలన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 22 సంవత్సరాలు అయినా.. ఇప్పటికీ తనదైన అభినయంతో వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకుల మనసులను గెలుచుకుంటూ వస్తున్నది. హిందీతో పాటు- బెంగాలీ, మలయాళం, తమిళ భాషల్లోనూ తన ప్రతిభను చాటిన ఆమె.. 2019లో తెలుగు సినీరంగంలోకి 'ఎన్టీఆర్: కథానాయకుడు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ప్రస్తుతం సుధీర్ బాబు హీరోగా తెరకెక్కుతున్న 'జటాధర' అనే సినిమాలో ఓ ముఖ్యపాత్రలో కనిపించనున్నారు. విద్యా బాలన్ తన అభిప్రాయాలను కూడా నిర్భయంగా వ్యక్తపరుస్తూ వస్తుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. సినీ పరిశ్రమలో మార్పులు అనివార్యమని, కాలానుగుణంగా నటీనటులూ మారాలని ఆమె సూచించారు. ముఖ్యంగా హీరోయిన్లు అవకాశాలను బట్టి తమను తాము కొత్తగా ఆవిష్కరించుకుంటూ ఉండాలి అని అభిప్రాయం వ్యక్తం చేశారు. అప్పుడే వారు దీర్ఘకాలం పరిశ్రమలో కొనసాగగలరని.. లేకపోతే అభిమానులకు దూరవుతారని.. ఫేడవుట్ అవుతారని స్పష్టం చేశారు. తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ, చిన్నతనంలో తాను చాలా అల్లరి చేసేవాడినని, రాత్రిళ్లు మేలుకొని ఉండటం తన అలవాటని, ఆ అలవాటు-ను విడిచిపెట్టడం పెద్ద సవాలుగా మారిందని చెప్పారు. సినిమాలు తన జీవితంలో కీలకపాత్ర పోషించాయని, అవే తనను పూర్తిగా మార్చేశాయని వెల్లడించారు. పెళ్లి తర్వాత కూడా సినిమాలలో కొనసాగడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా.. విద్యా బాలన్ చివరిసారిగా భూల్ భూలైయా 3 మూవీలో కనిపించారు.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056